సాహితి గత వారంరోజులుగా మెప్పొంది...
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు  fb.com/vaartha

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-2-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 19 పేజీలు: 12 వెల: 6.50


అధ్యక్ష ఎన్నికల సర్వేలో జెలెన్‌స్కీకి 57% రేటింగ్

'సంగమం' నీరు తాగేందుకు సరైనదే: యుపి సిఎం

9లో

# ప్రకృతి సేద్యంతో మరింత వృద్ధి

**● అమెరికా సంస్థల సహకారం తీసుకుంటున్నాం ● రైతు సాధికార సంస్థతో త్వరలో ఒప్పందం ● 28-29 నాటికి 50 లక్షల ఎకరాల్లో అమలు ● రైతుల సహకారంతో సేద్యంలో కొత్త పుంతలు: సిఎం చంద్రబాబు**



**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో వ్యవసాయరంగం కీలక ఆర్థిక వనరని రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ రంగంలో విస్తారమైన ఉత్పత్తులు, గణనీయ లాభాలను తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాలను సాధించుకోవాలనుకుంటున్నామన్నారు. తమ లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడుల సహకారాన్ని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రమోట్ చేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 5 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం సాగవుతోంది. 2028-29 నాటికి రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించి.. తద్వారా 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం సాగయ్యేలా చూడాలని ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. ఈ గమ్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం వివిధ దిశల్లో ప్రయత్నాలు చేస్తోంది. రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి సేద్యం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరిస్తోంది. మరోవైపు ఈ రంగంలో ఉన్న అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మరోవైపు రైతుకు అవసరమైన తోడ్పాటును అందించేందుకు వివిధ సంస్థలతో కలిసి పనిచేయనుంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల దావోస్ పర్యటనలో పలు సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఎపితో కలిసి పనిచేసేందుకు రావాలని పలు సంస్థలను ఆహ్వానించారు.

ఈక్రమంలో చంద్రబాబుతో దావోస్‌లో భేటీ అయిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థల ప్రతినిధులు ఎపికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకలిశారు. పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఛైర్మన్ క్రేయిగ్ కోగుట్, ఆపరేటింగ్ అడ్వైజర్ గినా మెగ్‌కార్తీ, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సిఇఒ కీత్ అగోడా ముఖ్యమంత్రితో సచివాలయంలో సమావేశం అయ్యారు. దావోస్ సమావేశానికి కంటిన్యూ మీటింగ్‌గా జరిగిన నేటి సమావేశంలో రానున్న రోజుల్లో కలిసి పనిచేసే అంశాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం, భిన్నమైన వాతావరణాన్ని తట్టుకోగల పంటలను అందించడం, రైతు నుండి వినియోగదారు వరకు ఎండ్‌టుఎండ్ అనుసంధాన వ్యవస్థను రూపొందించడం, మార్కెట్ డెవలప్‌మెంట్, ఫైనాన్సింగ్, డేటా మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయడంపై ఈ సంస్థలు సహాయపడనున్నాయి.

పబ్లిక్, ప్రైవేట్ సంస్థల నుంచి ఆర్థిక సాయాన్ని అందిచేందుకు సహకారాన్నిస్తాయి. ప్రకృతి వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ కోసం ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రమోట్ చేస్తాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన రైతు సాధికార సంస్థతో పెగాసస్ >>2

# ఢిల్లీ సిఎం రేఖా గుప్తా



**బిజెపి ఎల్‌పి సమావేశంలో ఏకగ్రీవ ఎన్నిక**

**డిప్యూటీ సిఎంగా పర్వేష్ సింగ్ వర్మ, అసెంబ్లీ స్పీకర్‌గా విజేంద్ర గుప్తా, మంత్రులుగా ఆరుగురు ఎంపిక**

**నేడు రామ్‌లీలా మైదాన్‌లో ప్రమాణం**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశరాజధాని కేంద్రపాలితప్రాంతర ఢిల్లీ ముఖ్యమంత్రిగా బిజెపి మహిళానేతనే ఎంపికచేసింది. విద్యార్థిదశనుంచే బిజెపి రాజకీయాల్లో కొనసాగిన రేఖాగుప్తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిజెపి శాసనసభా పక్ష సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దాదాపు రెండున్నరదశాబ్దాల తర్వాత ఢిల్లీ మళ్లీ బిజెపి పాలనలోకి వచ్చింది బిజెపి పరంగా రెండోమహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా కాగా ఢిల్లీని పాలించిన మహిళా ముఖ్యమంత్రుల్లో నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా నిలిచారు. 15ఏళ్లపాటు కాంగ్రెస్ నాయకురాలు షీలాదీక్షిత్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఆ తర్వాత సుష్మస్వరాజ్ బిజెపినుంచి సిఎంగా పాలనచేస్తే ఆతర్వాత అదికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీపార్టీ చివరి రోజుల్లో ముఖ్యమంత్రిగా అతిశిమర్లేనా కొనసాగారు. ఇపుడు నాలుగోమహిళా సిఎంగా రేఖాగుప్తా ఎన్నికయ్యారు. షాలిమార్‌బాగ్‌నుంచి ఎన్నికల్లో గెలిచి మొదటిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. రేఖాగుప్తా ఢిల్లీ బిజెపి ప్రధాన కార్యదర్శిగా, బిజెపి మహిళామోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగాకూడా ఉన్నారు. >>2

## డబ్బున్న దేశానికి 21 మిలియన్ డాలర్లు ఎందుకివ్వాలి?

**భారత్‌పై ట్రంప్ వ్యాఖ్య**

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో వృథా వ్యయం కట్టడికోసం రూపొందించిన డోజ్ విభాగం నిర్ణయాలు వివాదాస్పదం అవుతున్నాయి. భారత్‌లోజరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్ల ఫండ్‌ను ఇటీవల ఈ విభాగం రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమర్థించారు. అమెరికా పన్నుచెల్లింపుదారుల సొమ్ము ఎందుకు ఇవ్వాలంటూ ప్రశ్నించారు. ఫ్లోరిడాలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ భారత్‌కు మేం ఎందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలి వారి వద్ద చాలాడబ్బు ఉంది. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలుచేస్తున్న దేశాల్లో అది ఒకటి. ఆవిషయంలో అమెరికా ఎప్పుడూ భారత్‌ను చేరుకోలేదు. నాకు ఆదేశంపట్ల చాలా గౌరవం ఉంది కానీ వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా మనదేశంలో ఓటర్ల పరిస్థితి ఎలాఉంది అని ట్రంప్ ఎదురు ప్రశ్నలు వేసారు. ఇతరదేశాలకు ఇచ్చే నిధుల్లో కోత విదిస్తూ ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ నేతృత్వంలోని డోజ్ ఈనెల 16న జాబితా ప్రకటించింది. అందులో భారత్‌కు ఉద్దేశించిన నిధులను కూడారద్దుచేసినట్లుప్రకటించింది. బంగ్లాదేశ్,నేపాల్‌లకు కేటాయించిన ఫండ్స్ కూడా రద్దుచేసింది.

# ఆధ్యాత్మిక పర్యాటకంలో ఎపి టాప్



బుధవారం తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ ఆలయాల కన్వెన్షన్, ఎక్స్‌పో 2025 ముగింపుసదస్సులో మంత్రి లోకేష్

**రాష్ట్రంలో 27,105 ఆలయాలున్నాయి..**

**సంస్కృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత**

**ఐటి సిఐక్స్ ముగింపు సదస్సులో మంత్రి లోకేష్**

**తిరుమల, ఫిబ్రవరి 19ప్రభాతవార్త ప్రతినిధి:** భారతదేశంలో హిందూ సంస్కృతిలో ఆలయాలు, పండుగలు,పూజలు కీలకమైన భాగమని, ఇది మనజీవన విధానమని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలిపారు. దీన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎంత సాంకేతికత, కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)వచ్చినా మానవ సమాజాన్ని నడిపించేది ఆ దేవదేవుడేనని భక్తి తత్త్వం తెలియజేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు కూడా వారి ప్రయోగం విజయవంతం కావాలని చెంగాలమ్మ ఆలయంలోనో, తిరుమల శ్రీవారి ఆలయంలోనో ముందురోజు పూజలు చేస్తారని ఆయన గుర్తుచేశారు. నమ్మకం మాత్రమేగాక ఇదొక విజయమన్నారు. అందుకే ప్రజల్లో భక్తిభావాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు, దేవాలయ వ్యవస్థలు, సంస్థలు కృషి చేయాలని సూచించారు. తిరుపతిలో జరుగుతున్న అంతర్జాతీయ ఆలయాల కన్వెన్షన్, ఎక్స్ ఫో(ఐటిసిఎక్స్)2025 ముగింపుసదస్సు బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్రమంత్రి నారాలోకేశ్ హాజరై ఆధ్యాత్మికత, భక్తిభావం, ఆలయాల ప్రాశస్త్యం గురించి చక్కగా వివరించారు. వాట్సాప్ ద్వారా ఆలయాల సేవలు, డ్రోన్ నిఘా వంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలతో మన ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుకుంటూ, ఆలయాల పాలనావ్యవస్థను ఆధునీకరించడంలో రాష్ట్రప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సానుకూల నాయకత్వం, పరివర్తనాత్మక మార్పును తీసుకురాగలదనడానికి ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు నిదర్శనమన్నారు.

వేంకటేశ్వర నిత్యఅన్నదాన పథకాన్ని తిరుమలలో 1985లో ఎన్టీఆర్ ప్రారంభించారన్నారు. ఈ పథకాన్ని రామారావు కోటి కార్పస్ ఫండ్‌తో ప్రతిరోజూ 2వేలమంది యాత్రికులకు అన్నదానంతో ప్రారంభించారన్నారు. 2001లో చంద్రబాబు ప్రాణదానం ట్రస్ట్ ఏర్పాటుచేసి, ఔట్‌ఫేషెంట్, ఇన్‌ఫేషెంట్ చికిత్సలు, శస్త్రచికిత్సలు, మందులు, భోజనం వంటి సదుపాయాలను ఈ ట్రస్ట్ అందిస్తోందన్నారు. ప్రస్తుతం 440 కోట్లతో ఈ ట్రస్ట్ విస్తృతమైన సేవలందింస్తోందన్నారు.

**ఆధ్యాత్మిక పర్యాటకరంగంలో అగ్రగామి:**

గ్లోబల్ ఆలయాల నిర్వహణ వ్యవస్థ,విధాన రూపకర్తలు, నిపుణులను ఒకేచోట చేర్చడంలో ఈ కార్యక్రమం మైలురాయిగా నిలుస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు. మొన్న ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద జరిగిన పవిత్ర మహాకుంభమేళాకు హాజరైనందుకు నేను ఎంతో ఆనందించానన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మికంగానేగాక ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా అందిపుచ్చుకోవడంలో ముందున్నాయనడానికి ఐటిసిఎక్స్ >>2

## మిర్చి రైతులను ఆదుకోండి

**కేంద్రమంత్రి చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ**

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** మిర్చి రైతులను ఆదుకునేలా చర్యలుమిర్చి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని సిఎం చంద్రబాబు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. మార్కెట్ జోక్యం ద్వారా తగ్గిన ధరను భర్తీ చేసేలా చూడాలని కోరారు. సాగు వ్యయానికి, విక్రయధరకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని కోరారు. 50 శాతం నిష్పత్తిలో కాకుండా వందశాతం నష్టాన్ని కేంద్రం భరించాలని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకోవాలని చంద్రబాబు కోరారు రాష్ట్రంలోని మిర్చి రైతులకు సాధ్యమైనంత మేర సహకరించాలని, ప్రస్తుతం ఉన్న కేంద్రం మద్దతు ధరను కూడా పెద్ద ఎత్తున పెంచాలని కేంద్రాన్ని కోరారు.. ఈ విషయంలో కేంద్రానికి ఇప్పటి వరకూ నాలుగు లేఖలు రాయడం జరిగిందన్నారు. అయితే గత పదేళ్లలో మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13,600/ లు మాత్రమే ఉందని ఆయన తెలిపారు.

కేవలం గత రెండేళ్లు మాత్రమే అంతర్జాతీ >>2

## గగన్‌యాన్ జి1 కోసం సి32 దశ మోటార్ ఇంజిన్ సిద్ధం

2లో



బుధవారం సివిల్ సప్లై జిల్లా అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

# ఇక మెరుగైన పౌరసరఫరాలు

**ఇప్పటిదాకా 32 లక్షల మె.ట. ధాన్యం కొనుగోలు**

**రూ. 7,522 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం: మంత్రి నాదెండ్ల**

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు అందిస్తున్న సేవల్లో లోపాలను గుర్తిస్తూ మరింత మెరుగైన సేవలందించేందుకు డీఎస్వోలు, డీఎంలు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కానూరులోని సివిల్ సప్లై భవన్‌లో మంత్రి అధ్యక్షతన బుధవారం ఉదయం సివిల్ సప్లై జిల్లా అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అధికారులందరూ కలిసి టీం స్పిరిట్‌తో పని చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజలకు జవాబుదారీతనం పెంచే విధంగా పనిచేయాలని, ఇక్కడ సివిల్ సప్లై కార్పొరేషన్ సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ రెండు >>2

## ఆరోగ్య మంత్రి ఆకస్మిక తనిఖీలు

**విజయవాడ.ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ జీజీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఓపీ కౌంటర్లు పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఔషధాలు అందుబాటులో ఉన్నాయా ? లేవా ? అని ఆరా తీశారు. స్ట్రెచర్లు, వీల్ ఛైర్లపై రోగులను తీసుకెళ్లే సిబ్బంది కొరత ఉందని, త్వరలోనే నియామకాలు చేపడతామన్నారు. సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లిన ఆసుపత్రి సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపడుతున్నామంటున్న మంత్రి సత్యకుమార్ రోగులతో ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నాను.ఆస్పత్రిలో శుభ్రత చాలా బాగుంది. సిబ్బంది ఓపికగా పని చేస్తున్నారు. మంచి ఆహారం అందిస్తున్నారు.

కొంత సిబ్బంది కొరతఉంది. దానికోసం నియామకాలు చేపడుతున్నాం. వాస్తవానికి గతం కంటే పరిస్థితులు మెరుగయ్యాయి. మరిన్ని సదుపాయాల కోసం కృషిచేస్తాం. డాక్టర్లు అందరూ పేషెంట్లతో ఎలా వ్యవహరిస్తున్నారని వాళ్లను అడిగి తెలుసుకు న్నాను. సిబ్బంది తమను చాలాబాగా చూసు కుంటున్నారని తెలిపారు. ఒపి సేవలు త్వరితగతిన జరుగుతున్నాయ >>2

# రాష్ట్రంలో బతకలేని రైతు

**కర్షకుల కష్టాలను పట్టించుకోని సిఎం చంద్రబాబు**

**అక్రమ కేసులకు మూల్యం తప్పదు..**

**గుంటూరు మిర్చియార్డులో రైతుల కష్టాలను పరిశీలించిన మాజీ సిఎం జగన్**

**'కోడ్' ఉల్లంఘించారని జగన్ సహా పలువురిపై కేసులు నమోదు**



బుధవారం గుంటూరు మిర్చియార్డులో రైతులతో మాట్లాడుతున్న మాజీ సిఎం జగన్

**గుంటూరు, ఫిబ్రవరి19, ప్రభాతవార్త ప్రతినిధి, :** వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి గుంటూరులోని మిర్చి యార్డులో గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడుతున్న రైతులతో మాట్లాడేందుకు అదే విధంగా వారి సమస్యలను తెలుసుకోవడానికి బుధవారం గుంటూరు మిర్చి యార్డుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి శ్రేణులు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జగన్ వారికి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. జగన్ మిర్చి యార్డ్ లోకి వెళ్లి అక్కడి రైతులకు కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నాడు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన మిర్చి పంటకు కనీసం రూ.10 నుంచి రూ.11 వేల గిట్టుబాటు ధర కూడా రావడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.21 నుంచి రూ.27వేల వరకు గిట్టుబాటు ధర కల్పించామని గుర్తుచేశారు. గిట్టుబాటు ధర లభించక మిర్చి రైతులు విలవిల్లాడిపోతున్నారని కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో అన్ని విధాల విఫలమైందని మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించక అయిన కాడికి అమ్ముకొని నష్టాల పాలవుతున్నారని కనీసం ఈ జిల్లాలో యార్డుకు కూతవేటి దూరంలోని ఉన్నా సిఎం చంద్రబాబు నాయుడుకు మిర్చి ధరల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అధికారం చేపట్టి ఎనిమిది నెలలైనా రైతులకు భరోసా ఇవ్వలేకాపోయింది అని అన్నారు. తన ప్రభుత్వం భయంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను అన్ని విధాల ఆదుకోవడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, దిగుబడి >>2

# ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి19, ప్రభాతవార్త ప్రతినిధి:** సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రేపు జరగనున్న ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనున్నారు. ఢిల్లీలో చంద్రబాబు పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. హోం మంత్రి అమిత్ షా, కేంద్ర జల శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో భేటీ అయ్యే అవకాశం ఉంది.

**రాష్ట్ర పరిస్థితులపై ఢిల్లీ పెద్దలతో చర్చలు**

రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులు, ఇతర సాయం పై అమిత్ షాతో సిఎం చంద్రబాబు భేటీ కానున్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ తో భేటీలో పోలవరం ప్రాజెక్టుకు నిధుల విడుదల గురించి చర్చించనున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలను 17,500 క్యూసెక్కుల నీటి తరలింపు సామర్థంతో నిర్మించేందుకు అవసరమైన ఆర్థిక సాయం పై చర్చించే అవకాశం ఉంది. కేంద్ర >>2

# రాష్ట్రాలకు 1,554.99 కోట్ల విపత్తు సాయం

**● ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు ● తెలంగాణకు రూ. 231.75 కోట్లు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** గత ఏడాది సంభవించిన తుఫాను, వరదలతో నష్టపోయిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటించింది. ఈ వరద సాయం కింద వివిధ రాష్ట్రాలకు నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి కేంద్రం అదనంగా కేటాయించిన మొత్తం రూ.1554.99 కోట్ల రూపాయలను విడుదల చేయనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ బుధవారం నాడు 5 రాష్ట్రాలకు రూ.1554.99 కోట్ల అదనపు సాయాన్ని ఆమోదించింది. 2024లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు నాగాలాండ్, ఒడిశా, త్రిపుర రాష్ట్రాల్లో సంభవించిన విపత్తులకుగానూ కేంద్రం ఆయా రాష్ట్రాలకు విపత్తు సాయంపై నిర్ణయం తీసుకుంది. ఎపి, తెలంగాణలో ఆకస్మిక వరదలు రావడం సహా కొండ చరియలు విరిగి పడటం లాంటి ప్రకృతి విపత్తులు జరిగిన రాష్ట్రాలకు కలిపి నిధులు కేటాయించింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.608.08 కోట్లు, రూ. తెలంగాణకు రూ.231.75 కోట్లు, త్రిపురకు రూ. 288.93 కోట్లు, ఒడిశాకు రూ.255.24 కోట్లు, నాగాలాండ్‌కు రూ.170.99 కోట్లు విడుదలకు నిర్ణయం తీసుకుంది. విపత్తులు సంభవించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకు విపత్తు నష్టం అంచనాకు మంత్రులు, అధికారుల బృందాలను పంపి రిపోర్ట్ తెప్పించింది. ఆ వివరాలు పరిశీలించిన కమిటీ ఆయా రాష్ట్రాల్లో సంభవించిన నష్టానికిగానూ అదనపు వరద సాయంపై >>2



బుధవారం పూణెలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్

# ఢిల్లీ సిఎం రేఖా గుప్తా

>> 50 ఏళ్ల రేఖా 1974 హర్యానాలోని జింద్ జిల్లాలోని నందగఢ్ గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి భారతీయ స్టేట్‌బ్యాంకులో అధికారి. రేఖ కుటుంబం 1976లోనే ఢిల్లీకి మకాం మార్చింది. అప్పటికి ఆమె వయసు రెండేళ్లుమాత్రమే. రేఖ గుప్తా ప్రాథమిక విద్యనుంచి ఉన్నత విద్య మొత్తం ఢిల్లీలోనే పూర్తిచేసారు. బాల్యంలోనే రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ విద్యార్థి విభాగం అఖిలభారతీయ విద్యార్థిపరిషత్‌లో చేరారు. ఆ తర్వాత ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుతున్నపుడు ఆమె దౌలత్‌రామ్ కళాశాలలో కార్యదర్శిగా విజయం సాధించారు. 1995-96లో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీచేసి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రేఖ న్యాయశాస్త్రంలో ఎల్‌ఎల్‌బి పూర్తిచేసారు.

చదువు అనంతరం రేఖగుప్తా 2003–04లో బిజెపి యువమోర్చా ఢిల్లీ యూనిట్‌లోచేరి కార్యదర్శి పదవినికూడా చేపట్టారు. 2007లో ఉత్తర పీతంపుర డివిజన్‌నుంచి కౌన్సిలర్ అయ్యారు. 2007-09లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మహిళా సంక్షేమం, శిశుఅభివృద్ధి కమిటీకి రెండేళ్ల ఛైర్‌పర్సన్‌గా కొనసాగారు. 2009లో ఢిల్లీ బిజెపి మహిళామోర్చా ప్రధానకార్యదర్శి. 2010లో బిజెపి ఆమెకు జాతీయ కార్యవర్గసభ్యురాలి హోదాను కల్పించింది. రేఖా గుప్తా ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొని రెండుసార్లు ఓటమి చవిచూసారు. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్‌బాగ్ స్థానం నుంచి పోటీచేసారు. ఆప్‌కు చెందిన వందన కుమారితోతో సుమారు 11వేల ఓట్లతేడాతో ఓటమిచవిచూసిన రేఖా రెండోసారి కూడా 3400 ఓట్లతేడాతో ఓటమి పాలయ్యారు. అయితే 2025 అసెంబ్లీ ఎన్నికల్లో అదే వందన కుమారిని 29వేల పైచిలుకు ఓట్లతేడాతో ఓడించి మొదటిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. రేఖాగుప్తా ఎంపికను చివరి నిమిషందాకా గోప్యంగానే ఉంచింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లో అనుసరించిన వ్యూహాన్నే ఢిల్లీకి కూడా బిజెపి వర్తింపచేసింది. అలాగే బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళా సిఎం ఎవ్వరూ లేకపోవడంతో ఢిల్లీకి మహిళా సిఎంను నిలబెట్టాలన్న వ్యూహంతోనే రేఖాగుప్తాను ఎంపికచేసారు. దీనితోడు పార్టీ రాజకీయాల్లో విద్యార్థి దశనుంచి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న గుప్తాను అనూహ్యంగా విజయం వరించింది.మొదటిసారి ఎమ్మెల్యే కావడం ఆపై వెనువెంటనే సిఎం పదవి ఆమెను వరించడంలో పార్టీశ్రేణులు కూడా ఆమెను అభినందిస్తున్నాయి.

**డిప్యూటీ సిఎంగా పర్వేష్‌సింగ్ వర్మ**

కాగా సిఎంగా మహిళా అభ్యర్థిని ఎంపికచేసిన బిజెపి డిప్యూటీ సిఎంగా కేజ్రీవాల్‌పై గెలిచిన పర్వేష్ సాహెబ్ సింగ్ వర్మను ఎంపికచేసారు. అలాగే స్పీకర్ విజయేంద్రగుప్తాను ఎంపికచేసినట్లు బిజెపి హైకమాండ్ వెల్లడించింది. పరిశీలకులుగా మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్, పార్టీ జాతీయ కార్యదర్శుల సమక్షంలోనే జరిగిన శాసనసభా పక్ష సమావేశంలో ఏకగ్రీవంగా రేఖాగుప్తాను ఎన్నుకున్నారు. ఇక గవర్నర్ వికె సక్సేనాను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరతారు. సిఎంతోపాటు సుమారు ఆరుగురు కేబినెట్‌మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారని తెలిసింది. మధ్యాహ్నం 12.30 గంటలకు రామ్‌లీలామైదాన్‌లో ప్రముఖుల సమక్షంలో ప్రమాణస్వీకార వేడుకలు జరుగుతాయి.

**ప్రధానిమోడీ, అమిత్‌షాల హాజరు**

కాగా ప్రమాణస్వీకార సభకు ప్రధానిమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ఇతర కేంద్ర మంత్రులతో పాటు బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పార్టీ సీనియర్ నాయకులతోపాటు పారిశ్రామికవేత్తలు, బాలివుడ్ నటులు, ఇన్వెస్టర్లు అందరూ హాజరవుతున్నారు. సుమారు 50వేలమందికిపైగా ఈ రామ్‌లీలామైదాన్ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా. ఇందుకు సంబంధించి ఢిల్లీయంత్రాంగం ఇప్పటికే భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లుచేసింది.

# కృష్ణపట్నం భూముల బదలీకి ఉత్తర్వులు

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** చైన్నై బెంగుళూరు పారిశ్రామిక నడవా పరిధిలోని కృష్ణపట్నం నోడ్‌కు సంబంధించిన 2500.4 ఎకరాలను ఏపీఐఐసీ నుంచి ప్రత్యే వాహక నౌక కు ఔట్‌రైట్ సేల్స్ విధానంలో బదిలీ చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ భూములకు సంబంధించి ఇండియన్ స్టాంప్ చట్టం సెక్షన్ 9 ప్రకారం వర్తించే మినహాయింపులను పరిశీలించాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 2139.15 ఎకరాలను బదిలీ చేసేందుకు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఆ భూముల బదిలీకి నిర్దేశించిన రూ.34 కోట్లు స్టాంపుడ్యూటీ కింద మినహాయింపులిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది.

# ఢిల్లీ వెళ్లిన సిఎం చంద్రబాబు

>> వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మిర్చి రైతుల సమస్యలపై సిఎం మాట్లాడనున్నారు. మిర్చి ధర పతనంతో కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను ఆదుకునేందుకు ఇప్పటికే చంద్రబాబు లేఖలు రాశారు. ఈ రాత్రికి సిఎం తిరిగి అమరావతి చేరుకోనున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన కారణంగా గురువారం జరగాల్సిన కేబినేట్ భేటీ వాయిదా పడింది.

# ప్రకృతి సేద్యంతో మరింత వృద్ధి

>> క్యాపిటల్ అడ్వైజర్స్, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సంస్థలు ఎంవోయూ చేసుకోనున్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అవకాశాలను, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను ప్రస్తుత పరిస్థితులను ఆ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని.. ఆరోగ్యంపై శ్రద్ధపెరుగుతోందని అన్నారు. తాము తీసుకునే ఆహారంపై వారు అవగాహన కోరుకుంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తుల సర్టిఫికేషన్, ట్రేసబులిటీ అనేది కీలకం కానుందని అన్నారు. ఆ దిశగా తాము రైతులను, ఉత్పత్తి దారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రకృతి సేద్యం తన కల అని సిఎం చెప్పారు. రైతుల్లో చైతన్యం తెచ్చి అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం అని అన్నారు. దీనికి సహకరించాల్సిందిగా ఆ సంస్థల ప్రతినిధులను కోరారు. మేము వ్యవసాయంలో జాతీయ స్థాయిలో అన్ని సాగుపద్ధతుల్లోను, ఉత్పత్తిరంగంలో ముందంజన ఉండాలనుకుంటున్నాం,ఇందుకు మీ సహకారం ఇవ్వాలని పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్‌ను సిఎం చంద్రబాబునాయుడు కోరారు.ఈ సమావేశంలో వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్ననాయుడు పాల్గొన్నారు.

# ఆరోగ్య మంత్రి ఆకస్మిక తనిఖీలు

>> న్నారు. మందులు తీసుకునే దగ్గర కాస్త క్యూ ఉంది. దాని నివారణకు మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.ఎటువంటి సంక్లిష్ట వ్యాధుల నియంత్రణ,నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గుల్లియన్ బారీ సింద్రోమ్ (జిబిఎస్) విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల (జిజిహెచ్)లో తగిన వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి సత్య కుమార్ యాదవ్ మీడియాకు తెలిపారు. జిబిఎస్ కేసుల వివరాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి, ఈ వ్యాధి సోకడానికి, విస్తరించడానికి గల కారణాలను గుర్తించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న ఈ వ్యాధి లక్ష మందిలో ఒకరిద్దరికి మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో గత ఏడాది పది ప్రభుత్వ ఆసుపత్రుల్లో 301 కేసులు నమోదుకాగా, వీటిలో అధిక మొత్తంలో 115 కేసులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నమోదవ్వడానికి కారణం ఆ ఆసుపత్రిలో న్యూరాలజీకి సంబందించిన అన్ని రకాల వైద్య సేవలు, ఔషదాలు అందుబాటులో ఉండటమేనన్నారు. అదే విధంగా ఈ ఏడాది జనవరిలో 43 కేసులు నమోదు కాగా వారిలో 17 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో జిబిఎస్ వ్యాధి బారిన పడిన వారికి తగిన వైద్య సేవలు అందజేసేందుకు అవసరమైన ఇమ్యూనోగ్లోబులిన్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని, ఏఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒక పేషంట్ కి రోజుకి ఐదు ఇంజక్షన్లు ఐదు రోజుల పాటు ఇవ్వాల్సి ఉంటుందని, బహిరంగ మార్కెట్ లో ఈ ఇంజక్షను ఖరీదు దాదాపు రూ.20 వేల వరకూ ఉందని, అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో దీన్ని ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఎన్.టి.ఆర్.వైద్య సేవ పథకం క్రింద కూడా ఈ వ్యాధి కవర్ చేయబడుతున్నదన్నారు.

# ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

**వెంకటగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్తం** తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణానికి చెందిన 10వ తరగతి విద్యార్థినికి గర్భవతిని చేసిన ఇద్దరిపై వెంకటగిరి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. 10వ తరగతి చదువుతున్న తన కూతురును ఇద్దరు వ్యక్తులు గర్భవతిని చేశారంటూ బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత కొన్నిరోజులుగా బాలిక శరీరంలో మార్పులు గమనించి బిడ్డకు ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా గర్భవతిగా నిర్ధారణ చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో షేక్ రబ్బానీ (38),చినబాబు అలియాస్ బాలు (33)లను ప్రాథమికంగా నిందితులుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎవి రమణ తెలిపారు.

# మిర్చి రైతులను ఆదుకోండి

>> యంగా కొన్ని కారణాలు వల్ల మిర్చి రైతుకు రూ.20వేల ధర పలికిందన్నారు. బిందు సేద్యాన్ని ప్రోత్సహించే విధంగా డ్రిప్ / స్ప్రింక్లర్లను ఏఒక్కరికీ పంపిణీచేయలేదన్నారు. దాదాపు రూ.1600 కోట్లు మేర ధాన్యం కొనుగోలు బకాయిలను పెట్టిపోతే, తాము అధికారంలోకి వచ్చిన వెంటే రైతులకు ఆ సొమ్మును చెల్లించడం జరిగిందన్నారు. గడిచిన 10 ఏళ్లుగా మిర్చి ఉత్పత్తి ధరలపై వివరాలను సిఎం సమర్పించారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కలిసి రైతులకు సాయంపై వెంటనే జోక్యం చేసుకోవాలని కోరనుంది.ఈ క్రమంలోనే ఆయనకు సీఎం చంద్రబాబు లేఖలను రాసారు..ఈ నేపథ్యంలో మిరప ధరలపై సీఎం చంద్రబాబు అధికారులు ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. గతేడాది డిసెంబరు 26 ఈ ఏడాది ఫిబ్రవరి 5,11 తేదీల్లో కేంద్రానికిలేఖలురాశారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఎంపీలు కూడా కేంద్రపెద్దలను కలసి సమస్యను వివరించారు. గురువారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రిని కలిసి రైతుల సమస్యలపై వివరించనున్నట్లు సమావేశంలో సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.

# 1,554.99 కోట్ల విపత్తు సాయం

>> ప్రకటన చేసింది.

కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో వరదలు కారణంగా నష్టపోయిన రాష్ట్రాలకు గతంలోనే ఎస్‌డిఆర్‌ఎఫ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 27 రాష్ట్రాలకు గానూ మొత్తం రూ.18,322.80 కోట్లు విడుదల చేసింది. అదే విధంగా ఎన్‌డిఆర్‌ఎఫ్ నుంచి 18 రాష్ట్రాలకు రూ.4,808.30 కోట్లు కేంద్రం అందించింది. రాష్ట్ర విపత్తునిధి నుంచి 14 రాష్ట్రాలకుగారూ రూ.2208.55 కోట్లు, జాతీయ విపత్తు నిధి నుంచి 8 రాష్ట్రాలకుగానూ కేంద్రం ఇదివరకే రూ.719.72 కోట్లు విడుదల చేయడం జరిగింది. ఇక ఎన్డీఏ మిత్రపక్షాలలో ఎపి, బిహార్‌లకు అధిక వాటా కేటాయించారని తెలంగాణకు తక్కువ కేటా యించారని విమర్శలు చోటు చేసుకున్నాయి.



బుధవారం సమావేశమైన మూడు రాష్ట్రాల జలవనరుల మంత్రులు ఉత్తమ్, డికె శివకుమార్, నిమ్మల

## సానుకూల వాతావరణంలో చర్చించుకుందాం

# నీటి వివాదాలు పరిష్కరించుకుందాం

## మూడు రాష్ట్రాల జల వనరుల మంత్రుల ఏకాభిప్రాయం

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర జలశక్తి సంఘం ఆధ్వర్యంలోని అఖిలభారత స్థాయి ఇరిగేషన్ మంత్రుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, డికె శివకుమార్,ఉత్తమ కుమార్ రెడ్డిలు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు ఒకవైపు కర్ణాటక, మరోవైపు తెలంగాణ సరిహద్దుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 3 రాష్ట్రాల సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది.ఎవరు నష్టపోకుండా మూడు రాష్ట్రాల రైతులు శ్రేయస్సు కోసం సమిష్టి నిర్ణయాల ద్వారా, సంప్రదింపుల ద్వారా కలసి కృషి చేద్దాం అన్నారు. తుంగభద్ర నీటి నిల్వ, పూడిక వంటి అంశాలతో పాటు ఇతర అంశాలు చర్చకు వచ్చాయి.ఈ సందర్భంలో రామానాయుడు మాట్లాడుతూ, ఈ ఏడాది నీటిని కాకుండా, గత పది సంవత్సరాలుగా కృష్ణానదికి వస్తున్న నీటిని చూడాలని వారి దృష్టికి తీసుకెళ్ళారు.కృష్ణా నది దిగుకు నీరు రావడం కష్టమవుతుందని ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల వంటి ప్రాజెక్టులు నిండితేనే, కిందకు నీరు వస్తుందని రామానాయుడు వివరించారు. ఈ దశలో కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ ఆయికట్టులకు నీరందించడం కష్టంగా మారిందని నిమ్మల వివరించారు. అలాగే శ్రీశైలం నాగార్జునసాగర్ జలాశయాల్లో ఉన్న నీటిని తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఉభయ రాష్ట్రాల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. తద్వారా ఇరు రాష్ట్రాల రైతులకు ఎటువంటి పంట నష్టం, తాగు నీటి ఇబ్బంది లేకుండా జూన్ వరకు ప్రణాళిక బద్ధంగా పరస్పర అంగీకారంతో పనిచేయాలనుకున్నారు.తుంగభద్ర రిజర్వాయర్ పూడికతీతకు ప్రత్యామ్నాయంగా చేపట్టవలసిన చర్యలు గురించి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఎపి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలుస్తానని కోరారు. ముందు తగు ప్రతిపాదనలతో అధికారుల స్థాయిలో చర్చించి ఆ తదుపరి ముఖ్యమంత్రిని కలవొచ్చని ఆయనకు సూచించారు.

# పోలవరం ప్రాజెక్టు నిర్దేశిత గడువులోగా పూర్తి

## కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఉదయ్ పూర్ లో అఖిల భారత స్థాయిలో జరుగుతున్న రాష్ట్రాల జల వనరుల శాఖ మంత్రుల సమావేశానికి హాజరైన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ప్రత్యేకంగా కలిసారు. ఆయనకు రాష్ట్ర నీటి వనరులు, జరుగుతున్న పనులు, కావాల్సిన సాయం తదితర అంశాలతో నివేదిక అందజేశారు.నివేదిక లోని అంశాలను విన్న మంత్రి సానుకూలంగా స్పందించారు.ప్రధాని మోదీ కూడా పోలవరం ప్రాజెక్టు ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసు కుంటున్నట్లు చెప్పారు.త్వరలో తాను కూడా పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వస్తానని హామీ ఇచ్చారు.తొలుత రామానాయుడు రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు జల వనరుల శాఖ మంత్రి సి ఆర్ పాటిల్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టుని మూడుసార్లు సందర్శించి, పోలవరం పూర్తికి గడువును 27 డిసెంబర్ కు నిర్దేశించి నిర్దేశించినట్లు మంత్రి నిమ్మల కేంద్రమంత్రికి వివరించారు.

సాంకేతిక అంశాలకు సంబంధించి డిజైన్లను త్వరితగతిన ఆమోదించి, పంపించాలని కోరారు. అలాగే 2025 డిసెంబర్ నాటికి డయా ఫ్రంవాల్ నిర్మాణం, 2027 డిసెంబర్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు, ఏజెన్సీలతో సిఎం రివ్యూలు చేస్తున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు కూడా ఇప్పటికే రెండు కట్టర్లతో మొదలయ్యాయని, మార్చి నుండి మూడో కట్టర్‌తో పనులు మొదలుపెడతామని చెప్పారు. డివాల్ నిర్మాణంతో పాటు సమాంతరంగా ఈసిఆర్ఎఫ్ నిర్మాణ పనులు చేపట్టే విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్యాప్1 లో ఇప్పటికే డివాల్ నిర్మాణం పూర్తయ్యిందని, ఈసిఆర్ఎఫ్ నిర్మాణానికి పెండింగ్ లో ఉన్న అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వివరాలను ప్రతినెలా, కేంద్రానికి తెలియచేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని, అందుకుగానూ, ప్రతి నెలా కేంద్రానికి పనుల వివరాలు పంపిస్తామని తెలిపారు.

# సిఇసిగా జ్ఞానేశ్వర్‌కుమార్ బాధ్యతల స్వీకారం

## కమిషనర్‌గా విధుల్లో చేరిన వివేక్ జోషి



బుధవారం సిఇసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జ్ఞానేశ్ కుమార్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గా ఎంపికచేసిన జ్ఞానేశ్ కుమార్ బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కొత్త కమిషనర్‌గా నియమితులయిన వివేక్‌జోషికూడా ఎన్నికల కమిషనర్‌గా విధుల్లోచేరారు. 2024 మార్చినెలనుంచి ఎన్నికలసంఘంలో కమిషనర్‌గా పనిచేస్తున్న జ్ఞానేశ్ కుమార్‌ను చీఫ్‌కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. ఈమేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నోటిఫికేషన్ కూడా జారీచేసారు. ఇప్పటివరకూ పనిచేసిన రాజీవ్‌కుమార్ పదవీకాలం పూర్తికావడంతో ఆయన మంగళవారమే పదవినుంచి దిగిపోయారు. ఇక రెండో ఎన్నికల సంఘం కమిషనర్‌గా ఉత్తరాఖండ్ కేడర్‌కు చెందిన సుఖ్‌బీర్‌సింగ్ సంధు కొనసాగుతు న్నారు. జోషి హర్యానాకేడర్ మాజీ ఐఎఎస్ అధికారి. ఆయన్ను కమిషనర్‌గా జ్ఞానేశ్వర్‌పనిచేసిన పోస్టులో నియమించారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే ముందు ప్రధాన లక్ష్యమని, అంతే కాకుండా 18 ఏళ్లనిండిన ప్రతిపౌరుడుకూడా ఓటరుగా నమోదుచేసుకోవాలని, ఓటు హక్కు వినియో గించుకుని తమకు నచ్చిననేతలను చట్టసభలకు ఎన్నుకునేవిధంగా అవగాహన పెంచాల్సిన కర్తవ్యం ఎన్నికల సంఘానిదేనని అన్నారు. ఎన్నికలసంఘం నిరంతరం ఓటర్లతో మమేకమై పనిచేస్తుందని ఆయన అన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 20-02-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
సప్తమి ఉ.9.59
విశాఖ మ.1.29
వర్జ్యం : సా.5.53-7.39
దు.ఉ.10.33-11.20, 2) మ.3.13-4.00
శుభసమయం : ఉ.8.15-8.40
రా.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో గౌరవం పొందుతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి.

**వృషభం:** కుటుంబ సమస్యలు వేధిస్తాయి. జీవిత భాగస్వామ్య సాయం అందిస్తారు.

**మిథునం:** ఆర్థిక ఇబ్బందుల నుండి కొంతవరకు బయటపడతారు.

**కర్కాటకం :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ప్రయాణాలు.

**సింహం:** అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకొంటారు.

**కన్య :** రుణాలు తీరి ఊరట చెందుతారు. విలువైన సమాచారం అందుకొంటారు.

**తుల :** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోని వారికి సన్మానాలు పొందుతారు.

**వృశ్చికం:** పాతమిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. ధనలాభం.

**ధనుస్సు:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

**మకరం:** గృహ నిర్మాణ ఆలోచనలు ఫలిస్తాయి. కొత్త మిత్రుల పరిచయం.

**కుంభం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. పనులు పూర్తి.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి వత్తిడులు ఎక్కువవౌతాయి. ఖర్చులు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్రంలో బతకలేని రైతు

>> ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతుల కష్టాలు కనిపించడం లేదని వారి బాధల పట్ల కనీసం కనికరం కూడా లేదన్నారు. రైతుల పట్ల కూటమి సర్ కార్యహరిస్తున్న తీరుపై మాజీ సిఎం జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలకు సూచించారు. రాజకీయ దురుద్దేశంతో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా ఎల్లకాలం ప్రభుత్వం ఇదే ఉండదని తమ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే ఎవరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తనను మిర్చి యార్డు సందర్శించకుండా అడ్డంకులు సృష్టించారని కనీసం ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన భద్రత కూడా కల్పించలేకపోయారని ఆరోపించారు. ఇవన్నీ కూడా తను గుర్తుపెట్టుకుంటానని అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి చేయాలో తనకు తెలుసునని జగన్ హెచ్చరించారు. జగన్మోహన్ రెడ్డితో తమ ఆవేదన వ్యక్తం చేసిన మిర్చి రైతులు.. మిర్చి యార్డులో రైతులను స్వయంగా కలిసి ధరల గురించి ఆరా తీశారు. రైతులు తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని జగన్ ఎదుట వాపోయారు. గతంలో మేలు రకం మిర్చి రూ.18,000 నుండి 20 వేల రూపాయల వరకు కొనుగోలు చేసేవారిని ప్రస్తుతం రూ. 10,000 రూపాయలు కూడా కొనే పరిస్థితి లేదని జగన్ వెదుట రైతులు వెల్లబుచ్చారు. యార్డులో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని మరికొందరు రైతులు జగన్ దృష్టికి తీసుకువచ్చారు. మరికొందరు రైతులు సీజన్లో మధ్యాహ్నం భోజనం కూడా సరిగా కొనసాగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి యార్డుకు మాజీ సిఎం జగన్ వస్తున్నారని సమాచారంతో వైసీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు.

**ఎన్నికల నిబంధల ఉల్లంఘనపై కేసునమోదు :**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని పర్యటన వాయిదా వేసుకోమని పోలీసులు తెలిపినా పటించుకోకుండా మిర్చియార్డు పర్యటించినందు వల్ల ఎన్నికల కోడ్ నిబంధపై జగన్‌తో పాటు కోడాలినాని,అంబటి రాంబాబు మేరుగు నాగార్జున, అప్పిరెడ్డిలపై కేసునమోదు చేశారు.

# ఇక మెరుగైన పౌరసరఫరాలు

>> కలిసి ఒకే నిర్ణయంతో ముందుకు సాగాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు నిలబడి మెరుగుగా పనిచేయడం తద్వారా అంతిమంగా వ్యవస్థ నిలబడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రారంభించిన తర్వాత మిల్లర్లకు వద్దు ప్రభుత్వానికే ధాన్యం అమ్ముతామనే పరిస్థితి రైతు నుంచి వచ్చిందన్నారు. ఇప్పటివరకు 5.21 లక్షల మంది రైతుల నుంచి 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రూ.7,522 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. 24 గంటల్లోనే రూ.7,508 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా నష్టపోయి, నమ్మకాన్ని కోల్పోయిన రైతుకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీపం2 పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రజలకు చేరవేయడానికి, పథకాల అమలులో పారదర్శకత పెంచేందుకు ప్రతిఒక్కరూసహకరించాలని మంత్రి నాదెండ్ల పిలుపునిచ్చారు. అందుకు ప్రజల్లో ఉన్న సందేహాలను నివృతి చేయాల్సిన బాధ్యత జిల్లా స్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. అందుకు తగ్గట్లుగా అధికారుల సిద్ధం కావాలని, క్షేత్రస్థాయిలో తగిన చర్యలుచేపట్టాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఆన్‌లైన్ వ్యవస్థకు సిద్ధం కావాలన్నారు.గత 25 సంవత్సరాల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రేషన్ షాపు నుంచి ఒక బస్తా బియ్యం దారి మళ్లితే వెంటనే ఫోన్ వచ్చేదని, ఈ విధంగా ప్రజలకు రేషన్ మాఫియాపై అవగాహన పెంచాలని సూచించారు. దేశంలో ఇప్పటికీ చాలామంది పేదవాళ్లు ఆహారం(ధాన్యం)కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వచ్చే అకడమిక్ సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మిడ్ డే మీల్స్, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు పౌర సరఫరాల శాఖ నుంచి సన్న బియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో అందించబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి సివిల్ సప్లై, తూనికలుకొలతలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు. ఇక రైతు సేవా కేంద్రాలు, రైస్‌మిల్లు మధ్య ధాన్యంతేమ శాతంలో తేడా వస్తే చర్యలు తీసకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.నాదెండ్ల రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌లో ఇప్పటివరకు 5.21 లక్షల మంది రైతుల నుంచి 32 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా రూ.7522 కోట్లు జమ చేశాం. అందులో 24 గంటల్లోనే రూ.7508 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. ధాన్యం సేకరణలో 30 వేల లారీలు, 37 వేల మంది హమాలీలు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక పర్యాటకంలో ఎపి టాప్

>> నిదర్శనమన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం, టెంపుల్ టూరిజంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఏటా 36-40మిలియన్ల మంది యాత్రికులు సందర్శిస్తున్నారని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 27, 105 ఆలయాలు నిలయంగా ఉందన్నారు. ఐటిసిఎక్స్ దేవాలయాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక ప్రపంచ సమాజం అన్నారు.

**అందరూ సంస్కృతిని కాపాడుకోవాలి:**

హిందూ ధర్మం సనాతనమైందని, మానవసేవే మాధవసేవగా సాటి మనుషులకు సమాజానికి సేవచేస్తే , ఆదేవుడికి సేవచేసినట్లేనని హిందూ ధర్మం చెబుతుందని మంత్రి లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. మన దేశసంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పదన్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం మన వైపు చూస్తుందని ,మన సంస్కృతిలో ఆలయాలు, పండుగలు, పూజలు ముఖ్యమైనవన్నారు. పిల్లలకు గంటలు గంటలు ఫోన్లు, ట్యాబ్‌లు ఇచ్చే పద్ధతికి స్వస్తిచెప్పాలన్నారు. ఆ సమయంలో మన పురాణాలు, మన దేవుళ్లు ,మన పండుగలు, ఆచారాలు గురించి పుస్తకాలు ఇవ్వాలన్నారు. అందరం కలసి సంస్కృతిని కాపాడుకోవాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టిలో ఆలోచించి ఆలయాల పరిపాలనను మెరుగుపరచడానికి సిబ్బంది, భక్తుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని మంత్రి తెలిపారు. అర్చకుల పారితోషికం నెలకు 15వేల రూపాయలకు పెంచారన్నారు. అనంతరం ఐటిసిఎక్స్ నిర్వాహకులు మంత్రి లోకేశ్‌ను దుశ్శాలువతో సన్మానించి, శ్రీవారి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్, ఐటిసిఎక్స్ టెంపుల్‌కన్వెన్షన్ వ్యవస్థాపకుడు గిరీష్‌వాసుదేవ్‌కులకర్ణి, ఛైర్మన్‌ప్రసాద్‌లాడ్,తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## ఎయు విసి ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు పలువురి అభినందనలు

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రవిశ్వవిద్యాలయం నూతన ఉప కులపతిగా నియమితులైన ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఏయూ విశ్రాంత అధ్యాపకులు సంక్షేమ సంఘం బాధ్యులు ఆచార్య డీబీఆర్ఎన్‌కె బెనర్జీ ఒక ప్రకటనలో నూతన వీసీ ఏయూలో సంస్కరణలు చేపట్టాలని శత వార్షికోత్సవం ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆచార్య రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏయూ పూర్వ వైభవం సంతరించుకొంటుందన్నారు. శాసనమండలి పూర్వపు సభ్యుడు అమ్మినేని శివరామకృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం ఓఎస్‌డి డాక్టర్ నిరీక్షణకుమార్ తదితరులు రాజశేఖర్ నియామకాన్ని స్వాగతించారు.

## ఎమ్మెల్యేల అవగాహన సదస్సు వాయిదా..

### రాష్ట్ర శాసన సభా సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర

**విజయవాడ, ఫిబ్రవరి 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసన సభా భవనంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించాల్సిన ఎమ్యెల్యేల అవగాహన సదస్సు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు రాష్ట్ర శాసన సభా సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. ఈ అవగాహన సదస్సు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తదుపరి తెలియజేస్తామన్నారు. ఈ అవగాహన సదస్సును లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా ప్రారంభించాల్సి ఉంది. మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎం.వెంకయ్యనాయుడు కీల ప్రసంగం చేయాల్సివుంది. ఈ సమావేశాలను మార్చిలో శాసనసభా సమావేశాలు ముగిసిన తరువాత తిరిగి నిర్వహించే అవకాశం ఉంది.



తిరుపతిలో టిడిపి నేతలు, కార్యకర్తలతో మంత్రి లోకేశ్ సమావేశం

# పనిచేసేవారిని ప్రోత్సహిస్తా!

- కార్యకర్తలకు అండగా నిలబడాలి
- సాంకేతికతతో మదించి పదవులు
- తిరుపతిలో కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్

**తిరుపతి,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు దేశంపార్టీలో పదవుల పంపిణీకి కొత్తవిధానం తీసుకువస్తామని, ఎక్కడకు వెళ్ళినా కార్యకర్తలను కలవడానికి ప్రాధాన్యం ఇస్తానంటూ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలిపారు. పార్టీలో పనిచేసేవారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ పద్దతిలో సాంకేతికతతో పనితీరును మదింపుచేసి, గుర్తించిన వారికి పదవులు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. పార్టీలో జాతీయ అధ్యక్షుడి నుండి బూత్ఇన్‌ఛార్జి, బూత్‌కమిటీ సభ్యుల వరకు "కుటుంబ సాధికార సారధి"నమోదు కావాల్సి ఉంటుందన్నారు. ఒకరోజు తిరుపతి పర్యటనకు బుధవారం ఉదయం వచ్చిన మంత్రి నారాలోకేశ్ పార్టీ కార్యకర్తలు, నేతలతో తిరుపతి కపిలతీర్థంలోని పార్టీ కార్యాలయంలో సుదీర్ఘంగా ఐదుగంటల పాటు సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు పులివర్తినాని, బొజ్జలసుధీర్‌రెడ్డి, తిరుపతినాయకులు నరసింహయాదవ్, శ్రీధర్ వర్మ, వట్టికుంటశంకరనారాయణ, సుగుణమ్మ, మబ్బుదేవనారాయణరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, రవినాయుడు,సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతి యాదవ్, బుల్లెట్‌రమణ తదితరులతో కలసి ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం సమన్వయసమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. పార్టీలేకపోతే మనం ఎవరూ లేమని గుర్తుంచుకోవాలన్నారు. మనకు సమాజంలో గౌరవం లభిస్తుందంటే అందుకు కారణం తెలుగుదేశం పార్టీనే అన్నారు.

**- మొదట కార్యకర్తలతోనే సమావేశమవుతా:** టిడిపి కోటి సభ్యత్వంతో అతిపెద్ద కుటుంబంగా మారడానికి కార్యకర్తే అధినేత అని మంత్రి లోకేశ్ ఉద్ఘాటించారు. ఇకపై ఏ నియోజకవర్గం పర్యటనకువెళ్ళినా మొదట కార్యకర్తలతోనే సమావేశమవుతానని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మా అందరికీ పదేపదే చెప్పేది ఒక్కటేనని, ఏ నియోజకవర్గంలో పర్యటించినా అక్కడి క్లస్టర్,యూనిట్, బూత్ కమిటీ సభ్యులను కలసి మాట్లాడాలన్నారు."బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ,,మన టిడిపి యాప్, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కావాలని మంత్రి ఆదేశించారు. అందులో భాగంగానే పార్టీని బలోపేతం చేసేందుకు సగంరోజు మీతోనే గడుపుతున్నానన్నారు. పార్టీ, ప్రభుత్వం రెండు అనుసంధానమై పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో తన పాదయాత్రలో అన్నా "నేను కష్టపడ్డాను...నన్ను గుర్తించడంలేదు"అని చాలామంది నాతో చెప్పారన్నారు. సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తానని, పనిచేసేవారిని ప్రోత్సహిస్తానని మరోసారి స్పష్టం చేశారు.

**-పార్టీ సుప్రీం...కూటమిని కలుపుకుని పనిచేయండి:** పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేశ్ నిర్ధేశం చేశారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా జయప్రదం చేయాలని ,కూటమి పార్టీల నేతలను కలుపుకుని పనిచేయాలని సూచించారు. ఏ విషయం అయినా సమిష్టిగా చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యకర్తలకు ఏ పార్టీ చేయని విధంగా ప్రమాద బీమా 5లక్షలు రూపాయలు చేశామన్నారు. త్వరలో కార్యకర్తల ఆరోగ్యానికి సంబంధించి కూడా మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. కార్యకర్తల పిల్లలకు ఉద్యోగాలు కల్పించేందుకు పార్టీ కార్యాలయంలో కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామన్నారు.

**-వైసిపి దుష్ప్రచారం తిప్పికొట్టండి:** పార్టీలో గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని, మన లక్ష్యం పార్టీ బలోపేతం కావడమేనని మంత్రి అన్నారు. నేడు వైసిపికి ప్రతిపక్షహోదా కూడా లేదని, వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టాలని ఆయన నేతలకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి అన్నీ అప్పులుచేసి పోయారని, అయినా ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని ,ఫెన్షన్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల వైసిపి నుండి స్వతంత్రులుగా ఉన్న 15మంది కార్పొరేటర్లతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# తిరుమల సమాచారం

## ధ్వజారోహణంతో కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభం



**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా మొదలయ్యాయి. అర్చకుల వేద మంత్రోచ్చరణలు, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. పంచమూర్తులైన సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, వినాయకస్వామి, చండీకేశ్వరస్వామి, వల్లిదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో మకర లగ్నంలో నందిచిత్రంతో కూడిన ధ్వజపటం అధిరోహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణివాసన్ గురుకుల్ వేదోక్తంగా ధ్వజపటం ఎగురువేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం విశేషంగా జరుగుతుంది. 27న కల్యాణోత్సవం, 28న త్రిశూలస్నానంతో ,ధ్వజావరోహణంతో ముగుస్తాయి. అనంతరం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు ఉదయగురుకుల్ పాల్గొన్నారు.

## బోర్డు సభ్యుడు రాజీనామా చేయాలి

- ఆయన తీరు బాధ్యతారాహిత్యం
- టిటిడి ఉద్యోగ, ప్రజాసంఘాలు డిమాండ్



**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి చెంత సేవకునిగా, భక్తిభావంతో వ్యవహరించాల్సిన ఓ బోర్డుసభ్యుడు ఆలయం వెలుపలకు వచ్చేముందు మహద్వారం గేట్ వద్ద ఉద్యోగిపై చిందు లేయడం, దుర్భాషలాడటం మంచిది కాదని, విచక్షణారహితంగా ప్రవర్తించిన ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని టిటిడి ఉద్యోగ ,ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తితో భక్తుల పట్ల, ఉద్యోగుల పట్ల హుందాగా ఉండాల్సిన బోర్డు సభ్యుడే ఇలా వ్యవహరించడం భక్తులను కలచివేసిందని అంటున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సిఎంఒ కార్యాలయం టిటిడి అధికారులను సంప్రదించి సిసికెమెరా పుటేజీ వివరాలు ఆరా తీసిందని తెలిసింది. ఉద్యోగి పట్ల దురుసుగా, రాయలేని మాటలతో దుర్భాషలాడిన కర్నాటక బోర్డుసభ్యుడు పదవికి రాజీనామా చేయకుంటే దశలవారీగా ఆందోళనలను చేపడతామని టిటిడి ఉద్యోగసంఘాల నాయకులు చీర్ల కిరణ్, తదతరులు హెచ్చరించారు. మహద్వారం గేట్‌లో విధుల్లో ఉన్న బాలాజీకి అండగా నిలబడతామన్నారు. టిటిడి నిబంధనలప్రకారం నడచుకోవాల్సిన విఐపిలు కూడా అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం తగదన్నారు. విఐపిలు కూడా దేవదేవుని దర్శనానంతరం సాధారణ భక్తులలాగే బయటకు వెళ్ళాల్సి ఉందన్నారు. అయితే బోర్డు సభ్యుడనే భావంతో మహద్వారం గేట్‌తెరవలేదని ఆయన తీరు ఉద్యోగుల అంకితభావ సేవలను కలచివేస్తోందన్నారు. ప్రభుత్వం, టిటిడి ఆయన పై చర్యలు తీసుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చేస్తామని చెబుతున్నారు. కాగా ప్రజాసంఘాలు కూడా బోర్డుసభ్యుడి వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమలలో తప్పిపోయిన భక్తుడు



**తిరుమల,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** దేవుని దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు కుటుంబసభ్యుల నుండి క్యూలైన్‌లో తప్పిపోయాడు. నాలుగురోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరుజిల్లా పోనంగిగ్రామానికి చెందిన దాసరి సీతారం కుటుంబంతో ఈనెల 15న తిరుమలకు వచ్చారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో స్కానింగ్ వద్ద తప్పిపోయాడు. కుటుంబసభ్యులు దర్శనానంతరం వెలుపలకు వచ్చారు. ఆయన ఆచూకీ తెలియలేదు. తిరుమల,తిరుపతి ,స్వగ్రామంలో వెదికినా కనబడలేదు.దీంతో కుటుంబసభ్యులు తిరుమలకు వచ్చి 1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల సిఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు. ఆ చూకీ తెలిస్తే 9440696769, 9440796771 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

## పోలీసులను బెదరించడాన్ని జగన్ మానుకోవాలి

### - రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత తమను ఇబ్బందులు పెట్టిన పోలీసులు ఎక్కడ ఉన్నా తీసుకొచ్చి బట్టలు ఊడదీసి నిలబెడతామంటూ మాజీ సీఎం జగన్ పోలీసులను బెదిరించడాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసు అధికారులసంఘం రాష్ట్రఅధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు మాట్లాడారు. 8 నెలల క్రితం ఉన్న పోలీసులే ఇప్పుడూ ఉన్నారనే విషయాన్ని జగన్ గ్రహించాలన్నారు. రాజకీయాలకు, వర్గాలకు, రాగద్వేషాలకు అతీతంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని జగన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. చట్టం, న్యాయం, ధర్మం, సత్యానికి సంకేతాలైన ఆ నాలుగు సింహాలకే పోలీసులు సెల్యూట్ చేస్తారు తప్ప చట్టాలను ప్రజాస్వామ్యాన్ని గౌరవించని వారికి చేయరనే సంగతి జగన్ తెలుసుకోవాలని సూచించారు. పోలీసులపై ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి చేయొద్దంటూ హితవు పలికారు. పోలీసులపై చేసిన బెదిరింపు వ్యాఖ్యలను జగన్ వెంటనే వెనిక్కి తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు.ఆయన స్దాయిని ఎంటో గుర్తించుకోవాలన్నారు.ఓ బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి, మాజీ ముఖ్యమంత్రికి మాట్లాడే తీరు నేర్పించాల్సి రావడం ఇబ్బందికరంగా ఉందన్నారు. చట్టాలపై ఆయనకు ఏ మాత్రం గౌరవం లేదనే విషయాన్ని ఈ వ్యాఖ్యలే బహిర్గతం చేస్తున్నాయని మండిపడింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడ దిగజారాయో చెప్పాలని డిమాండు చేసింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మిర్యాల బాలసురేష్ జి అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త** నిర్వహణ పరమైన కారణాల వల్ల సికింద్రాబాద్-దానాపూర్-సికింద్రాబాద్‌ల మధ్య తిరిగే నెంబర్ 12791/92 ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నేటి (ఈనెల 20)నుంచి 28వ తేదీ వరకు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి.

## విజయవాడలో విశేషంగా ఆకట్టుకుంటున్న 'గ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025'



గ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025" చీరల ప్రదర్శన

**విజయవాడ,ఫిబ్రవరి19, ప్రభాత వార్తప్రతినిధి:** విజయ వాడలో ఎంతో ప్రతిష్టాత్మక్మంగా ప్రారంభమైనగ్రామీణ భారత మహోత్సవం - ఆంధ్రప్రదేశ్ 2025" ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటుంది. మహిళలు ఈ ప్రదర్శనకు భారీగానే తరలి వస్తున్నారు. స్దానిక మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఇటీవల ఈ ప్రదర్శనను ప్రారంభించారు. గ్రామీణ భారతదేశ ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటైన ఈ ప్రదర్శన ను ఇప్పటి వరకు 10 వేల మంది సందర్శించగా వివిధ వస్తువుల కొనుగోళ్ల ద్వారా రూ. 35 లక్షల ఆదాయం వచ్చిందని నాబార్డు డీజీఎం మురారీ మోహన్ బెహ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు నగర ప్రజలతోపాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వివిధ రాష్ట్రాల నుంచి ఏర్పాటైన కళాఖండాలు, వస్త్రాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. దేశంలోనే వివిధ రాష్ట్రాల నుంచి నైపుణ్యం కలిగిన చేనేత మరియు హస్త కళాకారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులు ఇందులో ప్రదర్శిస్తున్నారన్నారు.. గ్రామీణ భారతదేశ అభివృద్ధి కోసం నాబార్డు చేస్తున్న సమగ్ర కృషిని నగర ప్రజలు మరింత ఆదరించాలన్నారు. ఈ రాష్ట్ర స్థాయి ప్రదర్శన ఈనెల 24 ఆదివారం తో ముగియనున్నదని నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీజీఎం విజ్ఞప్తి చేశారు.ఈ ప్రదర్శనలో రాష్ట్ర సాంప్రదాయ హస్తకళల్లో మంగళగిరి పట్టు, ఉప్పాడ, పొందూరు ఖద్దరు, తెలంగాణ ప్రత్యేకతలైన నారాయణపేట సిల్క్ కాటన్ చీరలు ఉన్నాయన్నారు. అలాగే శ్రీకాకుళంలోని సిక్కోలు కాటన్ చీరలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. తిరుపతికి చెందిన బాలాజీ హస్త కళలు, ధర్మవరం పట్టు చీరలు, శ్రీ బాలాజీ కాటన్ సిల్క్, కొండపల్లి, ఏటికొప్పాక వంటి సంప్రదాయ కళాఖండాలతో పాటు, తమిళనాడు నుండి ప్రత్యేకంగా వచ్చిన నవసారిగై ఎప్కో పట్టు చీరలు కూడా ఈ ప్రదర్శనలో ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

## అమరావతిలోని 13 గ్రామాల్లో ఒకేరోజు రూ.12,422 కోట్లతో టెండర్లు

**రాజంపేట అర్బన్ ఫిబ్రవరి19 ప్రభాతవార్త** అమరావతి రాజధాని అభివృద్ధి దేశంలో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. అటు ప్రపంచ బ్యాంకు నిధులు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్,ఇటు కేంద్ర ప్రభుత్వం నిధులు ఖరారు కావడంతో రాజధాని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసింది. అందులో భాగంగా ఏపీ సి ఆర్ డి ఏ ఒకే రోజు 14 గ్రామాలలో 12,422 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు బుధవారం టెండర్లు పిలిచి రికార్డు సృష్టించింది. రాజధాని నిర్మించనున్న గ్రామాలలో ఇప్పటికే 13 గ్రామాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచన ప్రభుత్వం తాజాగా ఒకే రోజు మరో 13 గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లను పిలిచింది. ఏపీ సి ఆర్ డి ఏ పరిధిలోని లింగాయపాలెం ,ఉద్దండ రాయునిపాలెం, వెలగపూడి, మందడం, కృష్ణాయపాలెం, మల్కాపురం, మందడం, అయినవోలు ,వెలగపూడి, వెంకటపాలెం, కూరగల్లు, నౌలూరు, నిడమర్రు గ్రామాలలో అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానించింది. పైన పేర్కొన్న భూ సమీకరణ చేసిన గ్రామాలలో మౌలిక సదుపాయాలు, లే అవుట్ల అభివృద్ధి కోసం టెండర్లు పిలిచారు. 7ఏ జోన్ పరిధిలో 1235.52 కో, 9 జోన్ పరిధిలో 2774 కోట్ల తోను,9ఏ జోన్ పరిధిలో 1817 కోట్ల వ్యయం తోను, 10జోన్ లో 1487.50 కోట్ల తోనూ,12 జోన్ పరిధిలో 2949 కోట్ల తోను,12ఏ జోన్ పరిధిలో 2159 కోట్ల రూపాయల అంచనా వ్యయంతోను అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచారు. టెండర్లలో పాల్గొనేందుకు నేటి నుంచి మార్చి 6 చివరి గడువు కాగా, అదే రోజున సాంకేతిక బిడ్ కూడా తెరుస్తారు. ఈ మేరకు ఏపీ సి ఆర్ డి ఏ కమిషనర్ టెండర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆదివాసీ మహిళలపై పెరుగుతున్న హింసను సంఘటితంగా ప్రతిఘటించాలి

### ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్, టెక్స్టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత



దళిత స్త్రీశక్తి 18వ వార్షిక సభలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్,టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** దళిత ,ఆదివాసీ మహిళలపై పెరుగుతున్న హింసను సామాజిక వాదులంతా సంఘటితంగా ప్రతిఘటించాలని ఏపీ ప్రభుత్వ హ్యాండ్‌లూమ్స్,టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత వ్యాఖ్యానించారు.దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో డీఎస్ ఎస్ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అధ్యక్షతన బుధవారం విజయవాడలోని అంబేద్కర్ భవన్ లో డీఎస్ఎస్ 19వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ఆదివాసి మహిళలపై జరుగుతున్న హింస, మానసిక ఆరోగ్యం వివిధ కోణాలు అంశంపై వక్తలు మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన ఎపి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. సునీత మాట్లాడుతూ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం దళిత మహిళలపై హింసాత్మక ఘటనలు పెట్రేగి పోతున్నాయని చెప్పారు. 23 శాతం మహిళలపై లైంగిక దాడులు జరుగుతుంటే కేవలం 2 శాతం మాత్రమే నిందితులకు శిక్షపడుతుందని సునీత అన్నారు. మహిళలపై హింసలో ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే తెలుగు రాష్ట్రాల పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. అయినప్పటికీ ప్రతినిత్యం స్త్రీలపై హింస పెరిగిపోతున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి హింసాత్మక ఘటనలపై దళిత స్త్రీ శక్తి పోరాడటం అభినందనీయమని అన్నారు. 1989 అట్రాసిటీ యాక్ట్ ప్రకారం అందాల్సిన న్యాయం అందడం లేదని చెప్పారు. అందుకే దళిత స్త్రీలపై దాడులు పెరగడానికి కారణమని చెప్పారు. దళితుల జనాభా పెరుగుతున్నా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మాత్రం తగ్గుతున్నాయని వివారించారు. హక్కుల పరిరక్షణ కోసం సంక్షేమ పథకాల అమలు కోసం డిఎస్ఎస్ కృతనిశ్చయంతో పనిచేయడం స్ఫూర్తినిస్తుందని ఆమె పేర్కొన్నారు. పేబ్యాక్ టు ద సొసైటీ నినాదాన్ని ప్రతి ఒక్కరు ఆచరిస్తేనే దళిత స్త్రీల ఆర్థిక, సామాజిక ఎదుగుదల సాధ్యమని గుర్తు చేశారు. ఈ సందర్భంగా డిఎస్ఎస్ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ సరస్వతి అయ్యర్ మాట్లాడుతూ స్త్రీలపై హింస అనేక ప్రభావాలకు గురి చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మానసికంగా ఎంతో ప్రభావానికి గురిచేస్తుంది వివరించారు. ఇలాంటి సంఘటన వల్ల స్త్రీలు మానసిక రుగ్మతలకు గురవుతూ తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతుంటారని పేర్కొన్నారు. ఇందులో దళిత బాలికలు, మహిళలే ఎక్కువగా బాధితులని ఆమె వివరించారు. మానసిక ఆరోగ్య సామాజిక రుగ్మతల నుంచి బయటపడేందుకు దళిత స్త్రీ శక్తి విశేషకృషిని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. ప్రతి ఐదు మందిలో ముగ్గురు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు ఇటీవల వచ్చిన నివేదిక వివరిస్తుందని ఇందులో స్త్రీలే ఎక్కువగా బాధితులని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల వల్ల మానసిక ఆరోగ్యం దెబ్బతిని ప్రతి విషయంలోనూ వ్యక్తులు కృంగుబాటుకు గురవుతారని పేర్కొన్నారు. ఈ సంఘటనలను అధిగమిస్తేనే మహిళా సాధికారత సాధ్యమని అందుకు డిఎస్ఎస్ కృషిని అభినందించారు. ఝాన్సీ గెడ్డం తన అధ్యక్ష ఉపన్యాసంలో గత 19 సంవత్సరాలుగా దళిత ఆదివాసి స్త్రీలు బాలికలపై అరాచకాలకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. అనేక ఒడిదొడుకులు, ఒత్తిడుల మధ్య దళిత స్త్రీ శక్తి 20 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తనదైన పాత్రను పోషిస్తూ ముందుకు సాగుతున్నదని వివరించారు. దళిత, ఆదివాసి స్త్రీలపై జరుగుతున్న అనేక హింసాత్మక ఘటనలు ప్రతిఘటిస్తూ బాధితులకు న్యాయం చేకూరే దిశగా పోరాడిందని అన్నారు. ఈ సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా ముందుకు వెళుతున్నామని అన్నారు. సీనియర్ పాత్రికేయులు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.సమాజంలోని స్త్రీ పురుష సంబంధాలు హింసాత్మక ఘటనలతో ఉండకూడదని సూచించారు. హింస ఎవరు చేసినా సహించకూడదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు హింసకు గురైతే ఆ ప్రభావం కుటుంబంలోని పిల్లల మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. మెరుగైన సమాజం కావాలంటే మానసిక శారీరక సామాజిక హింసను నిర్మూలించడమే శరణ్యమని ఆయన పేర్కొన్నారు.

## జగన్ మానసిక స్థితి బాగాలేదనిపిస్తోంది: మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఓడిపోతే అందుకు కారణాలు సమీక్షించుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహంవ్యక్తం చేశారు. 150 సీట్లతో అధికారంలోకి వచ్చిన వ్యక్తి ఐదేళ్లు ప్యాలెస్‌లకే పరిమితం అయ్యారని విమర్శించారు. ప్రతిపక్షాలు మీడియా ఎంత ఘోషించినా ఐదేళ్ల ప్యాలెస్‌లు వీడలేదన్నారు .ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లోఉండొద్దనే ఈ ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. అధికారంలో ఉన్నా విపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల కోసం పనిచేసేవాడే నిజమైన నాయకుడని చెప్పారు. జగన్ మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి బాగాలేదనిపిస్తోందన్నారు. జగన్ పిచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ మిర్చియార్డు వద్ద పచ్చి అబద్దాలు చెప్పారు. ఎవరైనా నవ్వుకుంటున్నారన్న స్పృహ కూడా లేదు. గుంటూరు మిర్చి యార్డు ఇప్పుడు కొత్తగా రాలేదు. గతంలోనూ ఉంది. జగన్ సొంత మీడియాలో అబద్దాలు ప్రచారం చేయిస్తున్నారు. రాష్ట్రంలో 11 జిల్లాల్లో మర్చి పంట పండుతోంది. ధర రూ.13 వేలకు పడిపోయిందని జగన్ అంటున్నారు. గత ఐదేళ్లఓ మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13వేలు ధర ఉంది. రెండేళ్లు మాత్రమే మిర్చి రైతులకు రూ.20వేలు ధర పలికింది. మిర్చి రైతులకు ఇబ్బందులున్న మాట వాస్తవం సాగు ఖర్చులు పెరిగాయి. పని లేకపోవడంతోనే జగన్ అనవసర విమర్శలు చేస్తున్నారు. ఐదేళ్లూ నాటకాలాడి ఇప్పుడేమా ప్రేమ ఒలకబోస్తున్నారు. జగన్ పాలనలో వ్యవసాయశాఖను పట్టించుకున్న పాపానపోలేదు. ఆదాయం తెచ్చే శాఖలకు జగన్ తాళం వేసి బిగించారు. ఇప్పుడు ఆయన వాటిగురించి మాట్లాడుతున్నారు. ఐదేళ్ల పాలనతో జగన్ రైతుల కోసం ఒక్క మంచి పని కూడా చేయలేదు. సెంటు భూమికి కూడా భూపరీక్షలు చేయించలేదు. వ్యవసాయశాఖనుఅటకపై పెట్టారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ఒక్క పైసా ఖర్చు చేయలేదు. తాను పుట్టిన రాయలసీమలోనూ డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వలేదు. జగన్ రైతులకు పెట్టిన రూ.1600 కోట్ల బకాయిలను మేం వచ్చాక చెల్లించాం. టమాటా ధర తగ్గితే మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేశాం. ఈ 8 నెలల్లో ఎరువులు బఫర్ స్టాక్ పెట్టాం. ప్రకృతి విపత్తుల సమయంలో జగన్ ఏనాడూ పైసా ఇవ్వలేదు. మేం వెంటనే పరిహారం చెల్లించాం.

## కోళ్ల రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన ఎపి పౌల్ట్రీ ఫెడరేషన్


**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు తొలగించి, కోళ్ల రవాణాకు ఆటంకాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు ఆ సమాఖ్య ప్రతినిధులుఉండవల్లి నివాసంలో సీఎంను కలిసి పౌల్ట్రీ రంగ సమస్యలను వివరించారు. కోడి మాంసం, గుడ్లపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి ప్రభుత్వం సహకరించాలని చికెన్, ఎగ్ మేళాల ఏర్పాటుపై సర్కారు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. తూర్పుగోదావరి జిల్లాతో పాటు మరికొన్ని చోట్ల అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా పున ప్రారంభించాలని ఆ మేరకు కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుబ్బారావు ఉపాధ్యాక్షుడు టి.కుటుంబరావు, బాలాజీ హేచరీస్ డైరెక్టర్ పి.ప్రణీత్ చిత్తూరుకు చెందిని హేమాద్రి బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వార్త

> కొట్టినప్పుడు వినిపించే ధ్వనిని బట్టి, పాత్ర గట్టిదా, వట్టిదా అనే సంగతి తెలిసిపోయినట్లే, మనుష్యులు బుద్ధిమంతులా, మూర్ఖులా అనే విషయం వారి ఉపన్యాసం ద్వారా తెలిసిపోతుంది.
>
> న-డెమోస్త నీస్

# మహమ్మారికి ముకుతాడు

రాచపుండుకు చావే అంతిమ పరిష్కారంగాఉన్న రోజుల్నుంచి, ఆధునిక యుగంలో ఎన్నో పరిశోధనలతో జీవన కాలాన్ని పెంచేందుకు వీలుగా కొన్ని ప్రాణాధార ఔషధాలు తయారు చేసే స్థాయికి మన ఔషధరంగం విజయాలు సాధించడం సంతోషదాయకమే. ఆనాటి రాజుల కాలంలో రాజుకు రాచపుండు ఏర్పడితే ఎన్ని ఆయుర్వేద గ్రంథాలు తరచి చూసినా చికిత్సలు లభించేవి కాదని చరిత్ర చెబుతోంది. ఎన్నో దీర్ఘకాలిక రుగ్మతలను నయంచేయగలుగుతుందని చెప్పుకునే రసవైద్య చింతామణిలో కూడా క్యాన్సర్‌కు ఎలాంటివైద్య పరిష్కారాలూ లభించలేదు. భారతదేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఆయేటికాయేడు పెరుగుతూనే ఉంది. జాతీయ వైద్య పరిశోధన మండలి 2020లో చేపట్టిన అంచనాల మేరకు 2020 నాటికి దేశంలో 13.9 లక్షల మంది క్యాన్సర్ రోగగ్రస్థులుండగా, 2025 నాటికి 15.7 లక్షలకు చేరుకుంటుందని అంచనా. తాజా అధ్యయనాలు చూస్తే 2022నాటికే దేశంలో 19 నుండి 20 మిలియన్ల మధ్య ఉంటుందని లెక్కలువేశారు. రోగతీవ్రత, ముందస్తు రోగనిర్ధారణ, నివారణ, నిరోధకత వంటి విషయాలను క్రోడీకరించుకుంటే క్యాన్సర్ మరణాల సంఖ్యలో తేడా లేకున్నా నిరోధకతకూ టీకాలు రావడం మంచి పరిణామం. క్యాన్సర్ రోగుల జీవితకాలాన్ని పెంచడానికి ఇప్పుడొస్తున్న అధునాతన ఔషధ పరిశోధనలు ఉపయోగపడ్తున్నాయనేది తేటతెల్లమే. క్యాన్సర్ మరణాల రేటు 2022లో 8.08లక్షలుగా నమోదైంది. 'క్యాన్సర్ నివారణకన్నా నిరోధమే మేలు' అనే భావనతో ప్రభుత్వాలు వాటికితగిన ఔషధాన్ని రోగికి అందించే ప్రయత్నంలో కృతకృత్యులైనారు. సాధారణంగా క్యాన్సర్ చికిత్సకు వికిరణ, కీమోథెరపి, సర్జరీ వంటి సాంకేతిక ప్రక్రియలను పాటిస్తున్నారు. శరీరంలో ఎలాంటి మార్పులున్నా వెంటనే గమనించి వివిధ చికిత్సా పద్ధతులలో వైద్యానికి వెళ్తే కాస్తంత ఊరట లభిస్తుంది. ఇదెంతో వ్యయంతో కూడిన పని. సామాన్య మానవుడికి ఇలాంటి వైద్యం అందుబాటులో ఉండదు. వైద్యం ఎంతో ఖరీదైనది. వారి ఆర్థిక పరిస్థితి ఏమాత్రం సహకరించదు. అందుకే దీర్ఘకాలిక నయం కానిరుగ్మతగా పేరొందిన క్యాన్సర్‌కు ప్రాచీన కాలంలో 'రాచపుండు'గా చెప్పుకునేవారు. అయితే ఈ ప్రణాలను నియంత్రించలేకపోయినా సిద్ధవైద్యం మాత్రం మరికొంత ఆధునికత పొందిన వైద్యవిధాన ప్రక్రియలు క్యాన్సర్ రుగ్మతను నిరోధించగలమనే నమ్మకం ఈ మధ్య బాగా ప్రచారం పెరిగింది. దాంతో పునర్జన్మ వస్తుందని ఇప్పటికీ జనం నమ్ముతున్నారు. సిద్ధవైద్యంలో ఔషధ వృక్షాల రసాలు, కొన్నిఖనిజ తైలాలు వాడతారు. కనుక శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలో పేరుకుపోయిన విషాలను నియంత్రిస్తాయి. ఇవన్నీ జాగ్రత్తగా వాడాల్సి వస్తుంది. ప్రస్తుత పరిశోధనలు, కొవిడ్‌కు వాక్సిన్ విజయవంతంగా కనిపెట్టడంలో భారతదేశం ఫార్మా పరిశోధనల్లో బాగా ముందడుగు వేసింది. అప్పట్నించి ప్రధాని నరేంద్ర మోడీకూడా అన్నిరుగ్మతలకు మనమే స్వదేశీ వాక్సిన్ ఉత్పత్తి చేయాలని ఆ రంగాన్ని బాగా ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే రష్యా దేశం క్యాన్సర్‌కు టీకా కనిపెట్టినట్లు ప్రకటించుకుంది. ఎంతో సంతోషకర విషయం. కాగా తాజాగా ఇప్పుడు భారత్ కూడా ఆరునెలలో క్యాన్సర్ టీకాను అందుబాటులోకి తెస్తున్నామని శుభవార్త చెప్పింది. ఈ టీకాపై పరిశోధనలు పూర్తయి, ట్రయల్స్‌లో ఉన్నామని త్వరలో విడుదల చేసే యోచనను బయటపెట్టారు. 30 యేళ్ళ పైబడిన మహిళలకు ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ జరిపి వైద్య చికిత్సలు ఉచితంగానిర్వహిస్తున్నట్లు చెప్తూనే పదహారేళ్ల లోపు బాలికలకు టీకా తెస్తున్నామని చెప్పారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి ఈవ్యాక్సిన్ అదుపులో ఉంచి దరిచేయనీయకుండా చేస్తుందని కేంద్ర,వైద్య ఆరోగ్యశాఖా సహాయమంత్రి ప్రతాపరావ్ జాదవ్ వెల్లడించారు. ఇప్పుడుమహిళలను బాధించే అన్నిరకాల క్యాన్సర్‌లకూ ఉపశమనం కనుచూపుమేరలోనే ఉంది. యేటా కోటిమంది మరణాలు క్యాన్సర్ మహమ్మారి వల్లనేనని అధికారిక లెక్కలు చెపుతున్నాయి. రష్యా వ్యాక్సిన్‌కు క్లినికల్ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. క్యాన్సర్ రోగనిరోధానికి విడుదల చేయడమొక్కటే మిగిలిఉంది. వారివ్యాక్సిన్ పేరు ఎండాఆర్ఎన్ఏ. వ్యాక్సిన్‌లు ఏవైనా రోగకారక క్రిమిని మట్టుబెడతాయి. దాంతో రోగ నిరోధకశక్తిమీద దాడిచేసే కారకాలు మాయమైపోతాయి. శరీరంలో తయారైన యాంటీబాడీలు రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తాయి. అయితే కరోనా వ్యాప్తి సమయంలో సరికొత్త విధానంలో వ్యాక్సిన్ తయారు చేస్తున్నారు. ఇలాంటి వ్యాక్సిన్‌లన్నీ శరీరానికి రోగనిరోధకతను పెంచేవే. నిన్నమొన్నటి కోవిడ్ సమయాలో విజయవంతమైన వ్యాక్సిన్‌తో మానవాళిని కాపాడిన రష్యా, భారత్‌దేశాలు మాత్రమే. వారే ఇప్పుడూ క్యాన్సర్ రోగానికి వ్యాక్సిన్‌లు కొనుగొనడం అభినందించదగినది. రష్యా, భారత్‌లు వ్యాధి నిరోధక టీకాల కోసం పరిశోధనలు చేసి జనంలో ఊరట కలుగచేస్తున్నప్పటికీ ఇతరదేశాలు కూడా మరికొన్ని పరిశోధనలు చేస్తున్నాయి. అమెరికా, బ్రిటన్‌దేశాలు కూడా పరిశోధనలుచేస్తున్నాయి. కాగా కొన్ని దేశాలు మానవాళిని క్యాన్సర్ మహమ్మారి నుండి రక్షించడానికి నిష్కపటంగా పరిశోధనలు వేగవంతం చేస్తున్నాయి. రష్యాదేశం తాము అభివృద్ధి పరిచిన 'టీకా'ను ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందుబాటులోకి తెస్తామని వాణిజ్యపర ఆలోచన ఏదీ లేదని ప్రకటించింది. భారతదేశం ముందు మనవారికి, బయటి దేశాలకు ఆ తర్వాతే అన్న సూత్రాన్ని అవలంబిస్తున్నాయి. అదే జరిగితే క్యాన్సర్ మహమ్మారిని జయించినట్లే!

> ఎంత సైంటిస్ట్ అయినా ఫార్ములాస్‌తో మాట్లాడలేడు కదా! ప్రధానంగా భాష సహాయంతోనే మాట్లాడాలి.
>
> 
>
> ఐన్‌స్టయిన్

> డబ్బు సంపాదనలో విజయం సాధించినంత మాత్రాన జీవితంలో నిజమైన విజయం సాధించినట్టు కాదు.
>
> 
>
> బైరన్

# ప్రజావాక్కు



## సఫలమా? విఫలమా?

భారత ప్రధాని నరేంద్రమోడీ ఫ్రాన్స్‌దేశానికి వెళ్ళి కృత్రిమ మేథ మానవాళికి కలిగే ప్రయోజనాలను సవివరంగా తెలియజేసారు. కానిదీనివల్ల మెదడు పనితీరు మీద ఎంత ప్రభావముంటుందో మాత్రంతెలియజేయలేదు. అమెరికా యాత్రలో ట్రంప్‌తో కరచాలనాలు, కౌగిలింతలు చేసుకుని ఒకరి నొకరు అమితంగా పొగుడుకుని తమ ఆత్మీయతను ప్రపంచానికి చాటి చెప్పారు. కాని అక్కడ నివసిస్తున్న భారత వలసదారులకు సంకెళ్ళ వేసి మన దేశానికి పంపిస్తుంటే ఇదేమి క్రూరచర్యఅని ఒక్కచురక వేయలేకపోయారు. మనకు ఎఫ్35 యుద్ధ విమానాలెందుకు? మనకు ఆయుధ సంపత్తి లేకనా, చాలకనా? ప్రస్తుతం మన మీద యుద్ధ భయాలేవి లేవుగా. ఇంతకూ మోడీ అమెరికా పర్యటనసఫలమా? విఫలమా?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పారిశుధ్యం,మంచినీటి సరఫరా అధ్వాన్నం!

జీబిఎస్ వ్యాప్తిని కట్టడి చేయమని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు ఈ సిండ్రోమ్ కలుషిత నీరు, ఆహారంవల్లే అని వైద్యపరీక్షల్లో గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. నిజానికి మన రాష్ట్రంలో పారిశుధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరా అధ్వాన్నంగా ఉన్నాయి. గత సంవత్సరం విజయనగరం జిల్లాలో డయేరియా వ్యాధి ప్రబలినప్పుడు కూడా ఉపముఖ్యమంత్రి ఇకపై తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. విజయవాడ వంటి నగరాల్లో కూడా పారిశుధ్యం అధ్వాన్నంగాఉంది. ముఖ్యమంత్రి పరిస్థితి తీవ్రతగుర్తించి పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలి.

-జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

## ఉద్యోగం కంటే వ్యాపారమే మిన్న

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పూర్ణిమ అనే యువతి యం.ఫార్మసీ పానీ పూరీ వాలా పేరుతో పానీ పూరి వ్యాపారాన్ని మొదలుపెట్టి మంచిఆదాయాన్ని సంపాదిస్తోంది. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా టీ షాప్, టిఫిన్ సెంటర్, కూరగాయల దుకాణంవంటి వ్యాపారాలు చేస్తూ చక్కటి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు.

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

## ఆకస్మిక తనిఖీలు దినచర్య కావాలి!

ఎట్టకేలకు రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంసెట్టి సుభాష్ ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ముదావహం. ఆయన తనిఖీలో హాజరు పట్టీలో సంతకాలు పెట్టి వెళ్లిపోయిన సిబ్బంది వైనం వెలుగు చూడటం ఎటువంటి ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఎందుకంటే దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, అన్ని స్థాయిల్లో ఈ బాగోతాలు నిత్యకృత్యం! పలువురు ఐఎఎస్ అధికారులు హైదరాబాద్‌లో నివాసంఉంటూ వారంలో మూడు రోజులు మాత్రమే పని చేస్తున్నారు! చాలా పురపాలక సంఘాల్లో వేరే వారినిపురమాయించి సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు నిత్యం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిన అవసరంఉంది. చాలామంది ఉద్యోగుల్లో ప్రభుత్వమన్నా, ప్రజలన్నా జవాబుదారీ తనం లేకుండా పోయింది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు,ఏలూరు జిల్లా

## విగ్రహాన్ని నెలకొల్పాలి

అమరజీవి పొట్టి శ్రీరాములు నిష్కళంక దేశభక్తుడు. అంటరానితనం నిర్మూలనకు అనేక నిరాహారదీక్షలు చేసి నిమ్న వర్గాలకుదేవాలయ ప్రవేశంకల్పించారు. ఆయన తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని విశేష కృషి చేశారు. ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరుడయ్యారు. ఆయన బలిదానం వల్లనే ఆంధ్రరాష్ట్రంఏర్పడింది. దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. విజయవాడలో కనకదుర్గమ్మవారధి నిర్మాణ, సుందరీకరణలలో భాగంగా పొట్టిశ్రీరాములు గారి నిలువెత్తు విగ్రహాన్ని తొలగించారు. ఈ విగ్రహాన్ని 1994లో నాటి ప్రధాని పి.వి. నరసింహారావు ఆవిష్కరించారు. వారధి నిర్మాణ, సుందరీకరణ పూర్తయినా విగ్రహాన్ని ఇంకా నెలకొల్పలేదు.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## బేటి బచావో, బేటి పడావో

భేటి బచావో భేటి పడావో కార్యక్రమం మొదలు పెట్టి దశాబ్దం అయిందని తెలిసి ఈ లేఖ రాయాలి అనిపించింది. ఎక్కడ అయితే మొదలు పెట్టారో అక్కడ మునుపటి స్థితి ఉన్నది. అయితే ఆడ పిల్లల సంఖ్య తగ్గడానికి సహజ కారణాల కంటే మానవ మూఢ విశ్వాసాలు ఎక్కువగా ఉడడం కలిచి వేసే అంశం. హర్యానాలో మొదలు పెట్టిన ఈ కార్యక్రమంలో గత దశాబ్ద కాలంలో హర్యానా లో మార్పేమి లేదు అవుతే తెలంగాణ లాంటి రాష్ట్రాలు బేబి కిట్‌తో పాటు ఆడపిల్లలకు 13 వేల రూపాయలు ఇచ్చి తన వంతు ప్రోత్సాహం అందించింది.

-భారత అవినాష్, జనగామ

**మన విని — ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యావ్యవస్థ నాణ్యతకు స్వతంత్రతే కీలకం

*నిజానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రకృతి విపత్తులు, జనాభా సేకరణకు మాత్రమే, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకింద తీసుకోవాలి. మిగతా ఏఅంశంలోనూ తీసుకోకుండా చట్టంఉన్నది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినటువంటి విలువైన సమయాన్ని వృధా చేయకూడదు అనే బలమైన కారణం చేత, ఆ చట్టం చేయబడినది. కానీ పాలకులు రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు, ఈ చట్టాన్ని ఏమాత్రం వారు పరిగణనలోకి తీసుకోకుండా విద్యార్థులకు నష్టంచేస్తున్నారు. విద్యారంగంలో బాగా ముందున్న దేశాలలో, విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచి, విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడగలుగుతున్నారు. అలాంటి పరిస్థితిని మన రాష్ట్రంలో ఉంచినట్లయితే, విద్యార్థులకు పరిపూర్ణమైన బోధన అంది, మంచి విషయ పరిజ్ఞానం గల పౌరులుగా తయారవుతారు. ఇలాంటి పరిస్థితి కల్పించవలసింది కేవలం పాలకులు, ఉన్నతస్థాయి అధికారులు మాత్రమే!*

**తరిగోపుల నారాయణస్వామి**

రాష్ట్రంలో ప్రాథమిక విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే విషయంలో హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా టీచర్ల పనితీరును అంచనా వేయాలని ఆదేశించింది. దీనికి వీలుగా జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ)ని సంప్రదించి, 6నెలల్లో సూచికలు రూపొందించాలని పేర్కొంది. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యం కనీస స్థాయిలో లేకపోవడానికి టీచర్లను బాధ్యులను చేయడంవల్ల, దీర్ఘకాలంలో విద్యాప్రమాణాలు పెరుగుతాయని అభిప్రాయపడింది. విద్యాహక్కు చట్టంలోని నిబంధన 25(2)(డీ) ప్రకారం, జవాబుదారీతనం, పనితీరులపై సూచికలు తయారు చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. అలాగే, 25(2) (ఈ) ప్రకారం, ఉపాధ్యాయులు, అధికారుల వ్యవస్థ పనితీరును, నిర్దిష్ట కాలంలో మదింపు చేయాలని తెలిపింది. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పుఇచ్చింది. విద్యార్థుల అధ్యయన, అభ్యసన సామర్థ్యాన్ని విద్యాహక్కు చట్టం, ఎన్‌సిఆర్‌టి, నిబంధనలమేరకు నిర్వహించిన బేస్లైన్, టీఏఆర్ఎల్(టీచింగ్ ఎట్ రైట్ లెవల్ టెస్ట్) ఫలితాలను గత ప్రభుత్వం బహిర్గతం చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ, డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఇంద్రనీలా బాబు వాదనలు వినిపించారు. విద్యార్థులు చదివే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని, ఐదవ తరగతి విద్యార్థి రెండోతరగతి పాఠ్యాంశాన్ని కూడా చదవలేకపోతున్నాడని తెలిపారు. బేస్ లైన్, టీఏఆర్ఎల్ టెస్ట వివరాలను తల్లిదండ్రులకు అందజేయడం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. ఇలా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం మంచిదే, కానీ న్యాయస్థానం కావచ్చు లేదావాజ్యం దాఖలు చేసిన వ్యక్తి కావచ్చు. క్షేత్రస్థాయిలో విద్యాహక్కు చట్టం ప్రకారం, ప్రభుత్వాలు సదుపాయాలు కల్పిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. ఉపాధ్యాయుల నియామకాలు కావచ్చు. ఇతర సౌకర్యాలున్నాయా అనేవిషయం కూడా పరిశీలనలోకి తీసుకోవలసిన అవసరం ఉన్నది. నిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు దాదాపు 12 వేలకు పైబడి ఉన్నాయి. అంటే ఈ పాఠశాలలో ఉన్న ఒకే ఒక ఉపాధ్యాయుడు, ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు బోధన చేయవలసి ఉంటుంది. అనగా ఈ ఉపాధ్యాయుడు విద్యార్థులు ఎందరు అనే విషయం కాకుండా, ఒకటి నుంచి ఐదోతరగతి వరకు అన్నిబోధనాంశాలు అనగా, 18సబ్జెక్టులు ప్రతిరోజుచెబుతూ, మరలా 18వర్క్ బుక్కులు విద్యార్థులతో రాయించి, వాటిని ఏకాగ్రతతో పరిశీలించి, దోషనివారణ చేయించాలి. అనగా ఏకోపాధ్యాయపాఠశాలలో ఉన్న ఒక ఉపాధ్యాయుడు, ప్రతి రోజు 36సబ్జెక్టులకు సంబంధించిన విషయాన్ని పరిశీలించి, బోధించి దోషనివారణచేయించాలి. వీటితోపాటు అదనంగా, బోధనేతర కార్యక్రమాలు కూడా చూడాలి. మరి అలాంటి పాఠశాలల్లో ఫలితాలు ఎలా ఆశిస్తాం? విద్యాహక్కు చట్టం



ఈ విధంగా చెబుతున్నదా? మనం ఆలోచించాలి! అలాగే దాదాపు రాష్ట్రంలో ఉన్న 90శాతం ప్రాథమిక పాఠశాలల్లో, ఇద్దరూ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇలాంటి పాఠశాలల్లో కూడా, ఒక్కొక్క ఉపాధ్యాయునికి టెస్ట్ బుక్స్ వర్క్‌బుక్స్‌ను పరిగణలోనికి తీసుకుంటే, 18పుస్తకాలు బోధించి, రాయించి, దోష నివారణ చేయాలి. వీటితోపాటు బోధనేతర కార్యక్రమాలు అదనం. వాస్తవాన్ని పరిగణలోనికి తీసుకుంటే ఇది సాధ్యమా? అని ఆలోచించాలి. మరి సౌకర్యాల విషయాలకు వస్తే, విద్యా హక్కుచట్టం ప్రకారం, ప్రతి తరగతికి ఒక తరగతి గది ఉండాలి. ప్రధానోపాధ్యాయుని కార్యాలయం కూడా ఉండాలి. దాదాపు 90శాతం ప్రాథమిక పాఠశాలల్లో కేవలం ఒక గది, లేదా రెండుగదులు మాత్రమే ఉన్నాయి. క్రీడా స్థలాల విషయం మరింత విస్మయం కలిగిస్తుంది. కేవలం 10శాతం పాఠశాలలకు మాత్రమే, కనీస స్థాయిలో క్రీడా మైదానాలు ఉన్నాయి. మిగిలిన 90శాతం ప్రాథమిక పాఠశాలలో క్రీడా మైదానాలు లేవు. తాగునీటి సమస్య కూడా ఇంచుమించు ఇదేవిధంగా ఉన్నది. ఇక బోధన విషయాలకు వస్తే, ఉపాధ్యాయులకు బోధన సమయంలో, బోధన చేయించకుండా ఇతర బోధనేతర కార్యక్రమాలు ఇవ్వడం మూలంగా అధికారులే విద్యార్థులకు బోధన అందకుండాచేస్తున్నారు. విలువైన బోధనా సమయంలో, రకరకాల శిక్షణల పేరుతో విద్యార్థులకు బోధన అందకుండా చేస్తున్నారు. అలాగే రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు, అత్యవసర ఆదేశాలంటూ, రకరకాల భోదనేతర పనుల అప్పగిస్తూ, పరోక్షంగా అధికారులే, విద్యార్థులకు బోధన అందకుండా చేస్తున్నారు. మరి ఇలాంటి అసౌకర్యాలకు, ఉపాధ్యాయులని బాధ్యత చేయడం సమంజసం కాదు. పాలకులే విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడవలసి ఉంటుంది. వాజ్యం దాఖలుచేసిన వ్యక్తి కావచ్చు, లేదా గౌరవ న్యాయస్థానాలు కావచ్చు, క్షేత్ర స్థాయి వాస్తవాన్ని మదింపు చేసుకోవాలి. ఇలాంటి విద్యార్థులకు నష్టంజరిగే అంశాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలగాలి. అలాగే పాలకులు మారినప్పుడల్లా, రకరకాల ప్రయోగాలు విద్యావ్యవస్థలో చేస్తున్నారు. ఏదైనా ఒక విధానాన్ని ఎంచుకున్నప్పుడు ఆ విధానం వలన ఫలితాలు రావడానికి, కొన్నిసంవత్సరాల సమయం పడుతుంది. అంత సమయం ఇవ్వకుండా, ప్రతి సంవత్సరం విద్యా వ్యవస్థలో, బోధనకు సంబంధించి రకరకాల పద్ధతులు ప్రవేశపెడుతున్నారు. ఇది విద్యార్థికి ఉపాధ్యాయులకు అనిస్థితిని కలిగిస్తుంది. పాలకుల విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచకుండా, ప్రతి కార్యక్రమంలోనూ భాగస్వామ్యం చేయడంవలన, బోధనకు ఆటంకం కలుగుతున్నది. ఇలా ఆటంకం కలగడంవలన, ఉపాధ్యాయుడు ప్రతిభావంతంగా పాఠ్యాంశాలనుసకాలంలో పూర్తి చేయుటకు, ఉపాధ్యాయునికి కష్టతరంగా ఉంటుంది. ఉపాధ్యాయునికి కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేసి, బోధనా అంశములకు మాత్రమే బాధ్యత వహించేటట్లు చేయడం సమసితం. నిజానికి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రకృతివిపత్తులు, జనాభా సేకరణకు మాత్రమే, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకింద తీసుకోవాలి. మిగతా ఏఅంశంలోనూ తీసుకోకుండా చట్టంఉన్నది. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించినటువంటి విలువైన సమయాన్నివృధా చేయకూడదు అనే బలమైన కారణం చేత, ఆ చట్టం చేయబడినది. కానీ పాలకులు రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు, ఈ చట్టాన్ని ఏ మాత్రం వారు పరిగణనలోకి తీసుకోకుండా విద్యార్థులకు నష్టంచేస్తున్నారు. విద్యారంగంలో బాగా ముందున్న దేశాలలో, విద్యావ్యవస్థను స్వతంత్రంగా ఉంచి, విద్యార్థుల విలువైన బోధనా సమయాన్ని కాపాడగలుగుతున్నారు. అలాంటి పరిస్థితిని మన రాష్ట్రంలో ఉంచినట్లయితే, విద్యార్థులకు పరిపూర్ణమైన బోధన అంది, మంచి విషయ పరిజ్ఞానం గల పౌరులుగా తయారవుతారు. ఇలాంటి పరిస్థితి కల్పించవలసింది కేవలం పాలకులు, ఉన్నత స్థాయి అధికారులు మాత్రమే! ●

# మానవ శాస్త్ర పరిశోధకులు పెరగాలి!

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**

ఇటీవల ప్రాధాన్యతను సంతరించుకున్న మానవ శాస్త్రం (ఆంథ్రపాలజీ) ముఖ్యంగా హ్యూమానిటీ లేదా మానవత్వం గురించి చర్చించే శాస్త్రంగా గుర్తించబడింది. మానవ శాస్త్రం పరిధిలో మానవ ప్రవర్తన, మానవ జీవశాస్త్రం, సంస్కృతి, మానవ సమాజం, భాషాశాస్త్రం లాంటి ప్రధాన అంశాలు వస్తాయి. మానవ జాతిని లోతుగా అర్థం చేసుకోవడం, ఆ పరిజ్ఞానాన్ని విశ్లేషించుకోవడం, మానవశాస్త్ర విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులో ఉంచటం, పరిశోధనలు కొనసాగించడం, వివిధ మానవ జాతుల సంస్కృతులను అవగాహన పరచడం జరుగుతున్నది. మానవశాస్త్రం పట్ల సామాన్య ప్రజల్లో అవగాహన తక్కువగా ఉన్నందున, దానిని బహుళ ప్రచారంలోకి తీసుకురావడానికి 2015లో అమెరికన్ ఆంథ్రపాలోజికల్ సొసైటీ చొరవతో ప్రతి ఫిబ్రవరి మాసం 3వ గురువారం రోజున, అనగా 20 ఫిబ్రవరి 2025న ప్రపంచ మానవ శాస్త్ర దినోత్సవం" లేదా వరల్డ్ ఆంథ్రపాలజీ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ మానవ శాస్త్ర దినం2025 ఇతివృత్తంగా భవిష్యత్తు మన ముందుంది. అది సమానంగా పంపిణీ జరగలేదు" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. ఈ వేదికగా



మానవత్వం, మానవ జాతి, సంస్కృతి, మానవ సమాజం లాంటి అంశాల్లో అవగాహన కల్పించడం జరుగుతుంది. ఇటీవలే పుంజుకున్న మానవ శాస్త్రం లోతులను చూసే ప్రయత్నాలు చేస్తున్న మానవ శాస్త్రవేత్తల అభిప్రాయాలను శ్రద్ధగా వినడం, మానవ జీవితాల వైవిధ్యాలను అర్థం చేసుకోవటం, ఈ రంగంలో ఎదురవుతున్న ప్రపంచ సవాళ్లను అధిగమించే ప్రయత్నాలు చేయడం కొనసాగు తోంది. సమాజ ప్రతికూల తలను ఎదిరించి మానవ శాస్త్రం పట్ల లోతైన పరిశోధనలు చేసి పలు ఆసక్తికర మానవ శాస్త్ర అంశాలను బయట పెట్టిన ఫ్రాంజ్ బోయిస్‌ను మానవ శాస్త్ర పితామహుడు"గా పిలవడం జరుగుతున్నది. మానవ పరిణామం, నిర్మాణం, విధులు, సంస్కృతులు, సాపేక్షత అనే ఐదు భావనల మీద ఆధారపడిన మానవ శాస్త్రం పటిల అవగాహన కల్పించడానికి ఉద్దేశించబడిన ప్రపంచ మానవ శాస్త్ర దినం" రోజున విద్యాలయాలు, మ్యూజియమ్‌ల సందర్శన, యూనివర్సిటీల్లో సదస్సులు, చర్చలు, కార్యశాలలు లాంటివి నిర్వహిస్తూ మానవ శాస్త్ర కనీస పరిజ్ఞానాన్ని కల్పించవచ్చని తెలుసుకోవాలి. మానవ శాస్త్రం లోతులను మనకు పరిచయం చేస్తున్న పరిశోధకు లను ప్రోత్సహించడం, సన్మానించడం ఈ వేదికగా నిర్వహించవచ్చు. ఈ రోజున అవగాహన కల్పించడానికి ఆంథ్రోడే, ఆంథ్రపాలజీడే లాంటి హాష్‌ట్యాగులతో సోషల్ మీడియాలో ప్రచారం చెయవచ్చు. ●

# రూపాయి క్షీణతను నియంత్రించగలమా?

**డాక్టర్. పి.ఎస్.చారి**

గతకొన్నినెలలుగా రూపాయి విలువ హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ఫిబ్రవరి10, 2025న డాలర్‌తో పోలిస్తే రూపాయి 87.43కనిష్ట స్థాయికి చేరుకుంది. ఇలా ఎందుకు జరుగుతోంది? రూపాయి విలువ రెండురకాలుగా పడిపోతుంది. ఒకటి రూపాయి విలువ తగ్గించడం. ఇది ఇతర కరెన్సీలకు వ్యతిరేకంగా రూపాయి అధికారిక మారకపు రేటులో ఉద్దేశపూర్వకంగా తగ్గుదల. ఇది 1949, 1966, 1991 సంవత్సరాలలో మూడు సందర్భాలలో జరిగింది. మరొకటి అంతర్జాతీయ వ్యాపారంలో హెచ్చుతగ్గుల కారణంగా డాలర్‌తో రూపాయి విలువ క్షీణించడం. ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గుదల. ఇది రూపాయిక్షీణతను ఇది సూచిస్తుంది. భారత రూపాయి విలువ ఇప్పుడు ఎందుకుపడిపోతోంది? రష్యా ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్ పాలస్తీనాయుద్ధం, పెరుగుతున్న ముడిచమురు ధరలు, ఈక్విటీల అమ్మకం, డాలర్ ప్రవాహం. ద్రవ్యవిధానాన్ని కఠినతరం చేయడానికి ఆర్‌బిఐ చర్యలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులను కఠినతరం చేయడం వంటి ప్రపంచ కారకాలు దీనికి ప్రధానకారణాలు. చరిత్రలో కొన్నేళ్లుగా డాలర్‌తో రూపాయి మారకంవిలువ హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉంది. 1947లో రూపాయిడాలర్ రేటు రూ.3.30,1966లోరూ.7.50,1995 నాటికి రూ.32.4. 2022లో డాలర్‌కు రూ.82.14 గాఉంది. పాకిస్థాన్, చైనాలతో యుద్ధాలు, విదేశీ రుణాలు అవసరమయ్యే పంచవర్ష ప్రణాళికలు, రాజకీయ అస్థిరత, చమురు ధరలు వంటి అనేక కారణాలవల్ల రూపాయి విలువ పడిపోయింది. అమెరికా చైనామధ్య కొనసాగుతున్న వాణిజ్యయుద్ధం, ఇరాన్ పైన ఆంక్షలు, చమురు ధరల్లో మరింత అస్థిరత రూపాయి విలువను పరీక్షిస్తూనే ఉన్నాయి. రూపాయి క్షీణతప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటే, భారతీయ రిజర్వు బ్యాంక్‌కు ఇది రెండువైపులా కత్తిలాంటిది. అనుకూలతవైపు, బలహీనమైన రూపాయి సిద్ధాంతపరంగా భారతదేశ ఎగుమతులను పెంచడం, భారతదేశానికి ప్రయాణాన్ని చౌకగా చేయడం వంటి కొన్ని సానుకూల అంశాలను కలిగి ఉంది. స్థానిక పరిశ్రమ ప్రయోజనం పొందవచ్చు. విదేశాలలో పనిచేసే వ్యక్తులుతమ స్వదేశానికి తిరిగి డబ్బుపంపడం ద్వారా మరింత సంపాదించవచ్చు. ఇది మరింత ఎగుమతి చేయడం ద్వారా కరెంట్ ఖాతాలోటును తగ్గించడంలో సహాయపడుతుంది. ప్రతికూలతలో, ద్రవ్యోల్బణం ప్రమాదం కూడాఉంది. ఎక్కువ కాలం వడ్డీరేట్లను రికార్డుస్థాయిలో ఉంచడం సెంట్రల్ బ్యాంక్‌కు కష్టతరం చేస్తుంది. ఎందుకంటే భారతదేశం తన దేశీయ చమురు అవసరాలలో మూడింట రెండువంతుల కంటే ఎక్కువ దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. బలహీన కరెన్సీ దిగుమతి చేసుకున్న తినదగిన నూనె(ఎడిబుల్ ఆయిల్)ధరలను మరింత పెంచుతుంది. ఇది అధిక ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. రూపాయి కొనుగోలు శక్తిపడిపోవడం, అధిక చెల్లింపుల కారణంగా దేశం కరెంట్ ఖాతా లోటు పెరుగుతుంది. విదేశీ ప్రయాణం, విదేశీ విద్య ఖరీదైపోతుంది. విదేశీరుణం తదితరాలపై వడ్డీభారం పెరుగుతుంది. భారత ఆర్థికవ్యవస్థపై ప్రభావం 2024లో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దాదాపు3శాతం పతనం తర్వాత దేశీయ యూనిట్‌లో తీవ్ర తగ్గుదల వచ్చింది, ఇది ఆసియా కరెన్సీలలో కనిష్టస్థాయి పతనంగా నిలిచింది. జనవరి 1,



2024న, గ్రీన్ బ్యాక్‌తో పోలిస్తే రూపాయి 83.21 వద్ద ఉంది. నోమురా సంస్థ 2025 మధ్యలో డాలర్ తోపోలిస్తే రూ. 87కి పడిపోతుందని అంచనావేసింది. విశ్లేషణాత్మక అంచనాల ప్రకారం, 2025 చివరి నాటికి డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.1037కి, 2029 చివరినాటికి 101.5491గా ఉంటుందని అంచనా. వాణిజ్య లోటు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు వెనక్కి తగ్గడం, యుఎస్ డాలర్‌ఇండెక్స్ బలపడటం వంటి కారణాల వల్ల సమీపకాలంలో రూపాయి డాలర్ మారకపు విలువ అస్థిరంగా ఉంటుందని కూడా అంచనా. యుఎస్ఫెడ్రేటు పెంపు భౌగోళిక రాజకీయ అనిశ్చితి మధ్యడాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా రూపాయి బలహీనపడవచ్చని యుఎస్‌సెంట్రల్‌బ్యాంకు అంచనావేసింది. సాధారణంగా, నికర ఎగుమతిదారులు తమ డాలర్లకు ఎక్కువ రూపాయలను అందుకుంటారు. కాబట్టి నికర దిగుమతిదారులు దిగుమతుల కోసం డాలర్లను కొనుగోలు చేయడానికి ఎక్కువ చెల్లించాలి. పెద్ద మొత్తంలో విదేశీ అప్పులున్న వారు కూడా వడ్డీఖర్చులను రూపాయిలోచూస్తారు. తరుగుదల ఆర్థిక వ్యవస్థలో ఇలా కొన్ని పరిణామాలకు దారితీస్తుంది. భారత దేశం 2024 ఆర్థిక సంవత్సరంలో సుమారు 723బిలియన్ భారతీయ రూపాయల విలువైన మందులు, ఔషధాలను యునైటెడ్ స్టేట్స్‌కు ఎగుమతి చేసింది. ఈ రంగం ఎగుమతులలో అత్యధిక విలువను సాధించింది. నికర ఎగుమతి దారుగా ఉన్న టెక్స్‌టైల్ పరిశ్రమ బలహీనమైన రూపాయి నుండి ప్రయోజనం పొందుతుంది. అయితే రాబోయే ఆర్డర్‌లలో వినియోగదారులు సవరించిన రేట్లను డిమాండ్ చేయడం వల్ల లాభాలు స్వల్పకాలికంగా ఉండవచ్చని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. రత్నాలు, ఆభరణాల రంగం విషయానికొస్తే, రూపాయివిలువ క్షీణించడం దాని యూనిట్లకు ఖర్చు ప్రయోజనాన్ని ఇస్తోంది. సమాచారం సాంకేతికత సేవలు పరిశ్రమ యునైటెడ్ స్టేట్స్‌రాబడులకు 50 శాతం కంటే ఎక్కువ దోహదపడుతుంది. ఇదికాకుండా క్షీణిస్తున్న రూపాయి అతిపెద్ద లబ్ధిదారులలో ఒకటిగా ఉంటుంది. గార్మెంట్ రంగం లాభాల్లో ప్రతి 1శాతం పతనానికి, లాభాలు 0.25 0.5శాతం పెరుగుతాయి. భారతదేశ తేయాకు ఎగుమతులు 510శాతం పెరుగుతాయని అంచనా. పెట్రోలియం ఉత్పత్తులు, సేంద్రీయ రసాయనాలు, ఆటోమొబైల్స్ యంత్రాలు భారతదేశం ప్రధాన ఎగుమతి వస్తువులైతే, ప్రపంచంలో భారతీయ తేయాకు పోటీతత్వాన్ని పెంచడం మరింత ఎగుమతులను ప్రోత్సహిస్తుంది. అధిక దిగుమతులు, సరఫరా కొరత కారణంగా పెరుగుతున్న వస్తువులధరలతో, ఎగుమతిదారులకు ఉత్పత్తివ్యయం పెరుగుతుంది, ఇదివారిలాభాలను ప్రభావితం చేస్తుంది. డొనాల్డ్‌ట్రంప్‌హయాంలోబలహీనమైన ఆదాయాలు, డాలర్‌ను బలోపేతంచేయడం, టారిఫ్‌విధానాల గురించి ఆందోళనల కారణంగా విదేశీ పెట్టుబడిదారులు జనవరి 10వరకు భారతీయఈక్విటీల నుండి రూ.22,194 కోట్లను ఉపసంహరించుకున్నారు. యునైటెడ్ స్టేట్స్ డాలర్స్‌కి వ్యతిరేకంగా భారత రూపాయి క్షీణత కారణంగా, భారతదేశం ముడిచమురు దిగుమతిబిల్లు ఎనిమిది నుండి తొమ్మిదిశాతం పెరుగుతుందని పెట్టుబడిసమాచారం క్రెడిట్‌రేటింగ్ ఏజెన్సీ నివేదికతెలిపింది. ఫారెక్స్‌మార్కెట్‌లో ఆర్‌బిఐ భారీ జోక్యాన్ని ప్రతిబింబిస్తూ, ఫిబ్రవరి1,2025 నాటికి దేశ విదేశీ మారక నిల్వలు51.52బిలియన్ డాలర్లు తగ్గి 630.607 బిలియన్ డాలర్లు పడిపోయాయి. తగ్గిన మూలధన ప్రవాహం, విస్తృతమైన వాణిజ్య లోటు, భారతదేశంలో ఆర్థికవృద్ధి మందగించడం వల్ల రూపాయి క్షీణత మరింత తీవ్రమవుతుంది. డాలర్‌తో ఇతర కరెన్సీలు అమెరికా డాలర్‌తోపోలిస్తే అనేక కరెన్సీలు హెచ్చుతగ్గులకులోనవుతున్నాయి. తత్ఫలితంగా, భారత దేశంతో సహా వివిధ అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల నుండి విదేశీ మూలధన ప్రవాహం వారి దేశీయ కరెన్సీలపై ఒత్తిడితెచ్చింది. యూరో, బ్రిటిష్‌పౌండ్, జపనీస్ ఇతర ప్రధాన ప్రపంచ కరెన్సీల కంటే యుఎస్డాలర్‌తో రూపాయి క్షీణత తక్కువగా ఉంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రూపాయి బలపడు తున్న యుఎస్డాలర్‌తో మాత్రమే క్షీ ణించిందని, ఇతర బల మైన స్థూల అంశాలతో పోలిస్తే స్థిరంగా ఉందని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం, ప్రపంచంలోని కరెన్సీ నిల్వలలో 61శాతం కంటే ఎక్కువ డాలర్లలో ఉన్నాయి. ●

## విద్యుత్ తీగలు తగిలి గాయాలు



**చీమకుర్తి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

రాడ్ బెండింగ్ కూలీలకు రెండవ అంతస్తు మీదకి ఇనుప చువ్వలను అందిస్తున్న విద్యుత్ తీగలు తగిలి షాకుకు గురయ్యారు. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నూతన భవనం నిర్మాణంలో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. ఇనుప చువ్వలకు విద్యుత్ సరఫరా అవ్వడంతో పని చేస్తున్న కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రక్కనే ఉన్న తోటి కూలీలు అప్రమత్తం అయి కర్రలతో విద్యుత్ తీగలను తొలగించారు. దర్శికి చెందిన సురేష్, కోటేశ్వరరావు ఇద్దరు కూలీల పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన 108 వాహనంలో హాస్పిటల్ కి తరలించారు.

## క్షయను సమూలంగా నిర్మూలిద్దాం



**చీమకుర్తి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

రెండు వారాలకు మించి జ్వరం రావడం, దగ్గు తగ్గకపోవడం, వేగంగా బరువు తగ్గటం క్షయ వ్యాధి లక్షణాలు సూచిస్తుందని చీమకుర్తి టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్వైజర్ బత్తుల ఉమారాణి అన్నారు. చీమకుర్తి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జరిగిన టీబీ అవగాహన సదస్సుకు వారు హాజరై మాట్లాడారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు టీబీ వారోత్సవాలు జరుగుతున్నందున ఈ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఉమారాణి తెలిపారు. మూడు వేల రూపాయలు విలువైన క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చీమకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఉచితంగా నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారాన్ని తీసుకుంటూ క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని వారు తెలిపారు. రాంనగర్ యూ పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ సల్మా, ఏఎన్ఎం లక్ష్మి, ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఆశా కార్యకర్త జి కుమారి లు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్ కి క్విస్ విద్యార్థి



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న చెందిన విద్యార్థి మధురిక బాల్ బ్యాడ్మింటన్ లో సత్తాచాటింది. ఒంగోలులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ లో సత్తాచాటిన మధురిక జేఎన్ టీయూ కాకినాడ తరపున బాల్ బ్యాట్మింటన్ టీమ్ కి ప్రాతినిధ్యం వహించనుంది. తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో జేఎన్ టీయూ కే తరపున ఆడనుంది. ఈ సందర్భంగా మధురికను క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి గారు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి గారు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ఆల్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్ లో కూడా ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. క్విస్ కళాశాల డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెచ్ వోడీ కోటేశ్వరరావు, కోచ్ లను యాజమాన్యం అభినందించింది.

## ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ నూతన ఎన్నిక




**ఒంగోలు, ప్రభాతవార్త**

స్థానిక మీడియా కెమెరామెన్ అసోసియేషన్ భవనంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రకాశం జిల్లా శాఖకు నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరిగింది ఎన్నికలో ఉబ్బా అశోక్, టీ. శైలజ, ఎన్ సాయిష్ రెడ్డి అధ్యక్ష స్థానానికి పోటీ చేయగా ఈ పోటీలో మెజారిటీ ఉబ్బా అశోక్ బాబుకి రావడంతో ఏపీ ఈ.జే.యు అధ్యక్షుడిగా ఉబ్బా అశోక్ బాబు గెలుపొందడం జరిగింది, ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా బొడ్డు శ్రీనివాసరావు, ముఖ్య అతిథులుగా రాష్ట్ర కన్వీనర్ మేకపాటి మాల్యాద్రి పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు,

## క్విస్ ఉపాధ్యాయుడు బాచిన చక్రవర్తికి డాక్టరేట్

### - అన్నామలై యూనివర్సిటీ నుంచి పట్టా



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యాయుడు బాచిన చక్రవర్తి డాక్టరేట్ అందుకున్నారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో డాక్టర్ ఎన్ మాధవన్ గైడ్ షిప్ లో రూరల్ మార్కెట్ అనాలసిస్ ఫర్ కార్పొరేట్ రీటైలింగ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై రిసెర్చ్ చేసిన చక్రవర్తి దానిపై థీసిస్ సబ్మిట్ చేసి పీహెచ్ డీ పట్టా సాధించారు. ఈ సందర్భంగా చక్రవర్తిని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, హెచ్ వోడీ డాక్టర్ కొండలరావు అభినందించారు. ఈ సందర్భంగా చక్రవర్తి క్విస్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు.

## నగిరికంటి గురవమ్మకు నివాళులర్పించిన బూచేపల్లి, చుండూరి



**ఒంగోలు, ప్రభాతవార్త**

జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది నగిరికంటి శ్రీనివాసరావు మాతృమూర్తి నగిరికంటి బాలగురవమ్మ అనారోగ్యంతో ఈనెల 11న పరమపదించారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి జిల్లా వైసీపీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, ఒంగోలు సిటీ ప్రెసిడెంట్ కటారి శంకరరావు, బొట్ల సుబ్బారావు,ఇతర ముఖ్యనాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల



**ఒంగోలు, ప్రభాతవార్త**

బుధవారం ఉదయం ఒంగోలు నగరంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యేదామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. స్థానిక 19వ డివిజన్ భాగ్యనగర్ 4వ లైను నందు 2 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు నాటుసారా పూర్తిగా నిర్మూలనకై ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బృహత్తర కార్యక్రమం నవో దయ 2.0 ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డు పార్టీ కార్యాలయం నందు మంతులు కొల్లు రవీంద్ర, స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయ్ కుమార్,కందుల నారాయణరెడ్డి, గొట్టిపాటి లక్ష్మిలతో కలిసి పాల్గొన్నారు. నగరంలోని అంజయ్య రోడ్డులోని ఆరామ క్షేత్రం నందు మేధరసంఘం వారి భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎన్‌విజయ్‌కుమార్‌తో పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నందు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. అదే విధంగా రంగా భవన్ నందు నామాల ప్రేమ్ కుమార్ కుమార్తె ఓణీల వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. మద్దిపాడు మండలం బసవన్నపాలెంలో సుంకర శ్రీనివాసరావు కుమార్తె వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అధికారులు



**దర్శి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

దర్శిలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం జిల్లా అధికారులు తనిఖీ చేయడం జరిగింది. అదే విధంగా విద్యార్థులకి వండిన భోజనాన్ని పరిశీలించారు. అదే విధంగా ముండ్లమూరులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలని తనిఖీ చేసి విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించి అక్కడ భోజనం చేశారు. అదేవిధంగా టీచింగ్ సిబ్బంది రిజిస్టర్‌ని పరిశీలించారు. ఇంటర్మీడియట్ స్టూడెంట్ స్టడీ అవర్స్‌ని ప్రోగ్రెస్‌ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ కే.హేమలత, సీఎంఓ సోనిబుతు, ఐఈఆర్టీ నాగేంద్రం, కేజీబీవీ ప్రిన్సిపాల్ అరుణ, ఆవుల సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



**ఒంగోలు, ప్రభాతవార్త**

గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ తరుపున 2025 క్యాలెండర్ ఇయర్ డైరీని జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ వారిచే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల జిల్లా అధ్యక్షులు వైపీ రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీహెచ్ ఆదిరెడ్డి, ట్రెజరర్ కే.జనయ్య, రాష్ట్ర నాయకులు రవికుమార్, జిల్లా నాయకులు ఏ.వెంకటరామయ్య, నసరవాలి, ఒంగోలు మండల అధ్యక్షులు ఎస్‌కే యస్థాని, ఎం.సురేష్. జి.వెంకటరెడ్డి, బి.మహేంద్రారెడ్డి, ఎన్.సాయి కుమార్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా మార్చడంపై

# ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### - ఎక్సైజ్, గనులు, భూగర్భ జలవనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర





**ఒంగోలు, ప్రభాతవార్త**

రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎక్సైజ్, గనులు, భూగర్భ జలవనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. ఇందుకోసమే నవోదయం-2.0 కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నాటుసారా తయారీ వినియోగాన్ని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నవోదయం 2.0 రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని బుధవారం ఒంగోలులోని పోలీసు పరేడ్ గ్రౌండ్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ప్రారంభించిన ప్రతి కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అవుతున్నట్లు చెప్పారు. అందుకే ఈ కార్యక్రమాన్ని కూడా ఒంగోలులో ప్రారంభించాలని నిర్ణయించామన్నారు.







మన దేశానికి, రాష్ట్రానికి యువతే అత్యంత ముఖ్యమైన సంపద అని మంత్రి వ్యాఖ్యానించారు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందన్నారు గతంలో 2016లో నవోదయం కార్యక్రమంతో దాదాపు 10 జిల్లాల్లో నాటుసారాను నిర్మూలించామని చెప్పారు. ఆర్థికంగా ఆరోగ్యపరంగా పేదలు చితికిపోకూడదన్న లక్ష్యంతోనే మరోసారి నవోదయం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, నాటుసారా విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. కల్తీ మద్యాన్ని నిషేధించి పాత బ్రాండ్లను పునరుద్ధరించామని, మద్యం తయారీపై ప్రత్యేక నిఘా పెట్టి 12 రకాల పరీక్షలు చేసిన తర్వాతనే షాపులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మరో వైపు గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అక్రమ రవాణాను అడ్డుకునేలా ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా ఎక్కడ అమ్మకాలు జరుగుతున్నా 14405, 1972 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి శ్రీ బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను నాటుసారా, డ్రగ్స్, మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ముఖ్య మంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి పని చేస్తున్నారని అన్నారు.

అందుకే ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసి బడ్జెట్లో రూ.100 కోట్లను కేటాయిం చినట్లు చెప్పారు. యువత నిర్వీర్యం కాకూడదనే ఆలోచనతోనే ప్రభుత్వం ఇన్ని చర్యలు చేపట్టి నట్లు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు కూడా ఇదే స్ఫూర్తితో క్షేత్ర స్థాయిలో పనిచేయాలని ఆయన చెప్పారు. గత ఐదేళ్లలో మారు మూల ప్రాంతాల్లోని కాలేజీలో కూడా డ్రగ్స్ దొరికిన సంద ర్భాలు ఉన్నా యని, ఈ పరిస్థితిని సమూలంగా మార్చ డంపై దృష్టి సారించాలని ఆయన దిశానిర్దేశం చేశా రు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని వారికి సూచించారు. జిల్లాలో ఏ రూపంలోనూ మాదక ద్రవ్యాలు లేకుండా చేసేలా చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగానికి సహకరించాలని విద్యార్థులకు చెప్పారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో నాటుసారా తయారీని పూర్తిస్థాయిలో నిర్మూలించడంపై ప్రభుత్వం దృష్టి సారిం చిందన్నారు. డ్రగ్స్, నాటుసారా తయారీ వినియోగాన్ని గుర్తిసే ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, నాటుసారా వినియోగం వలన కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని అన్నారు. భవిష్యత్తు ఆశలను, ఆరోగ్యాన్ని డ్రగ్స్, నాటుసారా దెబ్బతీస్తాయని అన్నారు. దర్శి టీడీపీ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధతోనే ప్రభుత్వం నాటుసారా, ఇతర డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మన ఆరోగ్యం, మన కుటుంబ సభ్యుల ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. దేశ భవిష్యత్తుకు ఆధారమైన యువత నాటుసారా, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాటనఆలడుతూ నాటుసారా, గంజాయి ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వీటికి బానిసలుగా మారి భవిష్యత్తును ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు. అటవీ ప్రాంతాలలో నాటుసారా తయారీ కాకుండా సిబ్బంది మరింత దృష్టి సారించి నాటుసారా రహిత జిల్లాగా ప్రకాశం జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ నాటుసారా, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు తెలియని వయసులో బానిసలై కొంత మంది యువత తమ ఆరోగ్యాన్ని కెరియర్‌ను నాశనం చేసుకుంటున్నారని, కావున యువత డ్రగ్స్‌ను వారి దరి చేరనియ్యరాదని, ఒక సారి డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందలేరని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలు గుర్తెరిగి క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. జిల్లాలో డ్రగ్స్, గంజాయి, నాటుసారా నిర్మూలన కొరకు పోలీసు శాఖ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ప్రజలు, విద్యార్థులకు వాటి వలన కలిగే దుష్ప్రభావాలు, పరిణామాలు గురించి పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం, ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేయటం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం, అవసరమైతే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం కూడా జరుగుతుందన్నారు. ఎక్సైజ్ కమీషనర్ నిశాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ నవోదయం కార్యక్రమం ప్రాధాన్యాలను, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. నాటుసారా, డ్రగ్స్, గంజాయి వినియోగించడం వలన కలిగే దుష్ప్రభావాలను తెలియజేస్తూ సమాజంలో చైతన్యం నింపేలా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ఈ సందర్భంగా మంత్రులు, ఉన్నతాధికారులు విడుదల చేశారు. ఈ దిశగా ముద్రించిన పోస్టర్లను కూడా వారు ఆవిష్కరించారు. ఈ పాట రచించిన కడప జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం ఎస్పీ కార్యాలయం నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్లో మానవహారం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దిన్, అధికారులు పాల్గొన్నారు.

## చెరువులో దూకి చిన్నారితో తల్లి ఆత్మహత్య

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



తన తొమ్మిది నెలల పాపతో చెరువు లో దూకి తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన సంత నూతలపాడులో చోటు చేసుకుంది. సంతనూతలపాడులోని అంకా లమ్మ దేవస్థానం సమీపంలో గల బాపట్ల వెంకటేష్ సతీమణి వెంకట సుజాత(30) తన 9 నెలల చిన్నారి పాప యశ్వజ్ఞను ఎత్తుకొని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. అయితే మొదటి పాపను చెరువులో పడేసి తదుపరి సుజాత దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పలువురు భావిస్తున్నారు. మంగళవారం నాడు సుజాత భర్త గొర్రెలను కాసుకునే నిమిత్తం వెళ్లిన తదుపరి సాయంత్రం వేళలో తన పిల్లని ఎత్తుకొని ఇంటి నుండి బయటకు వెళ్లింది. అనంతరం సుజాత భర్త వెంకటేష్, తండ్రి లక్ష్మయ్య, తమ్ముడు కలిసి ఆమె ఆచూకీ నిమిత్తం సంతనూతలపాడు తదితర గ్రామాల్లో వెతికారు. మంగళవారం రాత్రి దీనిపై వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లి తెలిపారు. సీసీ కెమెరాలో మంగళవారం సాయంత్రం సుజాత తన కుమార్తెను ఎత్తుకొని సంతనూతలపాడు పార్కు సమీపంలో వెళ్తున్నట్లు తెలిసింది. తల్లి, పిల్ల ఆచూకి మంగళవారం నాడు తెలియరాలేదు. బుధవారం ఉదయం సంతనూతలపాడు చెరువు కట్ట సమీపంలో బహిర్భూమికి వెళ్లిన స్థానికులు చెరువులో చిన్నారి పాప మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై స్థానికులు సుజాత కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం వారు సంతనూతలపాడు పోలీసులకు దీనిపై సమాచారం ఇచ్చారు.



పోలీసులు స్థానికులు పెద్దచెరువు ప్రాంతానికి తరలివచ్చారు. మొదట పడవ ద్వారా చిన్నారి పాప మృతదేహాన్ని బయటకి తీశారు.అనంతరం మరికొన్ని గంటల్లో తల్లి సుజాత మృతదేహం కనపడటంతో బయటకి తీశారు. మృతి చెందిన సుజాత తండ్రి ఏటి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు సంతనూతల పాడు ఎస్సై అజయ్‌బాబు కేసు నమోదు చేశారు. మృతి చెందిన సుజాత స్వగ్రామం సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెం గ్రామం. సంతనూతలపాడుకు చెందిన బాపట్ల నాగేశ్వరరావు కుమారుడు వెంకటేష్‌ను కొనగానివారిపాలెం గ్రామానికి చెందిన ఏటి లక్ష్మయ్య గత మూడు సంవత్సరాల క్రితం తన కుమార్తెను ఇచ్చి వివాహం చేశారు. గతంలో సుజాత కుమార్తె ఆరోగ్యం బాగాలేక మృతి చెందింది. మృతురాలు భర్త వెంకటేష్, తండ్రి ఏటి లక్ష్మయ్య పోలీసులకు తెలిపిన కథనం మేరకు సుజాత మానసిక ఆరోగ్య పరిస్థితి గత రెండు మూడు నెలల నుండి బాగాలేదని తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, వైసీపీ నాయకులు దుంపా యల్లమందారెడ్డి, ఏటి మురళి, సంతనూతలపాడు ఉప సర్పంచ్ ఐవీ సుబ్బయ్య, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, సంతనూతలపాడు టీడీపీ అధ్యఓఉలు బొడ్డు శంకర్‌బాబు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు ముద్రగడ ఫణీంద్ర, బీజేపీ మండల మాజీ అధ్యక్షులు తెల్లమేకల శ్రీనివాసరావు, సంతనూతలపాడు ఎంపీటీసీ బాపట్ల సుబ్బారావు, సీపీఎం మండల నాయకులు బంకా సుబ్బారావు, తదితరులు పరిశీలించారు. సంతనూతలపాడు తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, వీఆర్వో వెంకటస్వామిలు మృతదేహాలకు పంచనామ తదుపరి ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు పోలీసులు తరలించారు. ఎస్సై అజయ్‌బాబు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ భూములు యధేచ్ఛగా ఆక్రమణలు

### - నామమాత్రపు హెచ్చరికలతో రెవెన్యూ అధికారులు

**రాచర్ల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :**



మండలంలో ప్రభుత్వ భూములు యధేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం నామమాత్రపు హెచ్చరికలతో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆక్రమణ దారులు వారి ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు ఆక్రమించి అనుభవిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో అనేక పంచాయితీలో ఇలాంటి తంతు ఎక్కడో ఒకచోట నిత్యం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం మండల కేంద్రమైన రాచర్ల పోలీస్ స్టేషన్ ఎదురుగా హోసన్న ప్రార్థన మందిరం ప్రక్క స్థలాన్ని మరో ప్రక్క భూమిని కొందరు వ్యక్తులు జేసిబి సహాయంతో శుభ్రం చేయిస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డగించారు. ఆ స్థలానికి సంబంధించిన పత్రాలను చూపించాలని కోరడంతో సంబంధిత వ్యక్తి ఆ స్థలం 25సంవత్సరాల క్రితం నుండి తమ ఆధీనంలో ఉందని అది తమదేనని తెలపడం జరిగింది. దీంతో రెవెన్యూ అధికారులు అతను చూపించిన పత్రాల ఆధారంగా రికార్డులు పరిశీలిస్తే రికార్డుల్లో ఆ స్థలానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేనట్లు తెలిసింది.

**ఆక్రమణలదారులపట్ల మాటలతో సరిపెట్టుకుంటున్న రెవెన్యూ అధికారులు :**



ఆక్రమణదారులపట్ల రెవెన్యూ అధికారులు సంబంధిత ఆక్రమణ దారుడిని ఆ స్థలంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని ఆదేశించి మాటలతో సరిపెట్టుకున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా రెవెన్యూ అధికారుల తీరుపట్ల పలు విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ భూములు స్థలాల్లో అక్రమాలు, ఆక్రమణలు జరుగు తున్నట్లు వారి దృష్టికి తీసుకువెళ్తే వారు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటే ఇలాంటి ఆక్రమణలకు, అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని, కానీ రెవెన్యూ అధికారులు మాత్రం అలా చేయకుండా ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు చేసిన సమయంలో ఆ ప్రదేశానికి వెళ్ళి నాలుగు మాటలు మాట్లాడి చెప్పవలసిన విషయాలు చెప్పి తమ పని అయిపోయింది అన్నట్లుగా వెళ్ళిపోవడంతో ఆక్రమణ దారులు వారి చర్యలను అలుసుగా తీసుకుంటున్నారు. దీంతో ఆక్రమణదారులు వారి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ ప్రభుత్వ భూములను, స్థలాలను యధేచ్ఛగా ఆమ్రించుకుంటూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములు అనేక ఎకరాలు ఆమ్రకణదారుల చేతుల్లో బంధీగా ఉందని వాటిపై పూర్తి ఆధారాలతో రెవెన్యూ అధికారులకు తెలియజేసిన అధికారులు ఆదేశించిన స్థాయిలో చర్యలు తీసుకొని ఆ భూములను స్వాధీనం చేసుకోలేదని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఉన్న అరకొర భూములను ఆ ఆక్రమణదారులు ఇప్పుడు నాయకులు అధికారుల అండదండలతో వాటిని కాజేయాలని చూస్తున్నారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఆక్రమణదారులకు, నాయకుల అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని కూడా ప్రజలు బహిరంగంగా అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమాలు, ఆమ్రణలకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించి ప్రభుత్వ భూములను స్థలాలను కాపాడాలని ప్రభుత్వం ఆదేశిస్తే ప్రభుత్వ స్థలాలను, భూములను అర్హులైన పేదలకు పంచాలని ప్రజలు కోరుతున్నారు. తహశిల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు ఆక్రమణదారులను పిలిపించి పనులు నిలిపివేయాలని ఆదేశించగా తాము పలానా పార్టీకి చెందిన నాయకులమని చెప్పడం గమనార్హం.

## మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

### - కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### - కనిగిరి వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్

**కనిగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

మిరప పంట సాగు చేసిన ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలవుతున్న ఇప్పటి వరకు రైతుకి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదు. రైతులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, మిరప రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మిర్చి ధర క్వింటా రూ.21 వేల నుంచి రూ.27వేల వరకు మద్దతు ధర ఉంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.8వేల నుంచి రూ.10వేల లోపే ఉందని కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిస్థాయిలో దగా చేస్తుందని విమర్శించారు.



### ఆట, పాట, మాటల ద్వారా

## అంగన్‌వాడీ కేంద్రాల అభ్యున్నతికి నడుం బిగించండి



**సంతనూతలపాడు, ఫిబ్రవరి19, ప్రభాతవార్త**
ఆట, పాట, మాటల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల అభ్యున్నతకు టీచర్లు పాటుపడాలని సంతనూతలపాడు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు కోరారు. సంతనూతలపాడు హైస్కూల్లో మండల స్థాయిలో బుధవారం నాడు అంగన్‌వాడీ టీచర్లకు జరుగుతున్న రెండో రోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఎంపీడీఓ సురేష్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ డి.వెంకారెడ్డి అధ్యక్షత వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులందరికి తగు పోషకాహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. చిన్నారులందరిని ఇష్టంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే అలవాటును వారిలో పెంపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ ఎం.ప్రమోద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతి బాయి, రిసోర్సు పర్సన్స్ శేషు కుమారి, మౌలాకాన్, విజయలక్ష్మిలు సీఆర్ఎంటీలు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు 18వ తేదీ నుండి ఆరు రోజుల పాటు కేఎల్ఎన్‌పై ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు.

## పిల్లల మనోవికాసానికి అంగన్‌వాడీ ఇల్లు దోహదం



**యర్రగొండపాలెం,ఫిబ్రవరి19,ప్రభాతవార్త**
య ర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండవ రోజు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. సుపర్‌వైజర్ ఎ.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు 120రోజుల జాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా పిల్లలకు విద్యను ఎలా బోధించాలి,వారి మానసిక వికాసం అభివృద్ధి చెందే విధంగా ఆటల పాటలతో కూడిన విద్యను తరగతి గదులలో ప్రదర్శించాలన్నారు.పిల్లల చేత సంఖ్యాజ్ఞానం సృజనాత్మకత అంశాలపై కార్యక్రమాన్ని ప్రదర్శింప చేయాలన్నారు.అంకెలను గుర్తించడం అంకెలతో కూడిన అభినయ గేయాలను చెప్పించాలన్నారు.పూర్వ ప్రాథమిక విద్య బలోపేతంగా ఉండే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రెండురోజు నుండి చక్కగా ఉత్సహంగా కార్యకర్తలకు వివరించిన కార్యక్తలకు బహుమతులను యంఇవో పి.ఆంజనేయులు, మల్లూనాయక్ అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌పిలు,లక్ష్మినారాయణ,మల్లికార్జునరెడ్డి, సూపర్‌వైజర్లు ఎ.పద్మజ,సుజాత,సిఒర్‌యంటీలు,మూర్తి,దుర్గారావు,కోటేశ్వరరావు యల్లయ్య, ఉపాధ్యాయులు వినయ్ చక్కని సహకారం అందించారనీ వారిని అభినందించారు.

## చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలి - డీఈవో కిరణ్ కుమార్



**తాళ్లూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు అర్థమయ్యే విధంగా బోధించాలని కార్యకర్తలకు డీఈవో కిరణ్ కుమార్ సూచించారు. స్థానిక వీకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై రెండో రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ చిన్నారుల అభ్యాసన సామర్థ్యాలను గమనించి మెరుగుపరిచేలా ఉండాలని తెలిపారు. ఆట పాటలతో అంగన్‌వాడీ చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకోసం ప్రభుత్వం ఏడాదిలో 40 రోజుల చొప్పున మూడేళ్లలో 120 రోజుల సర్టిఫికేట్ కోర్సు శిక్షణా కార్యక్రమానికి రూపకల్పన చేసిందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం వీకే పాఠశాలలోని గదులు ఇతర సౌకర్యాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య, ప్రధానోపాధ్యాయుడు శేషగిరి, డీఆర్‌పీలు శివరామిరెడ్డి, శ్రీమన్నారాయణ, చంద్రిక, సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అదుపు తప్పితే అంతే

### - కిక్కిరిసిన కూలీలతో ఆటోలు - మిరపకాయలు కోసేందుకు వెళ్తున్న వైనం


### - వాహనదారులకు కరువైన రహదారి భద్రత సూచనలు






**తాళ్లూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మిర్చి కోసేందుకు కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి కూలీలు ఆటోలు, ఫోర్ వీల్ ఆటోలలో వస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనలు చెందుతున్నారు. ఒక్కొక్క ఫోర్ విల్ ఆటోకు 30 నుంచి 40 మంది వరకు ఎక్కించుకొని ఆటో డ్రైవర్లు వేగంగా తరలి వెళ్తున్నారు. ఆటోల్లో అయితే 20 నుంచి 25 మంది వరకు ఆటోల్లో వెళ్తున్నారు. ప్రమాదం ఎప్పుడు ఏ రూపంలో ముంచుకొస్తుందోనని కూలీలు సైతం భయాందోళనలు చెందుతున్నారు. ముండ్లమూరు మండలంతో పాటు పలు గ్రామాల్లో ముమ్మరంగా మిరప కాయలు కోతలు వచ్చాయి. దీంతో గత కొన్ని వారాల నుంచి దాదాపు ఆటోలు, త్రీవీల్ ఆటోలు తాళ్లూరు మండలం నుంచి కూలీలను ఎక్కించుకొని ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాలకు తీసుకెళ్తున్నారు. పరిమితికి మించి ఆటోల్లో కూలీలను ఎక్కించుకుని వెళ్తున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. జిల్లాలో రహదారిపై పలు చోట్ల కూలీలతో వస్తున్న ఆటోలు సైతం ప్రమాదానికి గురై చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. తాళ్లూరు గంగవరంలోని ప్రధాన రహదారిలో ప్రయాణిస్తున్న కూలీల ఆటోలను చూసి చూడనట్లు సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారు. వాహన దారులకు రహదారి భద్రతలపై సూచనలు, సలహాలు ఇవ్వకపోగా బాధ్యులపై చర్యలు తీసుకున్న దాఖలాలు సైతం కనిపించడం లేదు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్



**మద్దిపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని సీఎంఆర్ఎఫ్ చెక్కులను సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయకుమార్ పంపిణీ చేశారు. మండల పరిధిలోని ఇనమనమెల్లూరు గ్రామానికి చెందిన సుబ్బాయమ్మకు స్వయంగా ఇంటికి వెళ్లి రూ.1,72,119ల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. తదుపరి సాధనిక బీసీ కాలనీలో జీవీఎల నిర్మించిన సిమెంట్ రోడ్డును పరిశీలించారు. మండల పరిధిలోని నాగన్నపాలెం, గార్లపాడు, నేలటూరు, పెద్దకొత్తపల్లి, లింగంగుంట తదితర గ్రామాల్లో కూడా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మండల జయంతిబాబు, మండల మాజీ తెలుగు యువత అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు, ఇనమనమెల్లూరు మాజీ ఎంపీటీసీ మండవల్లి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు నైనాల భావనారాయణ, టీడీపీ నాయకులు కొండూరి ప్రభాకర్‌రెడ్డి, దొప్ప శేషయ్య, జోసఫ్ గట్టినేని అయ్యన్న, నాగన్నపాలెం గ్రామ సర్పంచ్ కార్ల విజయకుమార్, మాజీ జడ్పీటీసీ ఎం.రామకృష్ణ, లింగంగుంట ఎంపీటీసీ మన్నం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఛత్రపతి జయంతి



**మార్కాపురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని టీసీ బాలుర వసతి గృహంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక నగర అధ్యక్షులు సాయి సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై ఛత్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక రాజ్యాంగంలో రాజు ఎలా ఉండాలో ఒక తల్లి కొడుకు ఎలా మెదగాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ చేసి చూపారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు జె.శ్రీనివాసులు, రాష్ట్ర విభాగం నాయకులు వెంకటేశ్వర్లురెడ్డి, అంజిరెడ్డి, జనార్దన్, గుంటక సుబ్బారెడ్డి, అశ్వత్థామ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## 21న మంత్రి గొట్టిపాటి వైదన రాక



**బల్లికురవ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
ఈనెల 21న మండలంలోని వైదన గ్రామంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంత్రి కార్యాలయ వర్గాలు ప్రకటన విడుదల చేశాయి.

## మద్యంసేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం

### - అర్బన్ సిఐ సురేష్



**గిద్దలూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ అన్నారు. గిద్దలూరు పట్టణంలోని వైఎస్సార్ కూడలిలో బుధవారం సాయంత్రం అర్బన్ సిఐ తమ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహనదారుల వద్ద సరైన పత్రాలు ఉన్నాయా లేదా పరీక్షించి హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు జరిమానాలు విధించారు. అనంతరం సిఐ సురేష్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుటనేరమని, దీంతోపాటు ప్రమాదాలు జరిగితే కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. వాహనదారులు నిబంధనలకు లోబడి వాహనాలను నడపాలని పరిమితికి మించి ప్రయాణీకులను వాహనాల్లో ఎక్కించుకోరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్వింటా కందులు మద్దతు ధర రూ.7,550లతో ప్రభుత్వం కొనుగోలు



**బేస్తవారిపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**
క్వింటా కందులు మద్దతు ధర రూ.7,550లతో ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖాధికారిణి జక్కం మెర్సీ తెలిపారు. మండలంలోని చెన్నుపల్లి, బాలీశ్వరాపురం గ్రామాలలో మండల వ్యవసాయ శాఖాధికారిణి జక్కం మెర్సీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ జక్కం మెర్సీ మాట్లాడుతూ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రైతులకు తెలియజేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న రైతులకు మాత్రమే పిఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ, ఇతర ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. అదే విధంగా మార్క్‌ఫెడ్ వారి తరపున కంది కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగిందని కావున కంది వేసిన రైతులు రైతు భరోసా కేంద్రం నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా తెలియపరచడం జరిగింది. కందుల మద్దతు ధర రూ.7,550లు క్వింటాతో ప్రభుత్వం వారే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉద్యాన అధికారిణి శ్వేత మాట్లాడుతూ డ్రిప్ 90శాతం మరియు స్ప్రింకర్లు 50శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కావాలసిన రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పఠాన్ సుభానీ మరియు రైతులు పాల్గొన్నారు.

## రోడ్డుకు ఇరువైపులా ముళ్ళపొదలను తొలగించిన సిఐ జి.సోమశేఖర్



**కొండపి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
కొండపి నుండి టంగుటూరుకు వెళ్ళే దారిలో రెసిడెన్షియల్ స్కూల్ ధాటిన తరువాత ప్రమాదాలు నిరోధించుటలో భాగంగా సిఐ జి సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్ మరియు సిబ్బంది బుధవారం రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి ముళ్ళ పొదలను చెట్లను డోజర్ సహాయంతో తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు ప్రతిఒక్కరు మోటార్ సైకిల్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పక ధరించాలని, వాహనం నడిపే సమయంలో ట్రాఫిక్ రూల్స్ న్ తప్పక పాటించాలని తెలిపారు. ట్రాక్టర్లలో ప్రయాణం చేసే సందర్భంలో డోర్లు ఓపెన్ చేయరాదని, ఆటోలో పరిమితికి మించి వాహనాలు నడపరాదని, అదేవిధంగా అతివేగంతో వాహనం తనకు గాని ఇతరులకు గాని ప్రాణనష్టం కలిగే అవకాశం ఉన్నదని, ప్రతిఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించినట్లయితే ప్రమాదాలను నిరోధించవచ్చని తెలిపారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆటోలకు డ్రైవర్ ప్రక్కన సీటు రద్దు

### - ప్రమాదాలను అరికట్టేందుకే అంటున్న పోలీసులు



**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ సైదుబాబు, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ అంకమ్మ రావు సంయుక్తంగా బుధవారం ఆటోల తనిఖీలు నిర్వహించారు. రోజురోజుఇ పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకుంటున్న తరుణంలో ఆటోలో డ్రైవర్ ప్రక్కన అటు ఇటు ఉండే సీట్లను తీపించారు. పోలీసులు, డ్రైవింగ్ సీట్‌లో డ్రైవర్ తప్పా ప్రయాణీకులు కూర్చోరాదని, ఆటోలో డ్రైవర్ ప్రక్కన ప్రయాణీకులను ఎక్కించుకొని ప్రయాణిస్తే తగిన చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ చట్ట ప్రకారం వాహనాలను రోడ్లపై నడపాలని సూచించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరిత్యా నేరమని, మద్యం సేవించి వాహనాలు నడిపితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. అదే రహదారిలో ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో పట్టణ మరియు రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని శివాజీ నగర్ రెండవ లైన్‌లో బుధవారం మర్కాపురం జనరల్ సెక్రటరీ సతీష్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ జన్మదిన వేడుకలలో మార్కాపురం అసెంబ్లీ ఇన్చార్జి పివి కృష్ణారావు ముఖ్య అతిధిగా పాల్గొని భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేర్లలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒకరని, పేరుకు ఎంతో ప్రత్యేకత ఉందని మరాఠాల స్వరాజ్యం కోసం హిందూ ధర్మం కోసం పోరాడిన ప్రాణాలు అర్పించిన గొప్ప యోధుడు శివాజీ మహారాజని కొనియాడారు. ఆ మహనీయుడి 395వ జయంతిలో పాల్గొనడం మనందరికీ అదృష్టమని, ముందు ముందు జరుగబోవు శివాజీ కార్యక్రమాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శివాజీ మహారాజ్ గారి జయంతి వేడుకలను అధికారికంగా ప్రభుత్వాలే జరిపించాలని పివి కృష్ణారావు కోరారు.

## లౌకిక తత్వాన్ని చాటిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్

### - బెల్లంకొండ విజయలక్ష్మీ



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం పొదిలి మండలం బెల్లంకొండ నగర్‌లో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సామాజిక, రాజకీయ నాయకులు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, వారి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన అతిధిగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఆమె తన ప్రసంగంలో శివాజీ మహారాజ్ తాను నమ్మిన ధర్మాన్ని పాటిస్తూనే ఇతర మతాల పట్ల లౌకిక తత్వాన్ని చాటిన గొప్ప మహా పురుషుడు మహారాజ్ ఛత్రపటి శివాజీ అని అన్నారు. శివాజీ పరాక్రమాలు పోరాట తత్వం, ధైర్య సాహసాలు గుర్తించిన నైజాం సుల్తానులు శివాజీ మహారాజ్‌కు ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలికి మహారాజ్‌గా గుర్తించి, ప్రపంచానికి పరిచయం చేయడమే కాకుండా ఔరంగజేబు ఎదుర్కొనడానికి సైనికపరంగా కూడా సహకరించారన్నారు. ఛత్రపతి ఒక పోరాట యోధునిగా శత్రు రాజ్యాలపై యుద్ధం చేయడమే కాకుండా, దేశభక్తి స్వాతంత్ర స్ఫూర్తి, ధర్మపరిరక్షణ, ధార్మిక చింతనతో అనేక పవిత్ర పుణ్యక్షేత్రాలను సందర్శించి, అక్కడ గోపురాలను నిర్మించిన గొప్ప పరాక్రమ యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని పేర్కొన్నారు. శ్రీశైలంలో శివాజీచే నిర్మించిన గోపురం శివాజీ గోపురంగా ఇప్పటికి చారిత్రక ఆనవాళ్లుగా ఉందన్నారు. న్యాయపాలన, ఆయన ధైర్య సాహసాలు మనందరికి ప్రేరణనిస్తాయన్నారు. ఆయన జీవితం నుండి మనం చాలా పాఠాలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పొదిలి మండల అధ్యక్షుడు దోర్నాల రమణారెడ్డి, పొదిలి పట్టణ అధ్యక్షులు యుద్ధం మహేష్, కంఠం నాగరాజారావు, ఎస్ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, కుప్పాల నవీన్, బ్రహ్మయ్యతో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అన్నాకు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి సన్మానం



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కేవీ రమణారెడ్డి బుధవారం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబుని మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధినాయకత్వానికి పార్టీ కార్యదర్శి పదవి నియామకానికి సిఫార్సు చేసినందుకు మాజీ ఎమ్మెల్యే అన్నకు కృతజ్ఞతలు తెలుపుతూ పూల మాల వేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రాంబాబు, నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

# కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపీట

### - అయినా ప్రభుత్వంపై తప్పని విమర్శలు

### - బిసి కార్పోరేషన్ దరఖాస్తులను పరిశీలించిన మండల స్థాయి అధికారులు



**త్రిపురాంతకం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిసి, ఓసి కార్పోరేషన్ రుణాలకు సంబంధించి ధృవీకరణ పత్రాలను పరిశీలిస్తున్న ఎంపిడిఓ రాజ్ కుమార్, స్థానిక ఎస్‌బిఐ, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, మేడపి యూనియన్ బ్యాంక్ అధికారులు బుధవారం ఉదయం 10గంటల నుండి మండలంలోని 24గ్రామ పంచాయితీల గ్రామ ప్రజల నుండి వెనుబడిన తరగతులకు చెందిన అన్ని వర్గాల నుండి, మీసేవా కేంద్రాల నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల నుండి వారు వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకున్న ధృవీకరణ పత్రాలకు వారి వద్దనున్న అసలైన ధృవీకరణ పత్రాలకు తేడాలు ఏమైనా ఉన్నాయా అని క్షుణ్ణంగా బుధవారం పరిశీలించారు. ఈ విషయంలో ప్రభుత్వం బిసి కార్పోరేషన్ నుండి ఒకొక్క గ్రామం నఉండి ఒకొక్క కులానికి మాత్రమే రుణ సదుపాయం కల్పించే అవకాశం ఉందని తెలియజేయడంతో దరఖాస్తు చేసుకున్న వారంతా విమర్శలు చేస్తూ నిట్టూర్పులతో ఆవేశంతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ మండల పరిషత్ కార్యాలయం నుండి బయటకు వచ్చారు. గతంలో నాటి కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాఆలు బిసి కార్పోరేషన్ ద్వారా రుణ సదుపాయం, సబ్సిడీపై బ్యాంకుల ద్వారా అందజేస్తే గొర్రెలు, గేదెలు, ఎద్దులు కొనుగోలు చేయించి లబ్దిదారులకు నేరుగా అందేలా చేసేవారు.

### ఒక కులానికే సబ్సిడీ రుణ సదుపాయంతో ప్రభుత్వంపై విమర్శలు :

ప్రస్తుత ప్రభుత్వం అలా కాకుండా కేవలం బిసి కార్పోరేషన్‌లో గ్రామాల్లోని అన్ని కులాలకు కాకుండా ఒక కులానికి మాత్రమే బ్యాంకుల నుండి సబ్సిడీపై రుణ సదుపాయం కల్పించి సహాయం అందిస్తాం అన్నా కూడా ప్రజల నుండి ప్రభుత్వంపై విమర్శలు తప్పించులేకపోయింది. గత ప్రభుత్వాలలో కులాల వారీగా చేతివృత్తుల వారికి ఇస్త్రీ పెట్టెలు, వడ్రంగి చేసుకునేవారికి, అవసరమైన పరికరాలు బుట్టలు అల్లుకునే వారికి బొంగులు కడా అటవీశాఖ నుండి అనుమతి ఇప్పించే వారు. దరఖాస్తు దారుడు కుల ధృవీకరణ పత్రము కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, మీసేవా కేంద్రాల చుట్టూ తిరిగి నానా అవస్థలు పడి తెచ్చుకున్నప్పటికీ బ్యాంకుల నుండి కొన్ని కులాల వారు రుణ సదుపాయం పొందే అవకాశం లేక కూలి పనులు మానుకొని రెండు, మూడురోజులపాటు ఒకొక్క దరఖాస్తుకు రూ.300లమేరా ఖర్చుచేసి మూడు రోజులపాటు కూలికి వెళ్తే వచ్చే డబ్బులు పోగొట్టుకున్నామని దరఖాస్తుదారులు వాపోయారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చే పథకాలను ఇవ్వకపోగా బ్యాంకుల నుండి సబ్సిడీపై రుణాలు ఇస్తామని ప్రకటన చేయడం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోవడం, కూలినాలి చేసుకునే బడుగు, బలహీన వర్గాలకు సహాయం చేయకపోగా నష్టం కలిగించే విధంగా ఈ ప్రభుత్వం చేస్తుందని దరఖాస్తుదారులు తీవ్ర విమర్శలు చేశారు. గ్రామాల్లోని వారికి గ్రామసభల ద్వారా రుణ సదుపాయం కల్పించే తీరును మరోమారు జిల్లా అధికారులు పున:పరిశీలించుకుని నిరుపేదలైన వారికి ఆర్థిక చేయూతనిచ్చే విధంగా పథకాలు ప్రవేశపెట్టి వాటిని సక్రమంగా అమలు చేసే విధంగా జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేస్తే నిజమైన లబ్దిదారుడికి సబ్సిడీపై ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే రుణ సదుపాయం అందుతుందని కొందరు దరఖాస్తుదారులు ఆవేదనతో అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ 395 జయంతి వేడుకలు



**కంభం రూరల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆర్య మరాఠి అధ్యక్షతన బుధవారం హిందూ సామ్రాజ్య వ్యవస్థాపకులు ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఈఓ చక్కా మాధవరావు, శశికుమార్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొని ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేర్లలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒకరని, ఆయన పేరుకు ఎంతో ప్రత్యేకత ఉందని మరాఠాల స్వరాజ్యం కోసం హిందూ ధర్మం కోసం పోరాడిన ప్రాణాలు అర్పించిన గొప్ప యోధుడు శివాజీ మహారాజని కొనియాడారు. ఆ మహనీయుడి 395వ జయంతిలో పాల్గొనడం మనందరికీ అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలే వెంకటేశ్వర్లు, గాయక్వాడ్ వల్లభరావు, తరిటే శ్రీను, కదం వెంకట సుబ్బారావు, అంబూరి వెంకటరాజేష్, మోరే శ్రీనివాసులు, తరిటే నాగార్జున్, పెనుగొండ రామ్, అంబూరి లలిత్ కుమార్, కోకోటి శ్రీను, కుమార నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే పనులను తనిఖీ చేసిన ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండల పరిధిలోని వీరరామపురం గ్రామంలో జరగుతున్న రీ సర్వే పనులను ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అగ్రిగోల్డ్ భూములు, దేవాదాయ శాఖ భూములు, ప్రభుత్వ భూములు జాగ్రత్తగా సర్వే చేయాలని ప్రతి రైతుకు నోటీసులు జారీ చేయాలని రైతుల సమక్షంలో సర్వే చేయాలని గ్రామంలో లేని రైతులను గుర్తించాలని సూచించారు. ఈ తనిఖీలో తహశీల్దార్ దిలీప్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాజేంద్ర ప్రసాద్, మండల సర్వేయర్ రమణయ్య, గ్రామ సర్వేయర్లు పులి బ్రహ్మం, శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ గ్రామ పార్టీ ఇన్‌ఛార్జీ శ్రీను, బాలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ని కలిసిన కదిరి పార్థసారథి



**సీఎస్‌పురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి దేవి అధ్యక్షతన బుధవారం గుంటూరు లాంలో ప్రైవేటు వ్యవసాయ కళాశాలల కరస్పాండెంట్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రైవేటు వ్యవసాయ కళాశాలల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు వ్యవసాయ కళాశాలల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించి ప్రైవేటు వ్యవసాయ కళాశాలల అభివృద్ధికి తోడ్పడాలని వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మిని కోరి తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, మాజీ మంత్రి, శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల కరస్పాండెంట్ పల్లె రఘునాథరెడ్డి, ఏచెర్ల కళాశాల కరస్పాండెంట్ పల్లె రఘునాథరెడ్డి, ఏచెర్ల కళాశాల కరస్పాండెంట్ మూర్తి, ఎన్ఎస్ కళాశాల కరస్పాండెంట్ చంద్రమౌళి, జేసీ దివాకర్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ జానికి రాము రెడ్డి, బద్వేల్ కళాశాల కరస్పాండెంట్ తదితులు పాల్గొన్నారు.

## పెద్దారవీడు మండల టిడిపి అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి



**పెద్దారవీడు ,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త**
మాజీ మండల పార్టీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాస్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మాబు, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి జడ్డ రవి, బీచర్లోపల్లి సర్పంచ్ ఆకు మల్లశ్రీనివాసు రెడ్డి, గొబ్బూరు మాజీ ఎంపీటీసీ వెన్నా వెంకట రెడ్డి, ఐటీ డిపి అధ్యక్షులు నక్క శీను, మండల తెలుగు యువత అధ్యక్షులు పాముల పోలురాజు, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు తిరుమలరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా బీసీ సెల్ నాయకులు తోకలఎల్లయ్య, మండల బీసీఎల్ నాయకులు కోనంగిపాలంకయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు

## జాతీయ హిందీభాష మహోత్సవ కార్యక్రమం



**మద్దిపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
బుధవారం మండల పరిధిలోని జాతీయ హిందీ భాషా మహోత్సవ కార్యక్రమాన్ని బసవన్నపాలెం, మద్దిపాడు జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణంలో డాక్టర్ షేక్ మజ్ను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారి డీఈఓ కిరణ్ కుమార్, ఏఎంఓ రమేష్ పాల్గొన్నారు. హిందీ భాష యొక్క ప్రాముఖ్యత గురించి, హిందీ యొక్క గొప్పతనం గురించి, డీఈఓ కిరణ్ కుమార్ పిల్లలకు ఉపన్యసించారు. పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు ఆయన ఆదేశించారు. బసవన్నపాలెం జిల్లా ఉన్నత పాఠశాల హెచ్ఎం పిచ్చిబాబు అధ్యక్షతన చిత్రలేఖనం, పుస్తక పఠనం, హ్యాండ్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, గేయాలు మొదలగు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు డీఈఓ కిరణ్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీనివాసులు, శేషు, మూర్తి, శివ పార్వతి, జ్యోతి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు విశిష్ట సంఖ్యతో బహుళ ప్రయోజనాలు



**దొనకొండ,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అగ్రి స్టాక్ వెబ్సైటు ద్వారా రైతులకు ఇస్తున్న విశిష్ట సంఖ్య తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాధికారి యన్. లక్ష్మి ్మ నారాయణ తెలియజేస్తున్నారు. ఈ రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా మంగినపూడి రైతు సేవా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడుతూ సాగు పొలం వున్న ప్రతి రైతుకూ 11 అంకెల విశిష్ట సంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందజేస్తున్నట్టు తెలిపారు. గ్రామ సిబ్బందికి సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వ ఇవ్వబోయే అన్నదాత సుఖీభవ, రాయితీ విత్తనాలు, సున్నా వడ్డీ పంట రుణాలు మొదలగు వాటికి ఇప్పుడు ఇచ్చే విశిష్ట సంఖ్య తప్పనిసరని తెలిపారు. రైతులు పొలం పాస్ బుక్, ఆధార్ కార్డు, ఆధార్ సంఖ్య కి లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకొని మీ గ్రామం లోనే వున్న రైతు సేవా కేంద్రానికి వెళ్లాలని కోరారు. అనంతరం సాగులో వున్న మిరప పొగాకు పంటలని రైతులతో కలిసి పరిశీలించారు.రుద్ర సమ్ముద్ర గ్రామంలో ఎన్టీఆర్ సెంటర్ లో రైతులకు విశిష్ట సంఖ్య పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో రెండు గ్రామాల రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి జి. యోగేశ్వర రావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పి. రాధిక పాల్గొన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు ఇవ్వాలి




**దొనకొండ,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త**
రాష్ట్ర బడ్జెట్లో 2000 కోట్లు నిధులు కేటాయించి. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు ఇవ్వాలని.20/02/2025 తేదీన దొనకొండ తహశీల్దార్ ఆఫీస్ వద్ద రైతులతో రాయబారం కనుక దొనకొండ మండల రైతులందరూఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరడమైనది.

# విద్యుత్ అదాలత్‌కు 8 దరఖాస్తులు

**- నాలుగు దరఖాస్తులు తక్షణమే పరిష్కారం**

**- 15 రోజుల్లో నాలుగు సమస్యలను పరిష్కరించాలి**



**అద్దంకి , ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విజయవాడ వారి ఆధ్వర్యంలో అద్దంకిలోని విద్యుత్ భవనంలో ఆ సంస్థ అధ్యక్షులు ఎస్.విక్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల లోక్అదాలత్, అవగాహన సదస్సు జరిగింది. ఈ అదాలత్ లో మొత్తం 8 ఫిర్యాదులు రాగ, వాటిలో నాలుగు ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించారు. మరో నాలుగు ఫిర్యాదులకు 15 రోజుల్లో పరిష్కారం చేయాలని సూచించారు. బిల్లులకు సంబంధించి 5, వాయిదాలకు సంబంధించి 1,లోడ్ రీడింగ్‌లకు సంబంధించి 1, మీటర్ టెస్టింగలకు సంబంధించి 1, మొత్తం 8 ఫిర్యాదుల వచ్చాయి.ఈ అదాలత్‌లో సాంకేతిక సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్‌సిహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీతతో పాటు స్థానిక ట్రాన్స్‌కో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక గుర్తింపు సంఖ్యతోనే ప్రభుత్వ పథకాలు వర్తింపు



**అద్దంకి , ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ప్రత్యేక గుర్తింపు సంఖ్యను రైతులు పొందాలని అద్దంకి వ్యవసాయ సహాయసంచాలకులు కె.ధన్‌రాజ్ అన్నారు. కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ధన్‌రాజ్ మాట్లాడుతూ పిఎంకిసాన్ లబ్ధిదారులు మండలంలో 9642మంది వుండగా 4640 మంది లబ్ధిదారులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించినట్లు ఆయన తెలిపారు. పిఎంకిసాన్ పొందని 1400మంది రైతులకు కూడ ప్రత్యేక సంఖ్య కూడ కేటాయించినట్లు ఆయన వివరించారు. మిగతా రైతులు ప్రత్యేక సంఖ్య పొందాలని సూచించారు.ఈ సమావేశంలో ఎ.ఒ. కొర్రపాటి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం



**జె.పంగులూరు , ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని ఆరికట్లవారి పాలెం,రేణింగవరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి బుధవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ (భారత ప్రభుత్వం) సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి, పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడమే దీని ఉద్దేశం అన్నారు. రైతు గుర్తింపు సంఖ్యనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య ప్రభుత్వ పథకాలు సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందని రైతుకు చేకూరు ప్రయోజనాలు అర్హులైన రైతులను గుర్తించడమే ఈ విశిష్ట సంఖ్య, అర్హులైన భూమి గల రైతులను గుర్తించడంలో తోడ్పడి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల సబ్సిడీలు పంటల భీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ సిబ్బంది వ్యవసాయ సిబ్బంది, ఎం.అలెగ్జాండర్, కె.శివాని, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పుచ్చ పంటను పరిశీలించిన ఉద్యానవన శాఖ అధికారి



**బల్లికురవ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల్లో 200 ఎకరాలకు పైగా సాగు చేసిన పుచ్చ తోటలను బుధవారంజిల్లా ఉద్యానవన శాఖ అధికారి జన్యమ్య పరిశీలించారు. మల్చింగుతో పుచ్చ సాగు చేపట్టడం ద్వారా కలుపు తక్కువగా రావడం, నీటి ఆవిరిని నిరోధించడం, పంటలకు చీడ పీడలు ఆశించకుండా నివారించడం, తెగుళ్లను కూడా అరికట్టవచ్చని అన్నారు. ఆమె వెంట మండల ఉద్యానశాఖ అధికారి హనుమంతు నాయక్, వీఏఏ వెంకటేశ్వర్లు, ప్రసన్నలు ఉన్నారు.

# బోడేనాయక్ దండాలో పొలం పిలుస్తోంది



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
దోర్నాల మండలంలోని బోడే నాయక్ తండా గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది , రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య అవగాహన నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ పథకాలు రావాలంటే తప్పనిసరిగా రైతు విశిష్ట సంఖ్య ఉండాలని కాబట్టి రైతులందరూ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో మీ యొక్క పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ నెంబర్, చరవాణి నెంబర్ తీసుకొని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఈనెల 25వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

## మంత్రి రవీంద్రను సత్కరించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
ఒంగోలులోని ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్‌లో బుధవారం నాడు రాష్ట్ర ఎక్సైజ్ అండ్ మైనింగ్ శాఖ మంత్రికొల్లు రవీంద్రను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో పాతాళగంగా స్నానం పరమపవిత్రం



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహాక్షేత్రంలో జ్యోతిర్లింగం మల్లిఖార్జునుడు, శక్తిపీఠం భ్రమరాంబికా దేవి వెలసిన శ్రీశైల పాతాళగంగ (కృష్ణానది) నదిలో స్నానమాచరిస్తే పరమ పవిత్రమని వేదాలు, పురాణాలు తెలుపుతున్నాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 19వ తేదీ బుధవారం నుండి ప్రారంభమయ్యాయి. ఎందరో రాజులు, రాణులు, సామంతులు, సంపన్నులు, సామాన్యులు సైతం శ్రీశైలం నాధున్ని సేవించి తమ ఘనతను చాటుకున్నారు. ఆంధ్ర ప్రాంత తొలి పాలకులైన శాతవాహనులు మొదలు ఇక్ష్వాకులు, పల్లవులు, విష్ణు కుండీలు, కదంబులు, చోళులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర ప్రభువులు, చత్రపతి శివాజీ వంటి వారందరి ప్రాపకంతో ఈ క్షేత్రం సమున్నత స్థాయి పొందింది. ఇంతటి ఘనత ఉన్న శ్రీశైలంకు దిగువన పెద్దదోర్నాల ఉంది. ఓం నమ:శివాయ హర హర మహాదేవ శంభో శంకర అంటూ శివనామస్మరణ మార్మోగుతుంది. మహా పర్వదినమైన మహాశివరాత్రి రోజున పాతాళ గంగాలో మునిగి స్నానం చేసి స్వామివారిని దర్శిస్తే సకల పాప హరణం జరుగుతుందని వేదాలు చెబుతున్నాయి. దేశం నలుమూలల నుండి వచ్చే లక్షలాది మంది భక్తులు పరమ పవిత్రమైన పాతాళ గంగ స్నానమాచరిస్తారు.

# వెలమవారిపాలెం, కొత్తూరులో పొలం పిలుస్తోంది




**బల్లికురవ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండలంలోని వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కుమారి మాట్లాడుతూ సాగు భూమి ఉన్న రైతులందరూ రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసిన రెండు రోజుల తరువాత పదకొండు అంకెల ఐడీ నంబర్ రైతుల మొబైల్ ఫోన్‌కి వస్తుందని దానిని భద్ర పరుచుకోవాలని తెలిపారు. ఈ ఐడి నంబర్ ద్వారానే వ్యవసాయ అనుబంధ శాఖలలో అమలు చేసే పథకాలకు లబ్దిదారులుగా ఉండడానికి వీలవుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయటానికి పొలం 1బీ ఆధార్ నంబర్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ అవసరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు చెన్నకేశవ, ప్రసన్న పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల శిక్షణా కేంద్రంను సందర్శించిన ఎంఈఓ



**మార్టూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండలంలో అంగన్‌వాడీలకు జరుగుతున్న ఆరు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన శిక్షణను మండల విద్యాశాఖాధికారి ఎంసీహెచ్ వస్రామ్ నాయక్ సందర్శించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వ్యయాన్ని హెచ్చించి నిర్వహిస్తున్నందున మండలంలోని అంగన్‌వాడీ వర్కర్స్ అందరూ కూడా సద్వినియోగం చేసుకొని విద్యాబోధనలో మరింత నైపుణ్యంతో కూడిన మెలుకువలు నేర్చుకొని విద్యార్థులకు మెరుగైన ఆకర్షణతో, ఆట పాటలతో కూడిన విద్యాబోధన అందించాలని ఎంఈఓ సూచించారు. మండలంలోని వలపర్ల హైస్కూల్ నందు, కోలలపూడి హైస్కూల్ నందు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన బి.రాంబాబు, యోహోషువలు రిసోర్సు పర్సన్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఆర్పీలు శ్రీనివాస్, తిరుపతమ్మ, స్థానిక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

**- ప్రిన్సిపల్ మేరీ కుమారి**





**రాచర్ల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని రాచర్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ టి మేరీ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరాలకు సంబంధించి 2025 -26ఆర్థిక సంవత్సరానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. 5వ తరగతిలో చేరగోరే విద్యార్థులు 2024-25వ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో నాల్గవ తరగతి చదివి ఉండాలని ఎస్సి, ఎస్టి అభ్యర్థులు 01-09-2012 నుండి 31-08-2016మధ్య జన్మించి ఉండాలని బిసి మరియు బిసి -సి, ఓసిలు 01-08-2014 నుండి 31-08-2016 మధ్య జన్మించి ఉండాలని, అలాగే ఇంటర్మీడియట్‌లో చేరగోరే విద్యార్థులు 2024 -25సంవత్సరంలో 10వ తరగతి మొదటిసారి పాసై ఉండాలని, పాఠశాల, కళాశాలలోనే దరఖాస్తు చేసుకోవాలని తల్లి తండ్రి వార్షిక ఆదాయం లక్షకు మించి ఉండరాదని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 5వ తరగతి వారికి 06-04-2025 ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు ఇంటర్మీడియట్ వారికి అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుండి 4.30గంటల వరకు ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు విద్యార్థి ఫోటో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కాస్ట్ సర్టిఫికేట్‌తో సమీపంలోని నెట్ సెంటర్‌కి వెళ్ళి దరకాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8309540981 సెల్ నెంబరును సంప్రదించాలని ఆమె కోరారు. గురుకులాల్లో విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో స్టడీ అవర్స్‌తో కూడిన ఆంగ్లమాధ్యమంలో నాణ్యమైన విద్య, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్, యూనిఫామ్, బెల్ట్, నిబంధనల ప్రకారం తల్లికి వందనం వర్తింపు లేబరేటరీలో కంప్యూటర్ విద్య అన్ని సౌకర్యాలతో కూడిన వసతి గృహం, పోషకాహార పదార్థాలతో కూడిన భోజనం, నిపుణులైన సిబ్బందిచే యోగా, వ్యాయామం, విద్య, క్రీడలు, ఆరోగ్య పర్యవేక్షణ ఉంటుందని ఆమె తెలిపారు.

# సోమిదేవిపల్లి, గుడిమెట్ట గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**రాచర్ల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబ్దుల్ రఫీక్ బుధవారం మండలంలోని సోమిదేవిపల్లి, గుడిమెట్ట గ్రామాల్లో బుధవారం రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేశారు. పంటల సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రతి ఒక్క భూమి ఉన్న రైతు తమ భూమికి సంబంధించిన ఆధారాలు తీసుకొని వెళ్ళి రైతు సేవాకేంద్రాలలో సమర్పించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని అలా చేయించుకున్న వారికి ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య ఆ రైతుకు కేటాయిస్తుందని తెలిపారు. విశిష్ట గుర్తింపు సంఖ్య పొందిన రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని లేకపోతే వర్తించవని అన్నారు. ఆధార్ కార్డు, ఆధార్ కార్డుతో లింక్ అయిన ఫోన్ నెంబర్, పాస్ పుస్తకం తీసుకువెళ్ళి రైతు సేవాకేంద్రాల్లో ఈనెల 24వ తేదీలోపు నమోదు చేయించుకోవాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు వచ్చే ఏ పథకాలు రైతులకు దక్కాలన్నా విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని ఆయన తెలిపారు. రైతులు ఈ విషయాలను గమనించి వెంటనే తమ పేర్లు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పి గుర్రప్పడు, బి సాయి మౌనిక, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలలుగా అందుబాటులో లేని పోస్టల్ ఏటీఎం సేవలు




**మార్కాపురం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
పోస్టల్ ఖాతాదారులకు గత ఆరు నెలల నుండి పోస్టల్ ఏటీఎం సేవలు అందుబాటులో లేకపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. సుమారు 8 సంవత్సరాల క్రిందట పోస్టల్ ఖాతాదారులకు మంజూరు చేసిన పోస్టల్ ఏటీఎం కార్డులు గడువు తీరడంతో అవి పని చేయడం లేదు, గడువు తీరిన ఏటీఎం కార్డుల స్థానంలో కొత్త కార్డులు మంజూరు చేయాల్సిన పోస్టల్ శాఖ అధికారులు ఖాతాదారుల గోడును పట్టించుకోకపోవడంతో అధికారుల తీరుపై వారు పెదవి విరుస్తున్నారు. పోస్టల్ నగదు లావాదేవీల కోసం పోస్టాఫీసు వద్ద గంటల కొద్ది వేచి ఉండాలంటే ఖాతాదారులకు ప్రధానంగా వృద్ధులు, పెన్షనర్లకు ఇబ్బందిగా మారిందని ఎన్ని సార్లు పోస్టల్ శాఖ ఉన్నతాధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం హెడ్ పోస్టాఫీసు పరిధిలో మొత్తం 29 పోస్టాఫీసులు ఉండగా అందులో పోస్టల్ ఏటీఎంలను వినియోగించుకునే వారు సుమారు 800 మంది ఉన్నారు. వీరి అందరి ఏటీఎం కార్డు 2024 సంవత్సరం అక్టోబర్‌తో ముగిసింది. ఏటీఎం కార్డులు కలిగి ఉన్న వారిలో అధిక సంఖ్యలో పెన్షనర్లు ఉన్నారు. వారు నెల పెన్షన్లు పొందాలంటే పోస్టాఫీసుకు రావాల్సి వస్తుందని, వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పోస్టాఫీసులో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడం, ఉన్న సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం సర్వర్లు అందడం లేదని వంక చెప్పడం లాంటి చర్యలతో పోస్టాఫీసు చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వస్తుందని పోస్టల్ అధికారులు తీరుపై పెదవివిరుస్తున్నారు. మార్కాపురం పోస్టాఫీసు సబ్ డివిజన్ పరిధిలో ఏటీఎం కార్డులు పొందిన వారు ఉన్నతాధికారులకు వారి ఇబ్బందులను లిఖితపూర్వకంగా తెలియజేసినప్పటికి వారు సమస్యను పరిష్కరించే దిశగా స్పందించడం లేదని అంటున్నారు. అన్ని రకాల బ్యాంకులు ఖాతాదారులకు నాణ్యతతో కూడిన సేవలు అందిస్తుండగా చారిత్రాత్మక తంతి తపాలా కార్యాలయాలు మాత్రం ఖాతాదారులకు ఎలాంటి సేవలు అందించలేకపోతున్నామని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని పోస్టాల్ అధికారులు నూతన పోస్టల్ ఏటీఎం కార్డుల పంపిణి విషయంలో దృష్టి సారించి తక్షణమే ఖాతాదారులకు కార్డులు మంజూరు చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.


# పట్టణంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలంటూ..

**- ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ**




**యర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు చాలా ఏళ్ళనుంచి విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని కోటిరూపాయలకు పైగా బకాయిలు రావాల్సి ఉందని ప్రతిసారి విద్యుత్తు సిబ్బంఆది సమాచారం అందించినా వారు స్పందించడం లేదని దాంతో బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేసినట్లు విద్యుత్ డిఈ, ఏఈ జెఈఒ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ బిల్లు చెల్లించే విషయంలో నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తున్నాయని పట్టణంలో ప్రభుత్వ శాఖకు చెందిన కార్యాలయాలు వందల సంఖ్యలో ఉన్నా వాటిలో కొన్ని కార్యాలయాల విద్యుత్ బిల్లులు పేరుకొని కోటిరూపాయలకు పైగా బకాయిలు పడి ఉన్నాయని అందుకే ఆ కార్యాలయాలకు నోటీసులను అందజేస్తున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

**పేరుకుపోయిన మండలంలోని పలు గ్రామాల కార్యాలయాల బకాయిలు :**



పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల కార్యాలయాల బకాయిలు ముఖ్యంగా అంగన్ వాడీ సెంటర్ల బకాయిలు పేరుకొని పోయి ఉన్నాయని, పలుమార్లు బిల్లులు చెల్లించినా సమాచారం రూపంలో తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను బలవంతంగా వసూలు చేయరాదన్న ఉన్నతాధికారులు ఆదేశాలను పాటించకతప్పడం లేదని దాంతో యర్రగొండపాలెం పట్టణంలో పలు కార్యాలయాలకు నోటీసులు జారీ చేశారు. అందులో అధిక బిల్లులు ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల రూ.1.89లక్షలు, అంగన్‌వాడీ కేంద్రాలు రూ.1.90లక్షలు, ప్రభుత్వ ఆసుపత్రి రూ.2.38లక్షలు, పోలీస్ స్టేషన్ రూ.94వేలు, తహశిల్దార్ కార్యాలయం రూ.1.86లక్షలు, ఎంఈఓ కార్యాలయం రూ.8.74లక్షలు, సోషల్ వెల్ఫేర్ రూ.12.54లక్షలు ఉన్నాయి. ఇలా మిగతా ప్రభుత్వ కార్యాలయాలను కలుపుకుని బకాయిలు దాదాపుగా కోటిరూపాయల పైనే ఉన్నాయని విద్యుత్ శాఖ చెబుతుంది.

**బకాయిలపై విద్యుత్ అధికారుల వివరణ :**

పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని బకాయిలు సంవత్సరాలతరబడి పేరుకుపోయి దాదాపుగా కోటిరూపాయలకు దాటిందని ప్రభుత్వ కార్యాలయాలకు బలవంతంగా వసూలు చేయడం కుదరదుగనుక బకాయ చెల్లింపులలో మినహాయింపులు తదితర విషయాలపై సమాచారం లేదని విద్యుత్ శాఖ డిఈ పివి నాగేశ్వరరావు, ఏఈ తలపాటి అల్లూరయ్య, జెఏఒ కె మల్లిఖార్జునలు వివరించారు. ఈ విషయాన్ని మరోమారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని, నోటీసుల ద్వారా హెచ్చరిస్తున్నామని తెలిపారు.

## తెల్లబాడు జడ్పీహెచ్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ



**మద్దిపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
విద్యార్థులు తప్పనిసరిగా తమకు కష్టమైన సబ్జెక్టుపైన ఎక్కువ సమయం కేటాయించి చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని తెల్లబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీలో భాగంగా పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్‌లో కాసేపు తిరిగారు. విద్యార్థులతో సబ్జెక్టు యొక్క విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించి, పరీక్షల్లో తీసుకోవాల్సినటువంటి తగు జాగ్రత్తలను వారికి తెలియజేశారు. తదుపరి అసెంబ్లీలో ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ భక్తి భావంతో మెలిగి తమ కష్టమైన సబ్జెక్టుపై ఎక్కువ సమయాన్ని కేటాయించి సబ్జెక్టు యొక్క విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకొని పరీక్షల్లో విజయవంతం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**పొన్నలూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని పొన్నలూరు మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పొన్నలూరు శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ స్థానిక స్టేట్ బ్యాంకు నుండి గ్రామ వీధుల్లో సైకిల్ ర్యాలీ విజయవంతంగా జరిగింది. ఎంపీ చలపతిరావు మాట్లాడుతూ ముస్లిం రాజుల పరిపాలనలో హిందువుల పట్ల నిరంకుశంగా మతం మార్పిడి కొనసాగుతున్న సందర్భంగా హిందూ సామ్రాజ్య విస్తరణకే చత్రపతి శివాజీ చూపిన చొరవతో నేటి దేశం హిందూ దేశంగా కొనసాగుతుందని అన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంచాలని లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న కృషికి దేశ పౌరులందరూ మద్దతు ఇవ్వాలన్నారు. ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి, దేశ భద్రతకు పాటు పడుతూ ముందుకెళ్లాలన్నారు. యువత చెడు మార్గలంలో కాకుండా హిందూ సమాజం ఉద్ధరణ కోసం పాటుపడుతూ సనాతన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం సురేష్, కోటయ్య తదితర స్వయం సేవకులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప ట్రస్టు ఆధ్వర్యంలో 40వ వారం పేదలకు అన్నదాన వేడుకలు



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నాడు 40వ వారం పేద వర్గాలకు ట్రస్టు సహకారంతో అన్నదాన వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా ట్రస్టు మిత్ర బృందం ఎన్నారై బెజవాడ శ్రీనివాసరావు, పద్మజలు విచ్చేశారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. సేవ సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ పాతూరి సంపత్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో ట్రస్టు ఆధ్వర్యంలో దేశ విదేశాల నుండి దాతల సహకారంతో గత 40 వారాల నుండి ఒక పక్క సేవలు, మరొక పక్క పేద వర్గాలకు అన్నదాన వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్టు గౌరవ అధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, ట్రస్టు సభ్యులు కొప్పోలు శ్రీనివాసరావు, ఎస్.మల్లారెడ్డి, కే.ఆంజనేయులు, సీహెచ్ చంద్రావతి, ఎస్.ధనలక్ష్మీ, షేక్ అజీరా, బి.సుధారాణి, నేతి శ్రీదేవి, డి.శివయ్య, కే.జయరాం, ఎం.శ్రీనివాసరావు, కే.రమేష్, వి.నాగరాజు, ఎస్.శ్రీనివాసరావు, మద్ది శ్రీనివాసరావు, ఏ.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన మద్దిపాడు కాలేజీ విద్యార్థులు



**మద్దిపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన మద్దిపాడులోని కడియాల యాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభను చాటారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 385 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో మూడు బహుమతులను మద్దిపాడు జూనియర్ కళాశాల విద్యార్థులు గెలుచుకొని వారు ప్రతిభను చాటుకున్నారు. ఈ పోటీల్లో భారత రాజ్యాంగం, పర్యావరణ పరిరక్షణ అను విషయంకు సంబంధించిన వ్యాసరచన పోటీ నిర్వహించగా దీనిలో మద్దిపాడు కళాశాలలో జూనియర్ బైపీసీ చదువుతున్న కే.ప్రణీత అనే విద్యార్థినీ జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని గెలుచుకుని రూ.7116లను కైవసం చేసుకున్నారు. ఇరువురు జూనియర్ సీఈసీ చదువుతున్న శ్రీలత, అరుణ విద్యార్థినిలు కన్సోలేషన్ బహుమతులు రూ.1116లు నగదు బహుమతిని గెలుచుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి జిల్లా స్థాయిలో బహుమతులను అందుకోవడం పట్ల పలువురు ప్రశంసించారు. మంచి ప్రతిభ కనపరిచి కళాశాలకు జిల్లా స్థాయిలో మంచి పేరును తీసుకువచ్చినందుకు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పీడీ ఆదినారాయణలతో పాటు కామర్స్ అధ్యాపకులు ప్రవీణా రాణి, బోధన సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## అన్ని విభాగాల వైద్యాధికారులను నియామకం జరపాలి

**- డిఎంహెచ్‌ఓను కలిసిన గిద్దలూరు బిజేపి నాయకులు**



**గిద్దలూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని 100పడకల ఏరియా వైద్యశాలలో అన్ని విభాగాలలో వైద్యాధికారులను నియామకం జరపాలని ఒంగోలు డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లును గిద్దలూరు పట్టణ బిజేపి అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్ శంకర్ కోరారు. బుధవారం ఒంగోలు డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లును ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో భారతీయ జనతాపార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో బిజేపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ బిజేపి అధ్యక్షుల అపిశెట్టి ఉదయ్ శంకర్ మాట్లాడుతూ గిద్దలూరు పట్టణంలో 100పడకల ఆసుపత్రిలో అన్ని విభాగాలలో వైద్య పరికరాలను, వైద్య అధికారులను నియామకం జరపాలని, అంతేకాకుండా ఆసుపత్రికి ఓపిలు ఎక్కువగా వస్తున్నాయని కావునా అన్ని వ్యాధులకు సరిపడా మందులను సరఫరా జరిగే విధంగా చూడాలని డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లును కోరారు. దీనిపై డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

## ఆక్రమణదారులపై భూకబ్జా కేసు నమోదుచేయాలి

**- సీపీఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు**

**కనిగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**




కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో, మండల పరిధిలో చెరువులు, వాగులు, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న ఆక్రమణదారులపై భూకబ్జా కేసు నమోదు చేయాలని సీపీఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. బుధవారం కనిగిరి పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని చెక్‌పోస్టు వద్ద 493 బైబ వాగు ఆక్రమించి ఫిల్లర్లు వేశారన్నారు. కొత్తూరు పరిధిలోని వాగు వద్ద 538, 540, సర్వే నెంబర్లలో బేస్‌మట్టం వేశారని, తుమ్మకుంట పరిధిలో 96,97,98 సర్వే నెంబర్లలో వాగును ఆక్రమించారని తెలిపారు. వెన్నెల అపార్టుమెంట్ వెనుక చెక్ డ్యాంకు అడ్డంగా, వాగును ఆక్రమించి కట్టడాలు కడుతున్నారని తెలిపారు. శంఖవరం పరిధిలో 419 సర్వే నెంబర్‌లోని వాగును ఆక్రమించి మట్టి తోలారన్నారు. మంగళిమాన్యంలో 488 సర్వే నెంబరు భూమి ఆక్రమణకు గురైందన్నారు. వృద్ధాశ్రమం వద్ద 191సర్వే నెంబర్‌లో స్టేటస్ కో ఉండగా విద్యుత్ స్తంభాలు వేశారన్నారు. సూరా పాపిరెడ్డి నగర్‌లో 894, 895 సర్వే నెంబర్ లలో ప్రభుత్వ అవసరాల కోసం వదిలిన ఎనిమిది ప్లాట్‌లను ఆక్రమించి విక్రయించడం జరిగిందన్నారు. వాగులు, వంకలు ఆక్రమణలకు గురి కావడం ఇటీవల కనిగిరి పట్టణం వరద ముంపుకు గురైందని తెలిపారు. రాబోవు కాలంలో ఆక్రమణలను కట్టడి చేయకపోతే కనిగిరి ప్రమాదాన్ని ఎదుర్కొనాల్సి వస్తుందని పేర్కొన్నారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ సమన్వయ లోపం వలన ఆక్రమణలు పెరిగిపోయాయి అన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలనకే పరిమితమవుతుండగా ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహారిస్తున్నారని ఫలితంగా అధికార ప్రతిపక్ష నాయకులు రియల్ వ్యాపారులు అవతారం ఎత్తి అక్రమాలకు తెగబడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భూ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేసి అక్రమార్కులపై భూ కబ్జా కేసులను నమోదు చేయాలని లేకుంటే రాబోవు కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మాలకొండయ్య, ఆర్.ఏడుకొండలు, నరేంద్ర, ఎస్కే బషీర, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయాధికారి డాక్టర్ యడ్లవల్లి లక్ష్మణరావు కలిసిన ప్రముఖులు

**కనిగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీ)గా పని చేస్తూ ఇటీవల కాలంలో హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తర్వాత మొదట సారిగా బుధవారం కనిగిరికి విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ యడవల్లి లక్ష్మణరావును కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కమీషనర్ దానియేల్ జోసఫ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ న్యాయమూర్తి యడవల్లి లక్ష్మణరావుది ఉమ్మడి ప్రకాశం జిల్లా కనిగిరి స్వస్థలం అని ప్రాథమిక విద్య ప్రకాశం జిల్లాలో సాగిందని నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించి క్రిమినల్ లా, కంపెనీలాలో బంగారు పతకాలు సాధించారని అన్నారు. 2000 సంవత్సరంలో న్యాయవాదిగా పేరు ఎన్‌రోల్ చేసుకున్నారని అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, కావలిలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారని 2014లో జిల్లా జడ్జిగా ఎంపికై ప్రస్తుతం హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన సందర్భంగా కనిగిరి ప్రాంత ప్రజల తరుపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదోన్నతుల పొంది కనిగిరి ప్రాంత కీర్తి ప్రతిష్ఠలు చాటాలని అన్నారు.

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

**చీరాల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



చీరాల పట్టణంలోని దేవదాయశాఖకు సంబంధించిన స్థలాలు ఆక్రమానికి గురవుతున్నాయని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని ఆరోపించారు. జిలానీ మాట్లాడుతూ చీరాల పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపం వెనుక వైపు కొంత తుంది అక్కడ స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్లు వేసి మూడు నాలుగు నెలల నుండి ఆ స్థలాన్ని వేరొకరికి అమ్మి మరో స్థలాన్ని ఆక్రమించుకోవడం జరుగుతుంది, కొంత మంది ఈ విధంగా చేయడంతో నిజంగా స్థలాలు లేని పేదవాళ్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంపై విచారణ చేపట్టి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని చీరాల ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ అర్జున్‌కు వినతిపత్రం అందజేశారు.

## దివ్యాంగుల మధ్య ఆవుల సుహారిక జన్మదినోత్సవ వేడుక

**- దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ**

**కనిగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో కృష్ణా దంత వైద్యశాల, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షులు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి కుమార్తె ఆవుల సుహారిక జన్మదినం సందర్భంగా బుధవారం వికలాంగుల హక్కుల వేదిక మహిళా విభాగం అధ్యక్షులు శ్రీరామ లక్ష్మీ అధ్యక్షతన వికలాంగుల ఐక్యవేదిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల మధ్య సుహారిక కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యాంగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వికలాంగత్వం కలిగిన వారికి వైద్యపరంగా నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా తెలియజేశారు. దివ్యాంగుల మధ్య తన కుమార్తె పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే మానవ హక్కుల జిల్లా అధ్యక్షురాలు మద్దిశెట్టి భారతి మాట్లాడుతూ కృష్ణారెడ్డి వైద్య సేవలోనూ, రాజకీయాల్లోనూ ఇంకా ముందు ముందు వైద్య పరంగా, రాజకీయంగా ముందుకు సాగాలని ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక నాయకులు పాలడుగు నాగేశ్వరరావు, బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శారద తదితరులు పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ జయంతి వేడుక

**దర్శి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణరెడ్డి నివాసంలో చత్రిపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిండి నారాయణరెడ్డి మాట్లాడుతూ భరతమాత మొఘలుల సంకెళ్ల నుండి విడిపించి హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించిన సంకెళ్ల నుండి విడిపించి హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించిన మేరునగ ధీరుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వి.అమరేశ్వరరావు, యువ మోర్చా జిల్లా నాయకులు చెరుకూరి అనిల్ కుమార్, టీడీపీ నాయకులు బయ్యారం మాజీ సర్పంచ్ అడుసుమల్లి సాంబయ్య, యువమోర్చా నాయకులు తిండి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అర్ధవీడు సచివాలయానికి

# ఉద్యోగుల కొరత.. ఉన్న వారికి పని భారం

*- సంబంధిత శాఖ వారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు*

*- జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నియమించాలని ప్రజల విన్నపం*


**అర్ధవీడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**




అర్ధవీడు మండల కేంద్రమైన గ్రామ సచివాలయానికి ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఈ ఉద్యోగుల కొరత ప్రజలు ఇబ్బంది పడడమే కాకుండా సచివాలయంలో ఉన్న కొంత మందికి పని భారంగా మారింది. వారికి నియమించిన శాఖలలో పని చేయటానికి సమయం సరిపోక మిగతా శాఖలకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న పదవికి న్యాయం చేయలేక పోతున్నామని మనోవేదన ఉద్యోగులలో ఉండకనే లేదు. అర్ధవీడు ప్రధాన సచివాలయం నందు విలేజ్ సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ తదితర శాఖలకు సంబంధించిన ఉద్యోగుల కొరత తీవ్రంగానే ఉంది. వెనుకబడిపోయినటువంటి అర్ధవీడు మండలాన్ని జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఖాళీగా ఉన్న సంబంధిత శాఖ ఉద్యోగస్తులను నియమించాల్సిందిగా అర్ధవీడు మండల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

## ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలంలోని చీర్వానుప్పలపాడు, పోతవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులచే పొలం పిలుస్తోంది కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాదికారి ఎస్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి పి.వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో స్వంత భూమి గల ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం దీని ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు అయినటువంటి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, వడ్డీపై పంట రుణాలు, రాయితీపై యంత్ర పరికరాలు, బిందు, తుంపర సేద్యం రాయితీ, పెట్టుబడి సాయం, రుణాలు మొదలైన సేవలు పొందడానికి ఈ సంఖ్య అధికారికంగా గుర్తింపుగా పని చేస్తుందని తెలియజేశారు. ఈ గుర్తింపు సంఖ్యను పొందుటకు రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింకు అయిన ఫోన్ నెంబరుతో దగ్గరలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించినట్లయితే దీన్ని పొందవచ్చని తెలియజేశారు. ఈ పంట గడువు ఫిబ్రవరి 25వ తేదీతో ముగుస్తున్నందున అందరూ రైతులు వేసిన పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగేశ్వర్‌రెడ్డి

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**





పాఠశాల విద్య గుంటూరు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగేశ్వర్‌రెడ్డి మండలంలోని పోతవరం ఎయిడెడ్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణకు సంబంధించి ఉపాధ్యాయులు అందరితో సమీక్ష నిర్వహించి కొన్ని సూచనలు తెలియజేశారు. అలాగే నాగులుప్పలపాడు హైస్కూల్ నందు జరుగుతున్నటువంటి జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణకు సంబంధించి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ ఈ ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకుని అంగన్‌వాడీలను బలోపేతం చేసే విధంగా అందరూ కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి టి.రవి, ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, రిసోర్సు పర్సన్‌లు మాలకొండయ్య, నాగాజు, సూపర్‌వైజర్లు ఉషారాణి,శ్రీదేవి పాల్గొన్నారు.

## ఆయుర్వేద మెడికల్ క్యాంపు

**టంగటూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



కొండపి మండలం వెన్నూరు గ్రామంలో ఆయుర్వేద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో డాక్టర్ ఎం.శివకృష్ణ రోగులను పరీక్షించి ఆయుర్వేద మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ హోమియోపతి ఆయుర్వేద మందులు మనిషిలోని రోగాలను, రోగ మూలాలను నిర్మూలించి పని చేస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కసుకుర్తి మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో రోజు శిక్షణ

**టంగుటూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని ప్రభుత్వ ఉన్నత పాటవాల ఆవరణంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి చెంచు పున్నయ్య మాట్లాడుతూ చిన్న పిల్లలకు చదువుతో పాటు మానసికంగా ఆరోగ్యాన్ని పెంపొందించేలాగా పాటలు, ఆటలు సైన్స్ చిన్న చిన్న కథలు వారికి నేర్పించి వత్రులకు గురి కాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఓ.నాగమల్లేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లస్టర్ సమావేశం

**టంగుటూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**




టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం క్లస్టర్ సమావేశం జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు అధ్యక్షతన సమావేశం జరిగింది. క్లస్టర్ పరిధిలోని ప్రాధమిక ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు క్లస్టర్ సమావేశానికి హాజరయ్యారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వి సుధారాణి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం సూచనలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధ్యాయుల వారి సబ్జెక్టులపై అవగాహన, స్వర్ణ ఇంద్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా తూర్పునాయుడుపాలెం క్లస్టర్‌లో పాఠశాలలన్నీ ప్రతినెల మూడో శనివారం నిర్వహించాలని క్లస్టర్ పరిధిలోని ఏర్పాటు చేసే సముదాయ సమావేశాన్ని అందరూ కలిసి మండలంలో తూర్పునాయుడుపాలెం మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేయాలని క్లస్టర్ హెచ్‌ఎం ఎన్‌వి సుధారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, బాలకృష్ణ, ఎంఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుక

**కురిచేడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన కురిచేడులో బుధవారం నాడు మహారాజ్ చత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాంధీ విగ్రహం సెంటర్లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ స్వదేశీ పాలనను, స్వదేశీ తత్వాన్ని స్థిరపరిచిన మహానుభావుడు శివాజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కురిచేడు మండల ఆర్యవైశ్య సంఘ ప్రెసిడెంట్ జవ్వాజి సత్య నారాయణ, బీజేపీ నాయకుడు కురంగి నాగేశ్వరరావు, పెద్దవరం మాజీ సర్పంచ్ మారెళ్ళ చెన్నకేశవులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు అయ్యప్పశెట్టి, జి.ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని తనిఖీ చేసిన జిల్లా డీసీడీఓ

**కురిచేడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



మండలంలో గల కేజీబీవీ విద్యాలయాన్ని బుధవారం నాడు సమగ్ర శిక్ష డీసీడీఓ కే.హేమలత, సీఎంఓ కే.సోని రూద్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు పంచతంత్ర కార్యక్రమం అమలును పరిశీలించారు. ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధనను పరిశీలించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఖచ్చితంగా కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి బోధన సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

## డీఈఓ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయండి

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**

ఉపాధ్యాయుల దీర్ఘకాలిక, వ్యక్తిగత సామూహిక సమస్యల పరిష్కారం కొరకు ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 22న డీఈఓ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరుగుతుందని, దీనికి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జేవీఆర్ పిలుపునిచ్చారు.

## తవుడులో ఎలాంటి హానికర పదార్థాలు లేవు

**- పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరక్టర్ ఏ.రమేష్‌బాబు**

**ముండ్లమూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



మండలంలోని వేంపాడు వద్ద గల ఓ రైస్ మిల్లులో నిల్వ చేసిన తవుడులో ఎలాంటి హానికర పదార్థాలు లేవని ఒంగోలు పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరక్టర్ అన్నవరపు రమేష్‌బాబు, దర్శి పశుసంవర్థకశాఖ ఏడీఏ ఏ.పురుషోత్తం రాజుతో కలిసి రైస్ మిల్లు వద్ద బుధవారం విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన వేంపాడు రైస్ మిల్లులో హానికర పదార్థాలు కలిసి తవుడు అమ్ముతున్నారని ఓ అపరిచిత వ్యక్తి జిల్లా అధికారులకు సమాచారం అందించడం జరిగింది. ఆ సమాచారంతో విజిలెన్స్, తూనికల కొలతల శాఖ, లేబర్ డిపార్టుమెంట్, పశుసంవర్థక శాఖ అధికారులు సంయుక్తంగా రైస్ మిల్లుపై దాడులు నిర్వహించారు. రైస్ మిల్లులో 900 బస్తాల తవుడు, మరో 10 బస్తాల తెల్ల పొడిని గుర్తించారు. ఆ రెండింటిని శాంపిల్స్ నిమిత్తం వీబీఆర్ఐ విజయవాడ ల్యాబ్‌కు పంపించారు. ఈనెల 18వ తేదీన ఆ తవుడు ఎలాంటి హానికర పదార్థాలు లేవని ల్యాబ్ రిపోర్టు వచ్చిందని పశుసంవర్థకశాఖ అధికారులు తెలిపారు. అధికారులు సీజ్ చేసిన గదిని వీఆర్వో కావూరి దయానందం సమక్షంలో మిల్లు లీజు యజమాని రావూరి దుర్గా ప్రసాద్‌కు అందజేసినట్లు తెలిపారు. మిల్లు లీజు యజమాని పశుసంవర్థక శాఖ నుండి లైసెన్స్ తీసుకొని వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని ఆయన తెలిపారు.

## నాటుసారా నిర్మూలనపై అవగాహన సదస్సులో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి,ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో నవోదయం 2.0 నాటుసారా నిర్మూలనపై సదస్సు అనంతరం జరిగిన అవగాహన ర్యాలీలో ముఖ్య అతిధులుగా హాజరైన రాష్ట్ర గనులు, భూగర్భ జలవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జిల్లా మంత్రి వర్యులు డోలా బాల వీరాంజనేయస్వామితో పాటు దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధతోనే ప్రభుత్వం నాటుసారా,ఇతర డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మనఆరోగ్యం,మన కుటుంబ సభ్యుల ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. దేశ భవిష్యత్తుకు ఆధారమైన యువత నాటుసారా,డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.

## ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయండి

**- ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వాకా జనార్ధన్‌రెడ్డి**

**ముండ్లమూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లాలోని ఉపాధ్యాయులు దీర్ఘకాలిక, వ్యక్తిగత, సామూహిక సమస్యల పరిష్కారం కొరకు ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు డీఈఓ కార్యాలయం ఎదుట జరిగే ఏపీటీఎఫ్ ధర్నాకు కార్యకర్తల సమీకరణలో భాగంగా ముండ్లమూరులో డీటీ బుధవారం సాయంత్రం 4గంటలకు ఏపీటీఎఫ్ ముద్లమూరు సబ్ కమిటీ సమావేశం మండల శాఖ అధ్యక్షులు టి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు వాకా జనార్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈయన మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయుల వ్యక్తిగత, సామూహిక సమస్యలు పరిష్కారం కొరకు జిల్లా విద్యాశాఖ అధికారికి గత మూడు నెలలుగా రెండు సార్లు వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది. కానీ డీఈఓ కార్యాలయం సిబ్బందిసాచివేత ధోరణిని అవలంభిస్తూ కాలయాపన చేస్తున్నారు. తప్ప ఒక్క సమస్యను కూడా పరిష్కారం చేయలేదు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు సంబంధించి సర్వీసు రెగ్యులైజేషన్, ప్రొఫెషన్ డిక్లరేషన్, 2008 తెలుగు పండిట్ల సీనియార్టీ జాబితా, 1998, 2002, 2014 ఎస్‌జీటీ సీనియర్ జాబితాలు, ప్రమోషన్ కొరకు అన్ని క్యాడర్ల సీనియార్టీ జాబితాలు ప్రమోషన్ కొరకు అన్ని క్యాడర్ల సినియార్టీ జాబితాలు ఇవ్వమని కోరారు. అదే విధంగా ఉపాధ్యాయుల వ్యక్తిగత సమస్యలు కూడా పరిష్కారం చేయమని కొరారు. నేటి వరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాకపోవడం వలన ఈ నెల 22వ తేదీ శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉదయం 10గటలకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేయాలని తీర్మానించడం జరిగింది. కావున జిల్లాలోని పెద్ద ఎత్తున ఏపీటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాల్సిందిగా కోరారు. అప్పటికే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాని పక్షంలో నిరవధిక ధర్నాలు చేస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి జి.ఎలీషా, జిల్లా ఉపాధ్యక్షులు లేవీ ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ సీహెచ్ పద్మావతి, కే.శ్రీనివాసరావు, ఆరే శ్రీనివాసరావు, రుద్రయ్య, కృష్ణ నాయకుడు దార్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చేతి పంపులు మరమ్మతులు

**దర్శి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



రానున్న వేసవి దృష్ట్యా నీటి ఎద్దడిని ఎదుర్కొనుటకు ఫిబ్రవరి 1 నుండి మార్చి 16వ తేదీ వరకు క్రాష్ ఫోగ్రాం లో భాగంగా అన్ని గ్రామాల్లో గల హ్యాండ్ పంపులను పంపు మెకానిక్ ద్వారా మమ్మత్తులు చేయించి వేసవిలో నీటి సమస్యలు రాకుండా చేయడం జరుగుతుంది. దర్శి మండలంలోని లంకోజనపల్లి గ్రామంలో క్రాష్ ఫోగ్రాంలో భాగంగా డి.బాలశంకరరావు సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్‌డిపార్టుమెంట్ ఒంగోలు వారు హ్యాండ్ పంపుల మరమ్మత్తుల కార్యక్రమం క్రాష్ ఫోగ్రాంను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రామ్‌మోహన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ సబ్ డివిజన్ దర్శి ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏఈ చైతన్య పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తని పరామర్శించిన నాయకులు లలిత్ సాగర్

**దర్శి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



నరసరావుపేటలో దర్శి మండలం తానంచింతల గ్రామానికి చెందిన టీడీపీ పార్టీ నాయకులు సత్యం సోదరుడు కొమిరిశెట్టి కోటేశ్వరరావు యాక్సిడెంట్‌కు గురై నరసరావుపేటలోని నెల్లూరు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ ఉండగా బుధవారం వారిని పరామర్శించిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. వారితో పాటు క్లష్టర్ అంకయ్య, మండల టీడీపీ నాయకులు సానె సుబ్బయ్య, కమ్మిరిశెట్టి సుబ్బు, సానే గణపతి తదితరులు ఉన్నారు.

## పర్యావరణ జీవనశైలి అలవర్చుకోవాలి

**- ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఎం.సంజీవరాజు**

**దర్శి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



విద్యార్థులు పాఠశాల దశ నుంచే పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా గ్రీన్ కోర్ ఆర్డినేటర్ అన్నారు. మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్‌దర్శి మాట్లాడుతూ పర్యావరణ విద్యపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాముల్ని చేస్తామన్నారు. పర్యావరణంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. మోటివేషన్ స్పీకర్ ఎం.సజీవరాజు, ఎంఈఓ రఘురామయ్య, అనురాధ, ఏపీఎన్‌జీసీ మండల సమన్వయకర్త నారు రవిశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఖాదర్ మస్తాన్ పాల్గొన్నారు.

## మరాఠా పోరాట యోధుడు చత్రపతి శివాజీ మహారాజ్

**పామూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త**



పామూరు పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డులోని రామాలయం గుడి ప్రాంగణంలో ఆరే మరాఠి సోదరుల ఆధ్వర్యంలో చత్రిపతి శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తొలుత శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కనిగిరి అసెంబ్లీ కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య, పామూరు మండల టీడీపీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకరరావు, జిల్లా టీడీపీ నాయకులు ఎస్‌డీ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, గుంటుపల్లి శ్రీను, పందిటి హరీష్, దయిండే రామాంజనేయులు, దయిండే శంకర్, జగదాబి మాల్యాద్రి, బజరంగ్ దళ్ నాయకులు జమకాల నరేష్, బీజేపీ నాయకులు వెంకటరమణయ్యలు పాల్గొని మాట్లాడుతూ మరాఠ పోరాట యోధుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని అన్నారు. భరతమాత మొఘలుల గుప్పిట్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న సమయంలో ఓ శక్తి ఈ గడ్డపై పురుడు పోసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

20-2Pg5.qxd:20-2Pg5.qxd 01/01/01 8:07 AM Page 1



# టారిఫ్‌లలో మినహాయింపులు ఇవ్వలేం..



## ప్రధాని మోడీకి స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

## సుంకాలలో ట్రంప్‌ను సమర్థించిన ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** టారిఫ్‌ల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని తాను మోడీతో వెల్లడించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. వీరిద్దరి మధ్య ఇటీవల జరిగిన మీటింగ్‌లో టారిఫ్‌ల గురించి ఆసక్తికర చర్చనడిచింది. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ నేడు వెల్లడించారు. బిలియనీర్ మిత్రుడు ఎలాన్ మస్క్‌తో కలిసి ఆయన నేడు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ మనం ఇక్కడ ఏం చేయబోతున్నాం, పరస్పరం పన్నులు విధించుకోబోతున్నామని నేను ఇటీవల మోడీకి చెప్పాను. మీరు ఎంత ఛార్జి చేస్తే నేనూ అంతే విధిస్తా. ఇంతలో ఆయన ఏదో చెప్పయారు. వద్దు, వద్దు నేను దానిని ఇష్టపడను. మీరు ఎంత ఛార్జి చేస్తే నేను అంతే విధిస్తాను అని స్పష్టంగా చెప్పాను. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వాటిపై అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ కూడా ఉంది. ముఖ్యంగా ఆటో మొబైల్ రంగంలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్లపై దాదాపు 100 శాతం సుంకాలను విధిస్తుంది. తాజాగా సమావేశంలో ట్రంప్ పక్కనే కూర్చొన్న మస్క్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అవును. ఆటో దిగుమతులపై 100 శాతం పన్ను విధిస్తుంది అని ట్రంప్ వ్యాఖ్యలను సమర్థించారు. దీనికి మరోసారి ట్రంప్ స్పందిస్తూ అవి చాలాచిన్నవి. వాటిని మించిన సుంకాలు విధిస్తుంది. ఇతరులు కూడా అంతే. నేను 25 శాతం పన్నులు విధిస్తే అబ్బో అంత భయంకరంగానా అని అంటారు. అందుకే నేను ఆ మాట ఇక అనను. వారెంత విధిస్తే మనమూ అంతే ఛార్జి చేస్తాం. నాతో ఎవరూ వాదించలేరు. అప్పుడే వారు సుంకాలను నిలిపివేస్తారు అని వివరించారు. పన్ను విషయంలో భారత్‌ను ట్రంప్ తప్పుపట్టడం ఇదే తొలిసారి కాదు. తన తొలి విడత పాలన సమయంలో కూడా ఇండియన్ టారిఫ్ కింగ్ అని వ్యాఖ్యానించేవారు. ఈ సందర్భంగా భారత్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెంచేందుకు అమెరికా డబ్బులు ఇవ్వడంపై కూడా ట్రంప్ స్పందించారు. న్యూఢిల్లీ వద్ద చాలా సొమ్ము ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక పన్నులు వసూలు చేస్తున్న దేశాల్లో అది ఒకటిగా అభివర్ణించారు.

తనకు భారత ప్రజలు, ఆ దేశ ప్రధాని పట్ల చాలా గౌరవం ఉందన్నారు. కానీ, వారి ఓటర్ల సంఖ్యను పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు ఇవ్వాలా? మరి మనదేశంలో ఓటర్ల పరిస్థితి ఎలా ఉందని ట్రంప్ ప్రశ్నించారు. ప్రధాని మోడీ ఇటీవల వాషింగ్టన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా భారత్, అమెరికా వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతోపాటు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు.



# సంగమం నీరు తాగేందుకు సరైనదే!

## అసెంబ్లీలో సిఎం యోగి ఆదిత్యనాథ్

**లక్నో, ఫిబ్రవరి 19:** త్రివేణి సంగమంలో నీటిలో ఫేకాల్ బ్యాక్టీరియా ఉందని, కోలిఫామ్ పూర్తి స్థాయిలో ఉన్నందున తాగేందుకు ఎట్టిపరిస్థితుల్లోను పనికిరాదన్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. మహాకుంభ్‌లోని వివిధ ప్రాంతాల్లోని గంగా యమున సరస్వతి త్రివేణి సంగమం నీటిపై దుష్ప్రచారం తగదని అన్నారు. ఎలాంటి కలుషిత జలాలు కావని తాగేందుకు పనికిరావనడం కేవలం దుష్ప్రచారం మాత్రమేనని అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో బ్యాక్టీరియా ప్రచారంపై సిఎం యోగి స్పందించారు. అంతకుముందే నేషనల్‌గ్రీన్ ట్రిబ్యునల్ పూర్తిస్థాయిలో కోలిఫామ్, ఫేకాల్ బ్యాక్టీరియా ఉన్నందున తాగేందుకు సంగమం నీళ్లుపనికిరావని ప్రకటించింది. శుద్ధిచేయని మురుగుజలాలను గంగా యమునా నదుల్లోకి వదిలిపెడుతున్నారన్న పిటిషన్లను విచారించిన ఎన్జీటీ తాగేందుకు పనికిరావని వెల్లడించడంపై సిఎం యోగి ఖండించారు. కేంద్ర కాలుష్య నివారణ మండలి నివేదికను ఎన్జీటీకి అందచేసింది. గతనెల 12,13 తేదీల్లో చేసిన సర్వేలో ఈ జలాలు కనీసం స్నానంచేసేందుకు సైతం పనికిరావని, తాగేందకు అసలే పనికి రావని కాలుష్య జలాలని వెల్లడించింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వీటిపై స్పందిస్తూ కొందరు వీటిపై దుష్ప్రచారంచేస్తున్నారని, 56.25 కోట్లమంది నేటికి పుణ్యస్నానాలుచేసారని ఇలాంటి నిరాధార ఆరోపణలు తగదని సనతాన ధర్మం, గంగా మాత, భారత్ లేదా మహాకుంభ్‌పై దుష్ప్రచారాలు మానుకోవాలని 56 కోట్లమంది భక్తుల నమ్మకాలను వంచించినట్లే అవుతుందని ఆయన అన్నారు.

తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలకు తమ ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం శక్తి వంచనలేకుండా సాయం చేస్తుందని అన్నారు. ఈసంఘటనను రాజకీయం చేయడం తగదని అన్నారు. మహాకుంభ్ ప్రారంభంనుంచే రాజకీయాలు ప్రారంభించారని అన్ని పార్టీలతో చర్చించామని, సలహాలు సూచనలు కూడా తీసుకున్నామని చెప్పారు. అయితే మీరు మాత్రం సభను ముందుకు నడిపించేందుకు ఇష్టంలేదన్నట్లుగా ఉన్నారని మండిపడ్డారు. కొందరు ఫాల్తూ కుంభ్ అని, మహాకుంభ్‌పై ఇంతపెద్ద మొత్తం ఎందుకు ఖర్చుచేసారని ఒకరు, మృత్యుకుంభ్ అని మరొకరు ఇలా అన్‌పార్లమెంటరీ పదజాలంతో పోస్టులు పెడుతున్నారని ఎంతమాత్రం తగదని యోగి అన్నారు.

# మృత్యుకుంభ్ విమర్శలపై అసెంబ్లీలో సిఎం యోగి వివరణ



**నేటికి 56.25 కోట్ల మంది పుణ్యస్నానాలు చేసారని వెల్లడి**

**మమతా బెనర్జీ మృత్యుకుంభ్ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు**

**బెనర్జీ వ్యాఖ్యలకు పరోక్ష మద్దతుపలికిన ఉత్తరాఖండ్ మఠాధిపతి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** మహాకుంభ్ కాదు అది మృత్యుకుంభ్ అంటూ పశ్చిమ బెంగాల్‌ముఖ్యమంత్రి మమతా బెనర్జీచేసిన విమర్శలకు ఉత్తరాఖండ్ మఠాధిపతినుంచి మద్దతు లభించింది. మహాకుంభ్‌ను ఆరాధిస్తాం, పవిత్ర గంగామాతను గౌరవిస్తా. ఎలాంటిప్రణాళిక లేదు. ఇప్పటివరకూ ఎన్ని మృతదేహాలు రికవరీచేసారు. ఇది మహాకుంభ్‌కాదు మృత్యుకుంభ్ అని మమతా బెనర్జీ విమర్శించారు. అయితే బిజెపి కేడర్, కేంద్రంలోని నాయకులు కూడా మమతా బెనర్జీ వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ మఠ్ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద్ సరస్వతి మహరాజ్ మాత్రం బెనర్జీ వ్యాఖ్యలను సమర్థిస్తూ వ్యాఖ్యలు చేసారు. మహాకుంభ్ నిర్వాహకులకు ప్రణాళిక లేదని, రద్దీనిర్వహణ, పర్యవేక్షణ ప్రక్రియ లేకపోవడంవల్లనే ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకుందని అన్నారు. మమతా వ్యాఖ్యలకు ప్రత్యక్షంగా మద్దతివ్వనప్పటికీ ఆమెచేసిన వ్యాఖ్యలకు సానుకూలంగానే ఉత్తరాఖండ్ మఠాధిపతి వ్యాఖ్యలుచేసారు. 300 కిలోమీటర్లవరకూ ట్రాఫిక్ జామ్ ఉందని ఇది యాజమాన్య లోపం కాక మరేమిటి? 25నుంచి 30 కిలోమీటర్లు తమ లగేజితో నడిచి వెళ్లాల్సి వచ్చింది. మురుగునీరుతో కలిసి పవిత్రస్నానంచేసే జలాలు కలుషితం అయ్యాయి. శాస్త్రవేత్తలు కూడా ఫేకాల్ బ్యాక్టీరియా ఉందని తాగేందుకు కూడా పనికిరాదని చెపుతున్నారని జగద్గురు గుర్తుచేసారు. మురునీరువచ్చే కాలువలను మళ్లించాల్సి ఉందని దీనితోప్రజలకు స్వచ్ఛమైన నీరు లభిస్తుందని, 12 ఏళ్లక్రితం మహాకుంభ్ జరిగిందని, మళ్లీ 12 ఏళ్లకు వస్తుందని ఈలోపు మీరు ఎందుకు సరైన చర్యలు తీసుకోలేకపోతున్నారని జగద్గురు కుంభ్ నిర్వాహకులను ప్రశ్నించారు. పరిమిత విస్తీర్ణంలో లెక్కకుమించిన జనాభాను ఎలా అనుమతిస్తారని, అందువల్లనే రద్దీపర్యవేక్షణ, నియంత్రణ, ఆతిథ్య ఏర్పాట్లు లేకపోవడంవల్లనే దుర్ఘటనలు జరిగాయని, ఈపరిస్థితుల్లో వివిధ పేర్లతో పలువురు విమర్శించినా వాటిని మనం వ్యతిరేకించలేమని స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి అన్నారు. బిజెపి జాతీయ ప్రతినిధి ప్రదీప్ భండారి మాట్లాడుతూ మమతా బెనర్జీ సనాతన ధర్మం, హిందువుల పట్ల ద్వేషం వ్యక్తపరిచారని అన్నారు. ఇండియాకూటమి నాయకులు కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదిపార్టీ చీఫ్ అఖిలేష్‌యాదవ్‌లకు హిందువులపైనా, సనాతన ధర్మంపైనా విద్వేషం పేరుకుపోయిందని అన్నారు. స్వామి జితేంద్రానంద్ సరస్వతి మాట్లాడుతూ బెంగాల్, జార్ఖండ్, బీహార్, ఒడిశా ఇతర ప్రాంతాలనుంచి వెల్లువలా హిందువులు రావడంతో మమతా బెనర్జీకి అసహనం పెరిగిపోయిందని అన్నారు. బెంగాల్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికలు మమతాకు మృత్యుకుంభ్ లాంటివేనని గుర్తుంచుకోవాలని స్వామి జితేంద్రానంద్ సరస్వతి అన్నారు.

**మమతా వ్యాఖ్యలపై సిఎంయోగి ధ్వజం**

ఇదిలా ఉంటే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై యోగి ఆదిత్యనాథ్ వివరణ ఇస్తూనే బెనర్జీ వ్యాఖ్యలను నిశితంగా విమర్శించారు. మృత్యుకుంభ్ అని పేర్కొనడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. నేటికి 56.25 కోట్లమంది మహాకుంభ్‌లో పవిత్రస్నానాలు ఆచరించారని, త్రివేణిసంగమంలో ఫేకాల్ బ్యాక్టీరియా ఉన్నదనడం కూడా వాస్తవం కాదని గతనెల 29 సంఘటన దురదృష్టకరమని బాధితులకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని వారికి పూర్తి భరోసా కల్పిస్తామని అన్నారు. విపక్షాలుచేస్తున్న వ్యాఖ్యలు ఇప్పటివరకూ పుణ్యస్నానం ఆచరించిన 56 కోట్లమంది భక్తులను అవమానించినట్లేనని అన్నారు. మహాకుంభ్ సంఘటన రాజకీయం చేయడం తగదని ఈశతాబ్దంలో మహాకుంభ్ వంటి పవిత్రవేడుకను నిర్వహించడం రాష్ట్రబిజెపి ప్రభుత్వానికి కలిసివచ్చిన అదృష్టం అన్నారు.



# గగన్‌యాన్-జి1 కోసం సి32 దశ మోటార్ ఇంజన్ సిద్ధం

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఇస్రో గగన్‌యాన్ ప్రయోగంకోసం ముందస్తు పరీక్షలు ఒక్కొక్కటి పూర్తి చేస్తోంది. ఈ ప్రాజెక్టులో కీలకమైన క్రయోజనిక్ దశను మరింత అభివృద్ధి చేసినట్లు ఇస్రో వర్గాలు పేర్కొన్నాయి. ఇంతకు ముందు సి25 దశగా ఉన్న ఈ కీలక దశను సి32గా మరింత అభివృద్ధి చేసింది. గగన్‌యాన్‌కు సంబంధించి ముందస్తు మానవ రహిత ప్రయోగాల్లో కూడా సి32 దశను ఉపయోగిస్తారు. గతంలో ఎల్‌విఎం3లో సి25ను ఉపయోగించే వారు. అంటే అందులో 25 టన్నుల క్రయోజనిక్ ఇంజన్‌ను వాడుతున్నారు. ఇప్పుడు ఏడు టన్నుల అధిక బరువుతో సి32 పేరుతో ఈ మూడవ దశను అభివృద్ధి చేశారు. హెచ్ ఎల్‌విఎం3లోని అన్ని దశలను మిగిలిన సాంకేతిక వ్యవస్థలను ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకుపోతున్న శాస్త్రవేత్తలు శ్రీహరికోట నుంచి త్వరలోనే మానవ రహిత ప్రయోగానికి సిద్ధమవుతున్నారు.

# యుపి జైళ్లలోని ఖైదీలకూ సంగమం పుణ్యస్నానాలు

## పవిత్రజలాలను జైళ్లకు తీసుకెళ్లి ఖైదీలకు ఛాన్స్ ఇస్తామన్న మంత్రి

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 19:** కుంభమేళాలో పవిత్రస్నానం చేయాలనుకుంటున్న ఖైదీలకోసం ఉత్తరప్రదేశ్‌ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లుచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 75 జైళ్లలోని 90వేలకు పైగా ఉన్న ఖైదీలకు గంగా జలాలతో స్నానం చేసే అవకాశం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలోని పవిత్రజలాలను సేకరించి ఈనెల 21న ఆయా జైళ్లకు తీసుకువెళతామని అధికారులుచెప్పారు. జైళ్లలో ఉన్న నీటితో గంగాజలాలను మిశ్రమం చేసి పవిత్రస్నానాలకు అవకాశం ఇస్తామన్నారు. ఆతర్వాత పూజలు, ఇతర క్రతువులు చేసేందుకు కూడా ఏర్పాట్లుచేస్తున్నట్లు జైళ్లశాఖమంత్రి దారాసింగ్ చౌహాన్ తెలిపారు. ఈకార్యక్రమంలో తానుకూడా పాల్గొంటానని తెలిపారు. కుంభ్ మేళాలో పాల్గొనాలనుకునేఖైదీలకోసం చరిత్రలో తొలిసారి ఇలాంటి కార్యక్రమాన్ని అమలుచేస్తున్నామన్నారు. కాగా ఇప్పటివరకూ మహాకుంభ్ నగర్‌లో 56.25 కోట్లమంది పుణ్యస్నానాలు చేసినట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలోనే ప్రకటించారు.

# ఢిల్లీ పోలీసులను అరెస్టు చేసిన యుపి పోలీస్

**లక్నో, ఫిబ్రవరి 19:** ఒక మోసం కేసులో దర్యాప్తు కోసం ఉత్తరప్రదేశ్‌కు చేరిన ఢిల్లీపోలీసులను యుపి పోలీసులు అరెస్టుచేసారు. ఈకేసులో ఇద్దరు యూపికానిస్టేబుళ్లతోపాటు మరో వ్యక్తిని ఢిల్లీపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం తెలిసిన యుపి పోలీసులు రంగంలోకి దిగారు. ఢిల్లీ పోలీస్‌బృందాన్ని అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1.5 కోట్లమోసం కేసులో దర్యాప్తుకోసం ఢిల్లీపోలీసులు యుపిలోని లలిత్‌పూర్‌కు చేరుకున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా లలిత్‌పూర్‌స్టేషన్‌లోకి వెళ్లారు. యుపికి చెందిన పోలీస్‌కానిస్టేబుల్స్ విశ్వజీత్, సచిన్ అవస్థిని వారి క్వార్టర్లనుంచి అదుపులోకితీసుకోగా మరో నిందితుడు బిక్కీరాజాను ఆతడి ఇంటినుంచి తెచ్చి అరెస్టుచేసారు. లలిత్‌పూర్ పోలీసులకు సమాచారం తెలిసి ఢిల్లీబృందాన్ని మార్గమధ్యంలో అడ్డుకున్నారు. ఢిల్లీపోలీస్ ఇన్‌స్పెక్టర్ దర్శన్‌సింగ్‌తో సహా ఆపోలీస్‌బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి లిఖితపూర్వక ఉత్తర్వులు అధికారిక అనుమతి లేకుండాపోలీస్ కానిస్టేబుల్స్‌ను అరెస్టుచేయడంపై రోజంతా విచారణజరిపారు. చివరకు క్షమాపణలు చెప్పిన తర్వాత ఢిల్లీపోలీస్ బృందాన్ని విడిచిపెట్టారు.

# అధ్యక్ష ఎన్నికల సర్వేలో జెలెన్‌స్కీకి 57% రేటింగ్!



**క్యీవ్, ఫిబ్రవరి 19:** ఉక్రెయిన్‌లో అధ్యక్ష ఎన్నికలంటూ నిర్వహిస్తే ప్రస్తుత అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్‌స్కీకి 57శాతం ఆమోదం లభించినట్లు పోల్ సర్వేలు వెల్లడించాయి. బుధవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ జెలెన్‌స్కీ రేటింగ్ కేవలం నాలుగుశాతం మాత్రమేనని చెప్పిన వెంటనే బయటకు వచ్చిన ఈ పోల్‌షర్వే నివేదికలో జెలెన్‌స్కీకి 57శాం ఆమోదం లభించింది. క్యీవ్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియాలజీ ఆధ్వర్యంలో వెయ్యిమందిని ఫోన్ సర్వేచేసారు. ఈ సర్వేలో స్పందించిన వారు జెలెన్‌స్కీకే మద్దతుపలికారు. 37శాతం మంది ప్రతికూలంగా స్పందించగా మిగిలివారు ఎటూ తేల్చలేకపోయారు. గత డిసెంబరులో నిర్వహించినపోల్ సర్వేకంటే ఐదుశాతం ఎక్కువ మద్దతును జెలెన్‌స్కీ సాధించగలిగారు.

మిలిటరీ సైనిక చర్యలు కొనసాగుతున్నా, రష్యా దండయాత్రను ధీరోధాత్తంగా ఎదుర్కొనడం పట్ల ఉక్రెయిన్ ప్రజలు జెలెన్‌స్కీని కొనియాడుతున్నారు. 2022 మార్చిలో అయితే ఉక్రెయిన్ అధ్యక్షుడికి రేటింగ్ 90శాతంవరకూ పెరిగింది. రష్యా దండయాత్ర చేస్తునప్పటికీ ఈ సోషియాలజీ సంస్థనిర్వహించిసర్వేలో జెలెన్‌స్కీ అత్యున్నతస్థాయి రేటింగ్ పొందారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ జెలెన్‌స్కీ ఆదేశానికి సరైన అద్యక్షుడు కాదనిచేసిన వ్యాఖ్యలు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఈసర్వే చెక్‌పెట్టినట్లయింది.

అయితే ఉక్రెయిన్ వాసులు మాత్రంయుద్ధంముగిసిన తర్వాత మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు. తన రేటింగ్ తగ్గిపోయిందని డొనాల్డ్ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలపైనా జెలెన్‌స్కీ స్పందించారు. డొనాల్డ్‌ట్రంప్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్‌ప్రభావం ఉందని అన్నారు. పుతిన్ ఇచ్చే తప్పుడు సమాచారంపైనే స్పందిస్తున్నారని జెలెన్‌స్కీ రాజధాని క్యీవ్‌లో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ట్రంప్ చెపుతున్న గణాంకాలు రష్యానుంచి వచ్చినవేనని అన్నారు. యుద్ధవిరమణకు జరుగుతున్న చర్చల్లో ఉక్రెయిన్ లేకుండా రష్యాతో చర్చలేమిటని యూరోపియన్ దేశాలు కూడా అమెరికాపై మండిపడుతున్నాయి.



# సిఇసి, ఇసి నియామకాలపై విచారణ పిటిషన్ వాయిదా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించినచట్టం చెల్లుబాటును సవాల్‌చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణను వాయిదావేసింది. సిఇసి, ఇసిల నియామక ప్యానెల్‌లో గతంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సైతం ఉండేవారు. అయితే కేంద్ర ప్రభుత్వం గత ఏడాది సిజెఐని తొలగించి ఆ స్థానంలో కేంద్ర న్యాయశాఖమంత్రికి చోటు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లుప్రవేశపెట్టి చట్టాన్ని అమలులోకి తెచ్చింది. కొత్తచట్టాన్ని సవాల్‌చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సిఇసి, ఇసిల నియామకాలకు వ్యతిరేకంగా దాఖలయిన పిటిషన్లపై ఈనెల 19న విచారిస్తామని కోర్టు ప్రకటించింది. పిటిషన్‌పై విచారణలో ఎడిఆర్ తరపున హాజరైన సీనియర్‌న్యాయవాది ప్రశాంత్ భూషణ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్ బెంచ్ ముందు వాదనలు వినిపించారు. ప్యానెల్‌నుంచి సిజెఐని తొలగించి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేయాలని అన్నారు. పిటిషనర్ జయతాకూర్ తరపున హాజరైన న్యాయవాది వరుణ్‌ఠాకూర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం కొత్తచట్టం పరిధిలో నియామకాలుచేపడుతోందని చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్‌కుమార్‌ను నియమించిన సంగతి తెలిసిందే. సిఇసి రాజీవ్ కుమార్ మంగళ వారం పదవీ విరమణచేయగా బుధవారం భారత 26వ సిఇసిగా జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలుస్వీకరించారు. సిఇసి నియామకంలో కేంద్రంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. చట్టంపై సుప్రీంకోర్టులో సవాల్‌చేసిన సమ యంలో అర్ధరాత్రి కొత్త సిఇసిని నియమిం చడంపై తీవ్ర నిరసన తెలిపింది.

# ఫిలిప్పీన్స్ విమానాన్ని భయపెట్టిన చైనా హెలికాప్టర్!



**బీజింగ్, ఫిబ్రవరి 19:** ఫిలిప్పీన్స్‌కు చెందిన ఓ విమానం సమీపంలోకి చైనా నేవీకి చెందిన హెలికాప్టర్ వచ్చింది. ఒక దశలో రెండూ ఢీకొంటాయని భయడాల్సిన స్థితి నెలకొంది. ఈ ఘటన స్కార్‌బోర్గ్ షోల్ సమీపంలో చోటు చేసుకుంది. వాస్తవానికి ఫిలిప్పీన్స్ ఎక్స్‌క్లూజివ్ జోన్‌లో ఉన్న ఈ ప్రదేశం తమదేనని చైనా 2012 నుంచి తమ ఆధీనంలో ఉంచుకొంది. తాజాగా ఫిలిప్పీన్స్ బ్యూరో ఆఫ్ ఫిషరీస్‌కు చెందిన సెస్నా కారవాన్ శ్రేణి సింగిల్ ఇంజిన్ విమానం అసోసియేటెడ్ ప్రెస్ రిపోర్టర్‌ను తీసుకుని ఈ మార్గంలో ప్రయాణమైంది. హఠాత్తుగా వీరిని చైనా నేవీకి చెందిన హెలికాప్టర్ వెంబడించడం మొదలుపెట్టింది. దాదాపు 30 నిమిషాలపాటు ఇది నడిచింది. ఈ క్రమంలో ఫిలిప్పీన్స్ విమానం పైలెట్, చైనా హెలికాప్టర్ పైలట్‌ను ఓ దశలో హెచ్చరించాడు. మీరు మరీ సమీపంలోకి వస్తున్నారు. అది అత్యంత ప్రమాదకరం. మా విమానంలోని ప్రయాణికులు, సిబ్బందికి ప్రాణాంతకం అని పేర్కొన్నారు. ఒక దశలో విమానానికి కేవలం 10 అడుగుల దూరంలోకి హెలికాప్టర్ వచ్చింది. ఈ ఘటనపై అమెరికా రాయబారి మారీ కై కార్ల్‌సన్ స్పందిస్తూ దుందుడుకు చర్యలకు దూరంగా ఉండాలని, విభేదాలకు అంతర్జాతీయ చట్టాలను అనుగుణంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి అని సూచించారు. తమ సముద్ర జలాలకు సమీపంలోకి వచ్చిన విదేశీ విమానలను వేధించడం చైనాకు కొత్తేమీ కాదు. గతవారం ఆస్ట్రేలియాకు చెందిన పి 8 విమానం దక్షిణ చైనా సముద్రంపై నుంచి ప్రయాణించింది. అప్పుడు చైనాకు చెందిన ఫైటర్ జెట్లు దానిని వెంబడించి సుమారు 100 అడుగులు దగ్గరకు వచ్చాయి. అనంతరం నిప్పులు విరజిమ్మాయి. ఒకవేళ పొరపాటున ప్లేయర్లు పి-8 ఇంజిన్‌లోకి వెళితే పెను ప్రమాదం జరిగేది. దాదాపు 13 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలోకి దక్షిణ చైనా సముద్రం మొత్తం తనదేనని బీజింగ్ ఎప్పటనుంచో వాదిస్తోంది. తన ప్రధాన భూభాగం నుంచి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలోని దీవులను చైనా వదలడంలేదు. దీంతో ఫిలిప్పీన్స్, మలేసియా, తైవాన్, బ్రూనై, వియత్నాంతో వివాదాలు జరుగుతున్నాయి.

# రెండు గంటల్లో 3వేల టిక్కెట్లు ఎలా ఇచ్చారు?



## పరిమితికిమించి ఎందుకు టిక్కెట్లు అమ్మారు?

## రైల్వే, కేంద్రంపై ప్రశ్నలు కురిపించిన హైకోర్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** అంతపెద్దరద్దీ ఉన్న స్టేషన్‌లో ప్రణాళికాబద్ధంగా టికెట్లను ఇవ్వకుండా ఎందుకు అదనంగా టికెట్లు మితిమీరి పరిమితికిమించి ఇచ్చారని ఢిల్లీ హైకోర్టు కేంద్రం, రైల్వేశాఖలపై ప్రశ్నల వర్షం కురిపించింది. చీఫ్‌జస్టిస్ డికె ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్‌రావు గేదెల నేతృత్వంలోని బెంచ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం పిటిషన్ విచారణచేస్తూ రైల్వేల్లో భద్రతా చర్యలు కొరవడటం వల్లనే ఇలాంటి విషాదకర సంఘటనలు జరుగుతున్నాయని, రైల్వే చట్టాన్ని ఎందుకు ప్రయోగించలేదని ప్రశ్నించారు. ఈ చట్టం ప్రకారం పరిమితికి మించి ఒక కోచ్‌లో ప్రయాణాలుచేస్తే ఆరునెలల జైలు విధించాలని ఉందని, ఇదే నిబంధన సెక్షన్ 147 ప్రకారం వెయ్యిరూపాయల జరిమానా కూడా విధించాలని అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైల్వేచట్టం అమలుచేసారనటానికి మీవద్ద ఆధారాలేమి ఉన్నాయి, మీరు చేపట్టిన చర్యలు ఏమిటి. కోచ్‌లలో ప్రయాణీకుల పరిమితులను ఎందుకు నిర్ణయించలేదు. అనుమతిలేకుండా కోచ్‌లలోకి వస్తున్న వారిపై జరిమానాలు ఎందుకు విధించడంలేదని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

రైల్వే చట్టంలోని వివిధ సెక్షన్లు ఉపయోగించాల్సి ఉండగా ఎందుకు అలా చేయలేదని, రైల్వే అధికారులు కూడా చట్టపరిధిలో కోచ్‌కు నిర్దిష్టమైన సంఖ్యలోప్రయాణీకులను అనుమతించాల్సి ఉందిపోయి చేష్టలుడిగిచూస్తుండిపోయారు దేనికని ప్రశ్నించింది. కోచ్‌లో ఉన్న సీట్లకు మించి బెర్త్‌ల సంఖ్యకు మించి టికెట్లు ఎందుకు విక్రయించారని ఆయన ప్రశ్నించారు. రైల్వేలతరపున వాదనలు వినిపించిన సొలిసిటర్‌జనరల్ తుషార్‌మెహతా కోర్టు మార్గదర్శకాలను అంగీకరించారు.

రైల్వే బోర్డు ఈ పరిస్థితులను కట్టడిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నదన్నారు. తదుపరి విచారణను మార్చి 26వతేదీ నిర్వహిస్తామని బెంచ్‌ప్రకటించింది. 11 మంది మహిళలు, ఐదుగురు చిన్నారులతో మొత్తం 18 మంది ఈ తొక్కిసలాటలో చనిపో యారు. రెండుగంటల్లోనే మూడువేల టికెట్లు విక్రయించడం వల్లనే తొక్కిసలాటకు ఎక్కువ ఆస్కారం ఏర్పడిందన్నారు.

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనాను

# దేశంలోకి రప్పించడమే ప్రధాన లక్ష్యం

## యూనస్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం!

**ఢాకా, ఫిబ్రవరి 19:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఓ ఉగ్రవాది అంటూ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ఘాటు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. హసీనా వ్యాఖ్యలపై ఢాకా ప్రభుత్వం స్పందించింది. భారత్‌లో ఆశ్రయం పొందున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధానిని తమ దేశంలోకి రప్పించడమే తమ అత్యంత ప్రధానమైన లక్ష్యమని యూనస్ ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం పేర్కొన్నారు. హసీనాను న్యాయస్థానం ముందు నిలబెట్టాల్సి ఉందని ఆమెను తమకు అప్పగించాలని భారత్‌ను కోరుతున్నామని అన్నారు. ఇందుకు ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తామన్నారు. బంగ్లాదేశ్‌లోని హసీనా అవామీలీగ్ పార్టీని రాజకీయాల్లో కొనసాగించాలా, వద్దా అనే విషయాన్ని దేశ ప్రజలు, రాజకీయ పార్టీలు నిర్ణయిస్తాయని అన్నారు. అయితే ఆమె అధికారంలో ఉన్న సమయంలో జరిగిన హత్యలు, అదృశ్యాలు, ఇతర నేరాలకు పాల్పడినవారు తప్పకుండా శిక్ష అనుభవించి తీరుతారని అన్నారు. హసీనా దేశ ప్రధానిగా ఉన్న సమయంలో అధికారం చేజారకూడదనే ఉద్దేశంతో నిరసనకారులను హతత్య చేసినట్లు దాడులు జరిపినట్లు ఐక్యరాజ్యసమితి పేర్కొన్న నివేదికలను ఆయన ఉదహరించారు.

20-2Pg6exHMNWJQE.qxd:20-2Pg6exHMNWJQE.qxd 01/01/01 10:06 AM Page 1



# ఇకపై పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్

## - ప్రక్షాళనకు మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు

**విజయవాడ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అందిస్తున్న సేవల్లో లోపాలను గుర్తిస్తూ మరింత మెరుగైన సేవలందించేందుకు




సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

డిఎస్‌ఓలు, డిఎం లు సిద్దంగా వుండాలని రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ కానూరులోని సివిల్‌సప్లై భవన్లో మంత్రి అధ్యక్షతన బుధవారం జరిగిన సివిల్ సప్లై అధికారుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ అధికారులంతా టీం స్పిరిట్‌తో ప్రజలకు జవాబుదారీ తనం పెంచేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏదైనా సమస్య వస్తే సివిల్ సప్లై కార్పొరేషన్, సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్ రెండూ కలిసి ఒకే నిర్ణయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం ధాన్యంకొనుగోలు ప్రారంభించిన తరువాత మిల్లర్లకు కాకుండా రైతులు ప్రభుత్వానికి ధాన్యం అమ్ముతున్నారన్నారు. ఇప్పటివరకు 5.21లక్షల మంది రైతుల నుండి 32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రు.7,522 కోట్లు విడుదల చేశామన్నారు. 24 గంటల్లోనే రు.7,508 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. ధాన్యం సేకరణలో 30వేల లారీల ద్వారా 37వేల మంది హమాలీలు ధాన్యం సేకరణలో పాల్గొన్నారన్నారు. 7337359375 నెంబర్‌కు వాట్సప్ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. దీపం 2 పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. రు.714. 75 కోట్లు నగదు లబ్దిదారుల ఖాతాల్లో జమచేశామన్నారు. డెలివరీ బాయ్‌లు అదనపు చార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఈ ఆఫీస్, ఈ ఫైల్‌కు పటిష్టవ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎండియు వాహనాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. వచ్చే అడకమిక్ ఇయర్ నుండి మిడ్‌డే మీల్స్, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ళకు పౌరసరఫరాల శాఖ నుండి సన్నబియ్యాన్ని ప్రత్యేక ప్యాకింగ్‌తో అందిస్తామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమీషనర్ సౌరబ్‌గౌర్, ఎండి మనజీర్ జిలానీ, అన్ని జిల్లాల సివిల్‌సప్లై, తూనికలు, కొలతలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



# రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

## - గుంటూరు మిర్చి యార్డు పర్యటన పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారు

## - మంత్రులు కొల్లు రవీంద్ర, డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి

**ఒంగోలు, ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి రైతులను కలిశారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, మిర్చి యార్డులోకి అనుమతి లేదని అధికారులు చెప్పినప్పటికి లెక్కచేయకుండా ప్రవర్తించారని రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. బుధవారం ఒంగోలు నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నవోదయం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డికి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో 14వేల మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డు పర్యటన పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని అన్నారు. రైతుల ఆత్మహత్యలు దేశంలో ఏపీని మూడో స్థానంలో జగన్ నిలిపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులో ఎన్నికల కోడ్ ఉందని చెప్పినా జగన్‌మోహన్‌రెడ్డి మిర్చి యార్డుకు వెళ్లారన్నారు. దుర్మార్గమైన కార్యకలాపాలతో రాష్ట్రాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో నిలిపివేసిన పోలవరం పనులు, సీఎం చంద్రబాబు పరుగు తీయిస్తున్నారని తెలిపారు. దళితుడు సత్యవర్ధన్‌పై దాడి ఘటనలో నిందితుడు అయిన వల్లభనేని వంశీని జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారని, పోలీసులను ,అధికారులను బయపెట్టే విధంగా జగన్ మాట్లాడారని అన్నారు. ఐదేళ్లు చేసిన దుర్మార్గ కార్యక్రమాల వల్ల బట్టలు ఊడదీసి 11 సీట్లు ఇచ్చారని, ఇలాగే ఉంటే 11 సీట్లు కూడా రావంటూ ఎద్దేవ చేశారు. జగన్‌కు రెడ్‌బుక్ ఫోబియో పట్టుకుందన్నారు. రెడ్‌బుక్ పేరు వింటే నాయకులకు తడిసిపోతుందని అన్నారు. రెడ్‌బుక్ తెరిస్తే ప్రభుత్వం వచ్చిన నెలలోనే వైసీపీ నాయకుల ఇళ్లల్లో ఉండేవాళ్లు కాదన్నారు. జీవితాన్ని ఇచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని వంశీ తగలబెట్టారని విమర్శించారు. సత్యవర్ధన్‌ను వంశీ, ఆయన అనుచరులు బెదిరించి తీసుకెళ్తున్నా వీడియోలు బయటకు వచ్చాయన్నారు. మద్యం విధానంలో దందాలు చేసి తాడేపల్లె ప్యాలెసుకు లక్ష కోట్లు నిధులు మళ్లీంచారని ఆరోపించారు. మద్యంలో జరిగిన అక్రమాలపై సిట్ వేస్తే తాడేపల్లి ప్యాలెస్ వద్ద ఫైల్స్ అన్ని తగలబెట్టారని అన్నారు. జగన్ అక్రమ మద్యం విధానం వల్ల లక్ష మంది లివర్, కిడ్నీ వ్యాధుల భారిన పడ్డారని వెల్లడించారు. జగన్ విపరీతంగా మద్యం ధరలు పెంచడంతో నాటు సారాకు అలవాటు పడ్డారని అన్నారు. నాటుసారా నివారణ కోసం నవోదయం కార్యక్రమం చేపట్టామన్నారు. ఐదేళ్ల దోపిడి కోసం జగన్ పాలసీ తీసుకువస్తే, ప్రజల ఆరోగ్యం కోసం ఎక్సైజ్ పాలసీ తీసుకువచ్చామని పేర్కొన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్టు విషయంలో జగన్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, మంత్రి డాక్టర్ బాల వీరాంజనేయస్వామి అన్నారు. జగన్‌కు ఆ 11 సీట్లు కూడా ఈసారి రావని ఎద్దేవ చేశారు. వైసీపీకి చెందిన దళిత నాయకులు జైల్లో ఉంటే, జగన్ వెళ్ళలేదని అన్నారు. గుంటూరులో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఆయన మిర్చి యార్డుకు వెళ్లి జగన్ న్యూసెన్స్ చేశారని మంత్రి మండిపడ్డారు. రైతులపై ప్రేమ ఉన్నట్లు జగన్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతు భరోసా నిధులు కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వంలో జగన్ మోసం చేశారని ఆయన ఆరోపించారు. రైతుల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకుంది ఎన్డీఏ ప్రభుత్వం అని ఆయన వెల్లడించారు. జగన్ ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు నమ్మరని అన్నారు. అన్ని విధాలుగా జగన్ తిరస్కరణకు గురయ్యారు కాబట్టి రాష్ట్ర ప్రజలు 11 సీట్లు ఇచ్చి ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన జగన్‌ను , ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని మంత్రి డిమాండ్ చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలను కూడా జగన్ అసెంబ్లీకి పంపడం లేదని అన్నారు. గతంలో అసాంఘికంగా చెలరేగిన వారిపై వచ్చిన ఫిర్యాదులు ఆధారంగా అరెస్టులు జరుగుతున్నాయని చెప్పారు. పోలీసులను బట్టలు ఊడదీసి కొడతామని జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సప్తసముద్రాలు జగన్ దాటాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలన్నారు. సప్త సముద్రాలు దాటే శక్తి జగన్‌కు లేదని, జగన్ పని అయిపోయిందని అన్నారు. జగన్‌కు మళ్లీ అధికారం అందని ద్రాక్ష అని ఎద్దేవ చేశారు.



# శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంతా సిద్ధం

## ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మార్పులు - ఎంఆర్ వితరణతో శాశ్వత లైటింగ్

### ప్రభాతవార్తతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖాముఖి

**(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి) పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. తిరుపతిజిల్లాలోని తిరుపతికి 35 కిలో మీటర్ల దూరంలో వెలసిన ఈ దివ్యక్షేత్రంలో శివరాత్రిని బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి. ఈ దివ్యక్షేత్రం రూపురేఖలు 1989లో ప్రస్తుత శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాం నుంచి ప్రారంభం అయ్యింది. అయన ఆదాయ వనరులను పెంచుటకు కృషి చేస్తే ఆయన తనయుడు సుధీర్‌రెడ్డి ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దటమే కాకకుండా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వేదికగా పలు సంస్కరణలు చేపట్టారు. ఆయన తో 'ప్రభాతవార్త' కలసినపుడు ఆయన ఆలోచనలను పంచుకున్నారు. ఆయన మాటల్లోనే పరిశీలిద్దాం....**

**ప్రభాతవార్త :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రికి సంబంధించి మీ అభిప్రాయాలేమిటి?

**ఎమ్మెల్యే :** ఆలయం పవిత్రమైనది.ఇక్కడ ఆధ్యాత్మిక చింతన తప్ప మరోకటి ఉండరాదు.అంతేకాక తాను గత కొంత కాలంగా ఇక్కడ చూస్తున్నాను. అడ్డదిడ్డంగా వీధులు,దుకాణాలు, దర్శనాలకు వచ్చేవారిని తప్పుదారి పట్టించటం,ఆలయం ఎటు చూసినా దళారులు, డబ్బులు వసూళ్ళు.ఇక్కడ రాజకీయంగా ఓ దందా నడిచేది. దానిని మార్చటానికి తన వంతు ప్రయత్నం ప్రారంభించాను

**ప్రభాతవార్త** :మార్పులు చేర్పులు ఎలా చేయాలనుకుంటున్నారు?

**ఎంఎల్‌ఏ** :తాను దేశంలోని పలు ప్రాంతాల్లో ఆలయాలను సందర్శించాను. అలాగే మన శ్రీకాళహస్తికి సమీపంలోని తిరుమలేశుని సన్నిధిని అధ్యయనం చేసారు. ఏ భక్తుడు అయినా ఆలయానికి అని వచ్చి అడుగుపెడితేనే వారు బయటి ప్రపంచాన్ని మరచిపోవాలి! మానసిక ప్రశాంత కలిగి ఉండాలి.అది ఆలయంలోని కంచుగడప లోపల అడుగుపెడితేనే ఎవరికైనా ఆ అనుభూతి కల్గుతుంది. అలాంటి వాతావరణమే ఆలయం పరిసరాల్లో కల్గించాలన్నది తన లక్ష్యం.

**ప్రభాతవార్త :** అందుకు మీరు తీసుకుంటున్న చర్యలేమిటి?

**ఎంఎల్‌ఏ** :మొదటి దశగా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నాను. అందులో ముఖ్యంగా పరిసరాలలో భక్తులు ఇబ్బంది పడకూడదు. 2017లో నాన్నగారు ఉన్నప్పుడు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గారు మాస్టర్ ప్లాన్‌ను ఆదేశించారు.కానీ గత ఐదేళ్ళలో ఆ పథకం కన్సల్టెన్సీలకే పరిమితం అయ్యింది. మొదటి ప్రయత్నంగా ఆలయ పరిసరాల్లో చక్కటి రోడ్లు, ఆహ్లాదానిచ్చే పచ్చని చెట్లు చక్కటి లైటింగ్ సదుపాయాలతో భక్తుల మనస్సులను ప్రశాంతత కల్పించుటకు చర్యలు తీసుకున్నాను.మాస్టర్‌ప్లాన్‌కు అడ్డంకులను కూడా తొలగించుకుంటున్నాము.

**ప్రభాతవార్త** : ఇప్పటివరకు ఏమైనా ముందడుగు వేసారా?

**ఎంఎల్‌ఏ** :మీరుచూస్తున్నారు కదా? పట్టణంలో అడుగుపెడుతూనే డివైడర్లను మార్పు చేసాము. చక్కటి చెట్లను ఏర్పాటు చేసాము. అలాగే మన ఆలయ చరిత్రను చాటిచెప్పేవిధంగా డివైడర్ల మధ్య స్థంభాలు వాటిపై నంది విగ్రహాలను ఏర్పాటు చేయిస్తున్నాను. హరితాభివృద్ధికి దేవస్థానం రూ.40లక్షలు మంజూరుచేస్తే తన చేతిది మరో రూ.17లక్షలు పడింది. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చేభక్తులు అడుగుపెట్టిన వెంటనే ఆధ్యాత్మిక చింతన వాతావరణ రావాలి.

**ప్రభాతవార్త** : ఆలయంలో లైటింగ్‌కు ప్రధాన్యత ఇస్తున్నట్లుంది.మీ ఆలోచనలేమిటి?

**ఎంఎల్‌ఏ** : ఔను! శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి ఏటా గతంలో పరిపాలించిన వారు లైటింగ్ ముసుగులో లక్షలకు లక్షలు దిగమింగుతున్నారు. కానీ తాను హైదరాబాదుకు చెందిన 'ఎంఆర్' నిర్వాహకులను ఒప్పించి రూ.కోటి విరాళంతో శాశ్వత లైటింగ్‌ను తిరుమల తరహాలో ఏర్పాటు చేస్తున్నాను. ఆలయంలోపల సుమారు 295 పిల్లర్లకు,అలాగే బయట 150 పిల్లర్లకు చుట్టుపక్కల ఉన్న నాలుగు గోపురాలకు ఇక శాశ్వత లైటింగ్ ఉంటుంది. ప్రధాన రోజుల్లో లైటింగ్‌తో ఆకట్టుకుంటుంది.

**ప్రభాతవార్త** :ఈ ఏడాది పూల ముస్తాబులకు సంబంధించి ఏం చర్యలు తీసుకున్నారు?

**ఎంఎల్‌ఏ** : గతంలోపరిపాలించిన పాలకులు పూల ముస్తాబుల ముసుగులో బెంగుళూరు వాసులచే సొమ్ములు దిగమింగినట్లు రికార్డులు చెబుతున్నాయని అయితే ఈ ఏడాది హైదరాబాదుకు చెందిన ఓ సంస్థతో చేయిస్తున్నామని వారురూ.వంద కోట్లు అయితే తప్ప పనులు చేయరని అలాంటి వారిచే 'కాస్ట్ టు కాస్ట్'కు చేయిస్తున్నాను.

**ప్రభాతవార్త** : ఈ సారి లేజర్ లైటింగ్ అన్నారు.అమలు చేస్తున్నారా?

ఎంఎల్ఏ : చేయగల్గిందే చెబుతాను. ఈ సారి ప్రత్యేక ఆకర్షణ లేజర్ లైటింగ్. ముంబాయికి చెందిన భరత్ లైటింగ్‌చే సుమారు రూ.1.5కోట్లతో చేసే ఏర్పాట్లును అతి తక్కువ ఖర్చు రూ.20లక్షల లోపల లేజర్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాను. ఎలా ఉంటుందో చూడండి.

**ప్రభాతవార్త** : సాంస్కతిక కార్యక్రమాలను ఎలా ఎంపిక చేసారు?

**ఎంఎల్‌ఏ** : శ్రీకాళహస్తీశ్వరుడు నటరాజు అంటారు. ప్రతి ఏడాది శివరాత్రికి ప్రత్యేంగా 13 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది స్థానిక కళాకారులతో పాటు రాష్ట్ర సాంస్కృతిక ఛైర్మెన్ తేజశ్రీని సంప్రదించి రాష్ట్ర స్థాయిలో పేరెన్నిక గన్న కళాకారులచే కార్యక్రమాలను నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నాము. పలువురు సినీ ప్రముఖులను కూడా ఆహ్వానించామన్నారు.

**ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన ఆలయంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు? భక్తులకు ఎలాంటి సదుపాయాలు కల్పిస్తున్నారు?

**ఎంఎల్‌ఏ** : మహాశివరాత్రిలో ఈ ఏడాది ఈ నెల 25 నుంచి 28 వరకు ఎంతో కీలకంగా భావిస్తున్నారు. 25న మధ్యాహ్నాం 4.30గంటలకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పట్టు వస్త్రాలను అందిస్తున్నారు. అలాగే మహావివరాత్రి పర్వదినాన ముగ్గురు మంత్రుల సూచనలను అమలు చేస్తాము.వారు భక్తులకు కల్పించుటకు ఆదేశించిన ఆదేశాలను అమలు చేస్తాము. సామాన్యభక్తులకు పెద్ద పీట వేస్తున్నాము. వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తి కరంగా శివయ్యను దర్శించుకోవాలి. స్వామి గర్భగుడి ముందు ఓ స్వామిలా పీఠాధిపతిలా కూర్చొని దేవుని కన్నా ముందు తన దర్శనం చేసుకునే దుస్థితిని భక్తులకు ఉండదు. చివరగా నేను చెప్పేది వచ్చిన ప్రతి భక్తుడు స్వామిని దర్శించుకొని అభివృద్ధికి ఇంకా తమకు బలం ఇవ్వాలని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.

# ముస్లిం బాలికలకు సంప్రదాయ విద్య అవసరం

## జమియతుల్ ఉలమ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలాన ఇలియాస్ సాహెబ్

**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** సమాజంలో ముస్లిం మహిళలకు బాలికల స్థాయి నుంచే సంప్రదాయ విద్యను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి రాష్ట్రాల జమియతుల ఉలమ ఉపాధ్యక్షులు మౌలాన ఇలియాస్ సాహెబ్ అన్నారు.బుధవారం ఆయన శ్రీకాళహస్తిలోని జామియా మస్‌జిద్‌లోని బాలుర మద్రసాలోనూ, బాలికల మద్రసాలో ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.జామియామస్‌జిద్‌లోని మద్రసాలో 13 సంవత్సరాల బాలుడు 'దివ్యఖుర్‌ఆన్‌ను'కంఠస్థం చేసి వినిపించారు. శ్రీకాళహస్తి చెందిన న్యాయవాది బషీర్ సాహెబ్ తన కుటుంబం నుంచి ఓ చిన్నారిని ఆధ్యాత్మిక చింతనకు నిర్ణయించారు. దివ్యఖుర్‌ఆన్‌లో ప్రతి ఇంటి నుంచి దివ్యఖుర్‌ను పఠించే హాఫీజ్‌లు కావాలన్న పిలుపుతో తన తనయుడు 'హాఫైజా'ను హాఫీజే ఖుర్ ఆన్ చేసారు. రెండేళ్ళ పాటు కఠోర సాధనతో ఆ బాలుడు దివ్యఖుర్ ఆన్‌ను కంఠస్థం చేసి ఉత్తీర్ణులయ్యారు. ఆ బాలునికి అల్లాహ్ దువాను అందిస్తూ సర్టిఫికేటును అందించారు. ఆ బాలునికి జామీయామస్‌జిద్ పేష్‌ఇమాం హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ మెలుకులను నేర్పించారు. ఈ కార్యక్రమాల్లో అతిధి మౌలాన



మదరసాలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇలియాస్ సాహెబ్

ఇలియాస్‌సాహెబ్‌తో పాటు శ్రీకాళహస్తికి చెందిన జిల్లా జమియతుల్ ఉలమ అధ్యక్షులు ముఫ్తీ నయి సాహెబ్,హాఫీజే ఖుర్ ఆన్ మహమ్మద్ ఆలీ,ముతవల్లి అక్రమ్‌సాహెబ్,ఖాజీ షరీఫ్ అనే మున్నా,అంజద్‌సాహెబ్, గోరా,మీర్జాం సాహెబ్, హాజీ గౌస్ సాహెబ్ పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో ముఫ్తి నయిం సాహెబ్ బాలికల మద్రసను నిర్వహిస్తున్నారు.ఈ మద్రస వార్షికోత్సవాన్ని ఏర్పాటు చేసారు. ఈ సభకు అతిధిగా విచ్చేసిన మౌలానా ఇలియాస్ సాహెబ్ మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలపై సాగుతున్న దాడులు,దౌర్జాన్యాలు,వేధింపులకు కారణం సంప్రదాయ విద్యపై అవగాహన లేకపోవటం. అంతేకాక మహిళలను ఇంటి పనికి వంట పనికి పరిమితం చేస్తున్నారు.

# విద్యా నైపుణ్యాలు పెంచేందుకు సింఘానియా ట్రస్టుతో ఒప్పందం

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ విద్యావిధానం లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రంలో విద్యా నైపుణ్యాల అభివృద్ధికి సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్టుతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు.ఆయన సమక్షంలో ఈ ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా తొలుత ట్రస్టు తరపున తిరుపతి జిల్లాలోని 14 పాఠశాలల్లో ఉపాధ్యాయులపనితీరు, శిక్షణ, ఆంగ్లభాష శిక్షణ, జాతీయ విద్యా విధానంతో సమాంతరంగా సాంకేతికత అనుసంధానంలాంటి అంశాల్లో విద్యా నైపుణ్యాన్ని తీసుకురానున్నారు. ఐదేళ్లపాటు అమలు చేసే ఈ కార్యక్రమం ద్వారా లక్ష మంది విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది. తిరుపతి తర్వాత అమరావతి, విశాఖపట్నం, కాకినాడకు సింఘానియా స్కూల్ ట్రస్ట సేవలను విస్తరిస్తారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఏపీ విద్యా రంగాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. సింఘానియా గ్రూపు ఛైర్మన్ గౌతమ్ హరి సింఘానియా మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నిపుణులుగా తయారు చేయడమే తమ లక్ష్యమన్నారు.

ఉపాధ్యాయులను ఆధునిక సాంకేతికతతో సన్నద్ధం చేయడంతోపాటు డిజిటల్ సాధనాలను ఉపయోగించేలా శిక్షణ ఇస్తామన్నారు.

అనంతరం సింఘానియా గ్రూపు ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ సాంకేతికతతో కూడిన అభ్యసరం, ఆంగ్ల ప్రావీణ్యం పై దృష్టిసారించినట్లు వెల్లడించారు.

# చిన్నశేష వాహనంపై బద్రీనారాయణుడు సరస్వతీదేవీ అలంకరణలో శ్రీనివాసుడు

**చంద్రగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** పండరీపురం పాండురంగస్వామి వారి అలంకరణలో శ్రీనివాసుడు చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వేకువజామున ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తదుపరి శ్రీవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరించారు. రెండవ రోజున ఉదయం స్వామివారు పండరీపురం పాండురంగస్వామి వారి అలంకరణలో చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు మాట్లాడుతూ చిన్నశేష వాహనం శ్రీవారి వ్యక్తరూపమైన పాంచభౌతిక ప్రకృతికి సంకేతం. చిన్నశేష వాహనం పంచభూతాత్మకమైన విశ్వానికి, అందులో నివశించే జీవునికి వరాలిస్తుంది. విశ్వం కనిపించే శ్రీవారి ప్రకృతి, విష్ణువు ఈ ప్రకృతికి ఆధారమై నడింపించే శక్తిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే విశ్వాన్ని రక్షించేందుకు తానొక్కడే చిన్నశేష వాహనంపై



విహరిస్తారు. పంచశిరస్సుల చిన్నశేషుని దర్శనం మహాశ్రేయఃప్రదం. శేషవాహనోత్సవాన్ని దర్శిస్తే దుష్టశక్తుల వలన కలిగే దుష్ప్రబావాలు భక్తులు కళ్యాణప్రదులై, సుఖశాంతులతో వర్ధిల్లగలరని శాస్త్రాలు వివరిస్తున్నాయన్నారు. ఈ వాహన సేవలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్లు వలిశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఎమ్మెస్సార్ డిగ్రీకళాశాల అధ్యాపకురాలికి అరుదైన గౌరవం!

# శ్రీదేవి రచించిన రెండు పాఠ్యపుస్తకాలను ఎంపికచేసిన రాష్ట్ర ప్రభుత్వం



**కావలి,(నెల్లూరు) ఫిబ్రవరి19 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రి కళాశాల ఆంగ్ల (ఇంగ్లీషు) అధ్యాపకురాలు గుంటుపల్లి శ్రీదేవిచౌదరికి అరుదైన గౌరవం లభించింది. ఆమె రచించిన రెండు ఆంగ్ల పాఠ్యపుస్తకాలను ఎ.పి ప్రభుత్వ పౌరగ్రంధాలయశాఖ మంగళవారం ఎంపికచేయడంతో ఆమె కావలి బావుటాను ఎగురవేసినట్లయింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎంతో పేరుప్రఖ్యాతులు గడించి అందరి మన్నలను పొందారుకూడా. అటు రాజకీయపరంగా, ఇటు ఉన్నత విద్యావంతురాలుగా, ఆంగ్ల అధ్యాపకురాలుగా, ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలకు ఆమె ఎంతోపేరు తెచ్చారు. శ్రీదేవిచౌదరి రచించిన కమ్యూనికేషన్ అండ్ సాఫ్ట్‌స్కిల్స్, బిజినెస్ కమ్యూనికేషన్ అనే రెండు పుస్తకాలను ఎ.పి ప్రభుత్వ పౌరగ్రంధాలయశాఖ 2022-23 విద్యాసంవత్సరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఎంపికచేసింది. ఆ సమావేశంలో ఆమోదం పొందిన పుస్తకాల వివరాలను ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి విడుదలచేసింది. శ్రీదేవిచౌదరి గతంలోనూ అకడమిక్ పుస్తకాలను, నైపుణ్యాభివృద్ధి సంబంధిత పుస్తకాలను, ప్రాంగణ ఎంపికల పుస్తకాలను వెలువరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడారు. తాను రచించిన పుస్తకాలను ప్రచురించిన స్పెక్ట్రమ్ పబ్లికేషన్స్ సంస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కావలి ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ టిడిపి కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, ప్రిన్సిపాల్ ఉమ, పలువురు అధ్యాపకులు, రచయితలు, పరిశోధకులు, వివిధ రంగాల్లోని ప్రముఖులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# సమగ్ర పర్యాటకాభివృద్ధే లక్ష్యంగా రూ.25 వేల కోట్ల పెట్టుబడులు

## - రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్




సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ 2025 (ఎస్ఏటీటీఈ) వేదికపై రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమగ్ర పర్యాటకాభివృద్ధే కీలకంశంగా ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు టార్గెట్‌గా నిర్దేశించుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం ద్వారకా ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ 2025 (ఎస్ఏటీటీఈ) వేదికగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తనదైన శైలిలో ప్రసంగించి ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకున్నారు. పర్యాటక రంగంలో ఉత్తేజం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించిందని తద్వారా పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ పర్యాటకరంగానికి కూడా వర్తింపజేస్తున్నామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఏపీలో పర్యాటకాభివృద్ధి కోసం నూతన టూరిజం పాలసీ 202429 తీసుకువచ్చామని వివరించారు. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ (పీపీపీ) విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయాలని భావిస్తున్నామని, పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు వచ్చే పెట్టుబడిదారులకు పెద్ద ఎత్తున మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా టూరిజం సర్క్యూట్‌లు, యాంకర్ హబ్‌లు, థీమాటిక్ అప్రోచ్ ఏర్పాటు, అంతర్జాతీయ మోలిక వసతుల కల్పన తదితర విభిన్న కార్యక్రమాలు, పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నామని తెలిపారు.

# వివాద రహితంగా టీచర్ల బదలీలు : మంత్రి లోకేష్

**విజయవాడ ఫిబ్రవరి 19 ప్రభాతవార్త ప్రతినిధి:** వివాదాలకు తావు లేకుండా ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియారిటీ జాబితాలను రూపొందించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఎక్స్‌వేదికగా ఆయన ఈ విషయ వివరించారు. జీఓ117 కు ప్రత్యామ్నాయ వ్యవస్థపై త్వరలోనే ప్రజాప్రతినిధుల సదస్సు నిర్వహించి వారి సలహాలు, సూచనలు స్వీకరించాలని అధికారులకు సూచించామన్నారు. జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల వేతనాల పెంపుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటాం. వచ్చే విద్యాసంవత్సరంనుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే లెక్చరర్ల బదిలీలు చేపట్టాలి. జగన్ ప్రభుత్వంలో అనాలోచితంగా తీసుకువచ్చిన జీవో 42 వల్ల 80 ఎయిడెడ్ కళాశాలలు మూతపడ్డాయి. దీని వల్ల విద్యార్థులకు నష్టం వాటిల్లింది. ఎయిడెడ్ కళాశాలల ఆస్తులను కాజేసేందుకు జగన్ కుట్ర పన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీఓ 42 ద్వారా జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా పాలసీని రూపొందించాలి.

# గంజాయి రవాణా ముఠా అరెస్ట్

## -17 లక్షలు విలువగల 174 కేజీల గంజాయి స్వాధీనం

**వెంకటాచలం,(నెల్లూరు) ఫిబ్రవరి 19,ప్రభాతవార్త:** గత కొంత కాలంగా జాతీయ రహదారిపై గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారని జిల్లా ఎస్పి కృష్ణ కాంత్‌కి సమాచారం రావడంతో ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ డిఎస్పి గట్టమనేని శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు.18వ తేదీ వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద సిఐ సుబ్బారావు,ఎస్సై ఆంజేనేయులు సిబ్బందితో కలిసి తనిఖి చేయుచుండగా నెల్లూరు నుండి గూడూరు వెలుతున్న ఆటో పోలీస్ వాహనాలు చూసి వెనక్కి తిప్పుకొని వెల్తుండగా పోలీసులకు అనుమానం రావడంతో ఆటోను వెంబడించి పట్టుకున్నారు.ఆటోలో 10 ప్యాకెట్లు గంజాయి 174 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులను విచారించగా గత కొంత కాలంగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు వెల్లడించారు.వివరాలు అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం టి-దాకబండ గ్రామానికి చెందిన మేదరి బాలకృష్ణ తండ్రి వెంకటయ్య ,మేదరి రాజి రాజమ్మ, మయప్ప,ముత్యాలు,దేవమ్మ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్టు విచారణలో వెల్లడయింది.దీంతో వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు.



గంజాయితో పట్టు పడిన ఆటో

# నందవరంలో పొగాకు బ్యారన్లు దగ్ధం

**మర్రిపాడు,ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** మండలంలోని నందవరం కూడలి వద్ద ప్రమాదవశాత్తు రెండు పొగాకు బ్యారన్లు బుధవారం దగ్ధమయ్యాయి. బాధితుల సమాచారం మేరకు మర్రిపాడు, ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పక్కనున్న బ్యారన్ల కు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. పరిమి వెంకటరమణమ్మకు చెందిన ఒక బ్యారన్, కాకర్ల వెంకటేశ్వర్లు, కాకర్ల హజరత్తయ్యకు చెందిన ఒక బ్యారను మొత్తం రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమైన ఘటనలో దాదాపు 9లక్షలు ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు.

# జైలుకు వెళ్లి నేరస్తులను పరామర్శించే జగన్‌కు అసెంబ్లీకి వెళ్లేందుకు ముఖం చెల్లదు

## పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయ వాడ.ఫిబ్రవరి 19,ప్రభాత వార్తప్రతినిధి:** నేరస్థులను, దౌర్జన్యం చేసిన వాళ్లను జైలుకు వెళ్లి పరామర్శించే జగన్‌కి, అసెంబ్లీకి వెళ్లేందుకు ముఖం చెల్లదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వెళ్లని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలకు ప్రజా సమస్యల మీద మాట్లాడే నైతికత లేదన్నారు. జగన్ ప్రెస్ మీట్ లు పెట్టి పురాణం అంతా చెప్పే తీరిక దొరుకుతుంది, కానీ అసెంబ్లీలో పాలకపక్షాన్ని నిలదీసే ధైర్యం లేదన్నారు. జగన్ పై ఎక్స్ వేదికగా షర్మిల ఆరోపణలు చేసారు.ప్రజలు 11 మందిని గెలిపిస్తే శాసనసభకు రాకుండా నీతుల చెబుతున్నారని విమర్శించారు. అలాంటి వారికి ప్రజల మధ్య తిరిగే అర్హత లేదని ఆక్షేపించారు. ఈ సారి కూడా అసెంబ్లీకి వెళ్లే దమ్ము లేకుంటే వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామాలు చేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలపై సీఎం చంద్రబాబు చిత్తశుద్ధి నిరూపించుకోవాలని వైఎస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు. బడ్జెట్ లో సూపర్ సిక్స్ పథకాలకు అగ్రభాగం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని పథకాలను ఈ ఏడాది నుంచే అమలు చేయాలని సూచించారు.

# విజయవాడ బిఐఎస్ నేతృత్వంలో సైన్స్ టీచర్లకు శిక్షణ



**విజయవాడ, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త :** బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాఠశాలల్లో ప్రామాణిక క్లబ్‌లకు మార్గనిర్దేశం చేస్తున్న 40 మంది ఉపాధ్యాయులకు పాడేరులోని ప్రముఖ హోటల్లో కాఫీ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటిడిఎ లెర్నింగ్‌సైన్స్ వయా స్టాండర్డ్స్ పై సైన్స్ టీచర్లకు రాష్ట్రంలో 6వ శిక్షణ కార్యక్రమం నిర్వహించగా బిఐఎస్ సైంటిస్ట్ సి/ డిప్యూటి డైరెక్టర్ డి వివేక్‌వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పద్ధతి సైన్స్‌లో విజయం సాధించడానికి , సమాజానికి విలువైన సహకారాన్ని అందించడానికి సహాయ పడుతుందన్నారు. బిఐఎస్ విధి విధానాలను సోదాహరణంగా వివరించారు. ముఖ్య అతిథి అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారి పి బ్రహ్మాజి మాట్లాడుతూ భవిష్యత్‌లో నిజజీవిత పరిస్థితులు ధైర్యంగా ఎదుర్కోడానికి శక్తినిచ్చేలా పాఠ్యప్రణాళికలు సాధనంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటి డైరెక్టర్ ఎల్ రజని మాట్లాడుతూ ఈ స్టాండర్డ్స్ క్లబ్‌ల ద్వారా నాణ్యత ప్రమాణాల విషయాన్ని విద్యార్థులకు వివరించిన బిఐఎస్ అధికారులను అభినందించారు. కార్యక్రమంలో బిఐఎస్ స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ డి కృష్ణవీర్ వర్మ, జె అనిల్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి రాంబాబు, బిఐఎస్ అధికారులు పాల్గొన్నారు.



# పద్మావతి యూనివర్సిటీలో 7.5 కోట్లతో అధునాతన ఇండోర్ హాల్ ప్రారంభం

## - రాష్ట్రంలో క్రీడలకు అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేస్తాం:మంత్రి నారా లోకేష్

**తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాత వార్త** రాష్ట్రంలో క్రీడా మోలిక సదుపాయాలకు పెద్దపీట వేసి, క్రీడలకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తామని రాష్ట్ర విద్య,ఐటి,ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు.తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం,మహిళా యూనివర్సిటీ,శాప్ సంయుక్తంగా రూ.7.5 కోట్లతో నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ హాల్ నీ మంత్రి లోకేష్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ అమరావతిలో అధునాతన అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం,స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.పద్మావతి యూనివర్సిటీ వేదికగా ఉత్తమ క్రీడాకారిణులను తయారుచేసేందుకు కొత్తగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం దోహదపడుతుందన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారిణులతో మంత్రి లోకేష్ కొద్దిసేపు షటిల్ ఆడి ఉత్సాహ పర్చారు. అధునాతన సౌకర్యాలతో ఏర్పాటుచేసిన ఏరోబిక్స్, టైక్వాండో,యోగా మెడిటేషన్ సెంటర్లను కూడా లోకేష్ ప్రారంభించారు. యూనివర్సిటీ విద్యార్థినులు,క్రీడాకారిణులు ఇక్కడ ఏర్పాటు చేసిన క్రీడా వసతులను వినియోగించుకుని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమ మాట్లాడుతూ క్రీడాకారిణులకు యూనివర్సిటీలో మంచి శిక్షణ వేదిక లభించడం తమ విద్యార్థినులకు గొప్ప అవకాశమన్నారు.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు.క్రీడాభివృద్ధికి మంత్రి లోకేష్ చూపుతున్న చొరవ, కృషి అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్,జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్,శాప్ ఎండి గిరీషా,శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు,పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్,తిరుపతి మున్సిపల్ కమిషనర్ మోర్య, యూనివర్సిటీ రిజిస్ట్రార్ రజని తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా మూడవ అతిపెద్ద చట్టవిరుద్ధమైన నేరం

## జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు

**విజయవాడ,ఫిబ్రవరి19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న సురక్షిత వలసల సంక్షోభం నేపథ్యంలో, తొమ్మిది దక్షిణాసియా దేశాలకు చెందిన సామాజిక సంస్థల ప్రతినిధులు ప్రభుత్వాలు, విధాన రూపకర్తలు, చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలు, ఐక్యరాజ్యసమితి ,పౌర సమాజ సంస్థలు కలిసి "సౌత్ ఏషియా కన్సల్టేషన్ ప్రమోటింగ్ సేఫ్ మైగ్రేషన్‌ను ప్రమోటింగ్ ట్రాఫికింగ్‌పై పోరాటం చేస్తున్నాయి.వీటి ప్రాముఖ్యతను వాసవ్య మహిళా మండలి కేంద్రంగా వివరిస్తూ కీలకచర్చ జరిగింది..'సౌత్ ఏషియా కన్సల్టేషన్ ప్రమోటింగ్ సేఫ్ మైగ్రేషన్‌ను ప్రమోటింగ్ ట్రాఫికింగ్‌పై పోరాటంపై బుధవారం రాత్రి వాసవ్యమహిళా మండలి సమాచార పత్రాన్ని విడుదల చేసింది.సమగ్రమైన, హక్కుల ఆధారిత వ్యూహం, ప్రాంతమంతటా సామరస్య పూర్వకమైన వలస విధానాలు మరియు అంతర్జాతీయ మరియు ప్రాంతీయ ప్రమాణాలకు అనుగుణంగా చట్టపరమైన మరియు విధాన సంస్కరణల ఆవశ్యకత, ట్రాఫికింగ్ వంటి సంఘటిత నేరాలకు, ద్వైపాక్షిక మరియు బహుళ పక్షీయ ఒప్పందాలను ప్రోత్సహించడంతోపాటు, ద్వైపాక్షిక మరియు బహుళ పక్షీయ ఒప్పందాలను ప్రోత్సహించడం కూడా అవసరమని నొక్కి చెప్పింది ఈ సంప్రదింపులలో వివిధ ప్రాంతాల నుండి వలస వచ్చినవారు మరియు అక్రమ రవాణా బాధితులు తమ అనుభవాలను మరియు పోరాటాలను పంచుకున్నారు మరియు వారి సూచనలను అందించారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, 39 దేశాల్లో బాలల రక్షణ,. పిల్లల హక్కుల కోసం పనిచేస్తున్న పౌర సమాజ సంస్థల నెట్‌వర్క్, సంప్రదింపుల యొక్క సాంకేతిక భాగస్వామిగా ఉంది, అయితే అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ సంప్రదింపులను నిర వ్హించింది. అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి బహుముఖ వ్యూహం యొక్క తక్షణ అవసరాన్ని నొక్కి చెప్పడం. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు మాట్లాడుతూ, "ట్రాఫికింగ్ అనేది ఒక వ్యవస్థీకృత మరియు ఆర్థిక నేరం, ఇది ముఖ్యంగా పిల్లలు మరియు బలహీనమైన యువత దోపిడీకి గురవుతుంది. దీనిని ఎదుర్కోవడానికి, మనకు బహుముఖ వ్యూహం అవసరం, అక్రమ రవాణా, విచారణ మరియు వ్యవస్థీకృత క్రైమ్ సిండికేట్‌లను విచ్ఛిన్నం చేయడం మరియు అంతర్జాతీయ స్థాయిలో వ్యవస్థీకృత క్రైమ్ సిండికేట్ల ద్వారా వ్యవస్థీకృత ట్రాఫిక్ మరియు గ్లోబల్ కోఆర్డినేషన్‌ను మెరుగుపరచడం." భారతదేశానికి బహిష్కరించబడిన వ్యక్తుల దుస్థితి మరియు ఇలాంటి పరిస్థితులలో ఇతరులలో భయం గురించి వ్యాఖ్యానిస్తూ, ఈ భయంకరమైన వాస్తవికత, అక్రమ రవాణా వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త ప్రతిస్పందన యొక్క తక్షణ అవసరాన్ని ఎత్తి చూపుతుందని, ఈ అక్రమ రవాణాదారుల సిండికేట్‌లను దేశ వ్యాప్తంగా అణిచివేసేందుకు భారతదేశం, అమెరిక, ఇతర ప్రభుత్వాలను కోరుత "న్నట్లు ఆయన అన్నారు. మేము బాధితులు అందించిన సమాచారాన్ని విశ్లేషించాలి, ఆర్థిక లావాదేవీలను గుర్తించాలి మరియు దోపిడీ చక్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఈ నేరాన్ని నడిపించే ఆర్థిక సిండికేట్‌లను విచ్ఛిన్నం చేయాలి. వలసలు అనేది మానవ స్వభావం యొక్క ప్రాథమిక అంశం అని కూడా అతను నొక్కిచెప్పాడు, పెరుగుదల, అవకాశం మరియు అభివృద్ధిని సాధించడం ద్వారా నడపబడుతుంది. అయితే, దోపిడీ, బలవంతం మరియు అవకతవకలు పట్టుకునే దశలోనే వలసలు అక్రమ రవాణాగా మారతాయి.కన్సల్టేషన్‌ను ఉద్దేశించి, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు మరియు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (విదిశిదిళి) మాజీ ఛైర్మన్ ప్రియాంక్ కనూంగో మాట్లాడుతూ, "అవగాహన అవసరమయ్యే ఒక క్లిష్టమైన అంశం.

# సమస్యలు పరిష్కరించి అండగా నిలుస్తా

## - ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్

**తిరుపతి,ఫిబ్రవరి 19ప్రభాతవార్తప్రతినిధి:** పలు రకాల సమస్యలతో బాధపడుతున్న వారందరికీ అండగా నిలుస్తానని,సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్రమంత్రి నారాలోకేశ్ తెలిపారు. తిరుపతిపర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం పార్టీకార్యాలయంలో మంత్రి 59వ రోజు ప్రజాదర్బార్‌లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధసమస్యలతో బాధపడుతున్న బాధితులు మంత్రి లోకేశ్‌ను కలిశారు. 2007నుండి 2011వరకు కాంట్రాక్టు పద్ధతిలో నియమితులై, సొంత మండలాల్లోని పిహెచ్‌సి సబ్‌సెంటర్లలో రెండవ ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న తమను క్రమబద్దీ కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. 16ఏళ్ళుగా రెగ్యులర్ వారితో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని, వేతనాలు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెగ్యులర్ ఎఎన్ఎం పోస్టులను 2007 నుండి పనిచేస్తున్న వారితోనే భర్తీచేయాలని కోరారు. ఎస్ఎల్ఎమ్ పిసి కార్పొరేషన్ తరపున తిరుమల లడ్డూ కౌంటర్‌లో విధులు నిర్వహించే తాను రోడ్డుప్రమాదం కారణంగా కొన్ని నెలలుగా విధులకు హాజరుకాలేక పోయానని, రీజాయినింగ్‌కు అనుమతించాలని తిరుపతికి చెందిన ఏ.నాగసాయికార్తీక్ విజ్ఞప్తి చేశాడు. హంద్రీనీవా ప్రాజెక్టు క్రింద భూమి కోల్పోయామని, ఇంటర్ చదివిన తన కుమారుడికి టిటిడిలో కాంట్రాక్టు ఉద్యోగం అవకాశం కల్పించి ఆదుకోవాలని చిత్తూరు జిల్లా ఐరాల మండలం చెంగనపల్లికి చెందిన పి.మునీశ్వరశెట్టి కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన విధంగా ఆదుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

# మహిళా శక్తి క్యాంటిన్లకు బ్యాంకు రుణాలు

## రూ.5నుంచి రూ.20లక్షల వరకు వడ్డీలేని రుణాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి,19 ప్రభాతవార్త:** మహిళలకు ఉపాధి కల్పించి వారిని ఆర్థిక స్వాలంబన దిశగా నడిపే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు కోసం మహిళా శక్తి క్యాంటిన్లు అనే ప్రత్యేక పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా మహిళలకు రాష్ట్ర సచివాలయంలోనే కాకుండా, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో, కలెక్టరేట్‌లలో,కార్పోరేషన్ కార్యాలయాలు, బస్టాండ్‌లలో మహిళా శక్తి క్యాంటిన్లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించింది. వీటికి పలు వర్గాల నుంచి కూడా మంచి స్పందన రావడంతో వారిని మరింత ప్రోత్సహించే కార్యక్రమంలో బాగంగా వాటికి వాటికి పలు బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు కూడా ఇప్పిస్తోంది. ప్రస్తుతం తెలంగాణలోని ప్రతి జిల్లాలో మహిళాశక్తి క్యాంటిన్లు ఉన్నాయి. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో కూడా వీటి ఏర్పాటు జరుగుతోంది. మరిన్ని ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు దరఖాస్తుల పరిశీలన కూడా జరుగుతోంది.మహిళా శక్తి క్యాంటీన్ల వల్ల 2 రకాల ప్రయోజనాలు ఉన్నాయి. మహిళా సంఘంలోని సభ్యులు కలిసి ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసుకొని.. రోజువారీ టిఫిన్లు, భోజనాలు అమ్ముకోవచ్చు. పచ్చళ్లు, కర్రీస్ అమ్ముకోవచ్చు. ఈ క్యాంటీన్ల ఏర్పాటుకి పూర్తి ట్రైనింగ్ కూడా ఇస్తారు. అం దువల్ల ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహిం చుకోవచ్చు. క్రమంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ.. వడ్డీ లేని రుణాలను చిన్న మెత్తాల్లో నెలవారీ చెల్లించవచ్చు. ఇటీవల ఓ మహిళ.. సిద్ధిపేటలోనే మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించింది. ఆమె రూ.5 లక్షలకు పైగా రుణం తీసుకుని ఆ మొత్తంతో యంత్రాలు, ఫర్నిచర్, టేబుళ్ల వంటివి కొన్నదితర్వాత టిఫిన్లు, భోజనం, స్నాక్స్, పచ్చళ్లు అమ్ముతోంది. ఇప్పుడు ఆమె ఖర్చులు పోగా రోజూ రూ.3వేల దాకా లాభం సంపాదిస్తోంది. అంటే.. నెలకు రూ.90వేల దాకా లాభం వస్తోంది. అందువల్ల ఆమె ఇప్పుడు తన రుణాన్ని క్రమంగా చెల్లించడం తేలికవుతోంది. ఈ క్యాంటీన్లలో ఆహారం అత్యంత నాణ్యమైనదిగా శుచిగా, శుభ్రంగా ఉండటంతో కస్టమర్లు మళ్లీ మళ్లీ వచ్చి తింటున్నారు.ఒక క్యాంటీన్ ఏర్పాటుకి 10 లక్షల నుంచి 20 లక్షల వరకుబ్యాంకుల ద్వారా రుణం ఇప్పిస్తున్నారు. ఈ రుణానికి పూచీకత్తు అవసరం లేదు. వడ్డీ కూడా ఉండదు. ఇటీవల సిద్ధిపేటలో 3 క్యాంటీన్లకు రూ.34 లక్షలుమంజూరయ్యాయి. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లపాటూ మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చెయించాలని నిర్ణయించుకుంది. అందువల్ల ఎవరైనా ఈ క్యాంటీన్ పెట్టాలి అనుకుంటే.. ముందుగా మెప్మా అధికారులను సంప్రదిస్తే వారు పూర్తి సమచారాన్ని అందిస్తారు. అంతే కాకుండా క్యాంటీన్‌కి రుణం ఇప్పించడం, కావాల్సిన యంత్రాలు, టేబుళ్లు, సామాగ్రి అన్ని ఎలా ఎక్కడ కొనాలో చెప్పడమే కాకుండా క్యాంటీన్ ఎక్కడ పెట్టాలో సూచిస్తారు. వారు చెప్పిన చోటు కాదనుకుంటే, ఎక్కడ పెట్టాలో మహిళలు తమ నిర్ణయం చెప్పవచ్చు. ప్రభుత్వం రద్దీ ప్రాంతాల్లోనే ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుండటంతో వ్యాపారం బాగానే సాగుతోందని నిర్వహకులు చెబుతున్నారు.

# మిర్చి రైతులకు లబ్దిచేకూర్చేందుకే ఎంఎస్‌పిని ఖరారు చేయలేదు

## - రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు



సచివాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి అచ్చన్నాయుడు

**సచివాలయం,ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** బహిరంగ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్ పెరుగుతున్ననేపథ్యంలో ప్రభుత్వం కనీసమద్దతు ధర ప్రకటించినట్లయితే నష్టపోతారనే ఉద్ధేశ్యంతో మిర్చికి ఇప్పటి వరకు కనీస మద్దతు ధర ప్రకటించలేదని రాష్ట్ర వ్యవసాయ,సహకార,మార్కెటింగ్ శాఖమంత్రి కింజరపు అచెన్నాయుడు స్పష్టంచేశారు.బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలోఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ శ్రీలంక,చైనా మలేషియా తదితర దేశాలకు మన మిర్చి ఎగుమతయ్యేదని అయితే ఆయా దేశాలు సొంతంగా మిర్చి పంట సాగుచేసుకోవడం వల్ల మిర్చి ఎగుమతులు చాలా తగ్గిపోవడ వల్ల మిర్చరేటు తగ్గిందన్నారు.కానీ చైనాలో మిర్చి పంట సరిగాలేకపోవడం వల్ల మళ్ళీ ఆదేశం మన మిర్చి పంటపై ఆధారపడే పరిస్థితులు ఏర్పాడ్డాయని ఫలితంగా మిర్చి ధరలు బారీగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు.మిర్చి రైతులకు సాధ్యమైనంత మేర సహకరించాలని ప్రస్తుతం ఉన్నకేంద్ర మద్దతు ధరను కూడా పెద్దఎత్తున పెంచాలని కోరేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు ఢీల్లీ వెళుతున్నారన్నారు.కేంద్రమంత్రుల బృందంతో చర్చించనున్నారని,చర్చల ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తంచేశారు.గత ప్రభుత్వం భూసార పరీక్షలను పూర్తిగా నిలిపివేయడమే కాకుండా,వ్యవసాయ యాంత్రీకరణ కింద ఒక్కపైసా కూడా కేటాయించలేదన్నారు. బిందుసేద్యాన్ని ప్రోత్సహించే విధంగా డ్రిప్/స్ప్రింకర్లను ఏ ఒక్కరికి పంపిణీ చేయలేదన్నారు.దాదాపు రూ.1600కోట్లుమేర ధాన్యం కొనుగోలు బకాయిలను పెట్టిపోతే తాము అధికారంలోనికి వచ్చిన వెంటనేరైతులకు ఆ సొమ్ము చెల్లించడం జరిగిందన్నారు.2020జనవరి మాసంలో బహిరంగ మార్కట్‌లో మిర్చి ధర దాదాపు రూ.12000లు వరకు ఉంటే అదే సమయంలో గత ప్రభుత్వం మిర్చికి రూ.7000లు కనీస మద్దతు ధరను ప్రకటించి రైతులకుపూర్తిస్థాయిలో నష్టాన్ని కలిగించిన ఘనత గత ప్రభుత్వానిదన్నారు.

ఆ సమయంలో కూడా మార్కెట్ ఇంటర్వేన్షన్ ఫండ్ క్రింద ఒక్కపైసా కూడా అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించలేదన్నారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, ఢీల్లీ రావు, మార్కెటింగ్ శాఖ సంచాలకులు మరియు రైతు బజార్ల సీఈవో విజయ సునీత సమావేశంలో పాల్గొన్నారు.

# కెసిఆర్ పగటికలలు కంటున్నారు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి,19 ప్రభాత వార్త:** కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ 14 నెలల నుంచి అజ్ఞాతంలో ఉన్న వ్యక్తికి అభివృద్ధి ఎలా కనబడుతుందని రెవెన్యూ,హౌసింగ్,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిందన్నట్లు ఫాంహౌస్ దాటని దొరవారు అధికారంపై పగటికలలు కంటున్నారని ఆయనఎద్దేవా చేశారు. అధికారం కోల్పోగానే తనకు పదేళ్లు అధికారం కట్టబెట్టిన ప్రజలను మరిచి అజ్ఞాతంలోకి వెళ్లిన కేసీఆర్‌కి 14 నెలలుగా కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న అభి వృద్ధి ఏ విధంగా కనబడుతుందని ప్రశ్నించారు. కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ ,ఎన్నికల పుడు మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారు. 14 నెలల నుంచి ఫాంహౌస్ దాటని ఆయన స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని బుధవారం ఒక ప్రకట నలో వ్యాఖ్యానించారు. మేడిగడ్డ కుంగినప్పుడు గాని, రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు వచ్చి నప్పుడు గాని ఆయనకు ప్రజలు గుర్తుకు రాలేదన్నారు. శాసనసభలో కీలకమైన తీర్మా నాలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, భూభారతి బిల్లు, తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మా నానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సైతం గైర్హాజరయ్యారు. తెలంగాణ ప్రజలు కష్టపడి కేసీఆర్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెడితే, ఆయన ఏనాడు ప్రజాతీర్పును గౌరవించలేదు. అసెంబ్లీ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేత అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలి. కానీ కేసీఆర్ తాను ప్రజలు జవాబుదారీగా లేనట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఆయన అసెంబ్లీకి వస్తే ఆయన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఏవిధంగా తిరోగమనదిశలోకి తీసుకెళ్లారు, పదేళ్లలో ఆయన చేసిన నిర్వాకాలను తప్పులను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ 14నెలల్లో తాము సాధించిన అభివృద్ధిని సవివరంగా కేసీఆర్ ముందుంచుతాం.కాంగ్రెస్ భవిష్యత్ గురించి కాకుండా ముందుగా కేసీఆర్ తన భవిష్యత్తు, తన పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుం టుందని సలహా ఇచ్చారు.విపరీతమైన అప్పులు చేసి నెత్తినమీద మిత్తిల భారం పెట్టిపోయారన్న పొంగులేటి పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ క్షమించదన్నారు.

# ఐదు సంవత్సరాల వరకు ఉప ఎన్నికలు రావు

## కేసీఆర్ వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ త్వరలో ఉప ఎన్నికలు వస్తాయి అంటున్నాయని, అయితే ఐదు సంవత్సరాల వరకు ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మీకు ఉనికి లేదన్నారు. అందుకే కెసిఆర్ ఇలాంటి మెసేజ్ లు ఇస్తున్నాడన్నారు. ఫాంహౌస్ నుండి బయటకు వచ్చి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని కార్యకర్తల ముందు అంటున్నాడని, కేవలం కార్యకర్తలను ఉత్తేజ పర్చడానికే కెసిఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది అంటున్నాడని, ఆయనకు చిత్తశుద్దే లేదన్నారు. చిత్త శుద్ధి ఉంటే అపొజిషన్ లీడర్‌గా అసెంబ్లీకి వచ్చి ప్రజల సమస్యలు చర్చించే వారన్నారు.

# 15 నెలల తరువాత ప్రజలు గుర్తుకు వచ్చారా?

## టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** 15 నెలల తరువాత మాజీ సిఎం కెసిఆర్‌కు ప్రజలు గుర్తుకు వచ్చారా? అంటూ టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రజల గొంతుకగా మాట్లాడుతారని ఆశించాం కానీ మాట్లాడలేదన్నారు.బిజెపి పార్టీ లోపాయికారి ఒప్పందంతోనే ఎంఎల్సీ ఎన్నికల్లో పోటీచేయలేదన్నారు. ప్రభుత్వం ప్రాతిష్మాత్మికగా కులగణన చేస్తే కనీసం కెసిఆర్ స్పందన లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించడంలో పూర్తి విఫలం అయ్యారన్నారు. కెసిఆర్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు అన్నారు. తెలంగాణ రాష్ట్రంను పది ఏళ్ల స్వంత ఆస్తిలాగా వ్యవహరించారని అన్నారు. కెసిఆర్ ప్రజల కోసం సలహాలు సూచనలు ప్రభుత్వం కోరిన స్పందన లేదన్నారు.

# కులగణనలో గతంలో పాల్గొనని వారు ఎన్‌రోల్ చేసుకోవాలి

## బిసి సంక్షేమం, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గతంలో కులగణనలో పాల్గొనని వారు తప్పకుండా తమ వివరాలను ఇవ్వాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి చెందిన మేధావులు, బలహీన వర్గాల నాయకులు, ప్రొఫెసర్లు వివిధ స్థాయిల్లో ఉన్న అందరి విజ్ఞప్తిమేరకు కులగణనలో నమోదు చేసుకోని వారికి మరో అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 16 నుంచి 28 వరకు.. ఇప్పటి వరకు కులసర్వేలో పాల్గొనకుండా సమాచారం ఇవ్వని వారు ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు. మూడు పద్ధతుల్లో కుల సర్వేలో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇవ్వడం జరిగిందని మంత్రి తెలిపారు. కులసర్వేకి ఆనాడు విజ్ఞప్తిచేసిన వారు, విమర్శలు చేసిన వారు,ఇప్పుడు మిస్ అయిన వారందరినీ మోటివేట్ చేపించి సర్వేలో భాగస్వాములు అయ్యేవిధంగా చూడాలని తెలంగాణ మేధావులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. కేటీఆర్, హరీష్‌రావు సర్వేలో పాల్గొని పార్టీపక్షాన, బలహీనవర్గాలపక్షాన సానుకూలంగా ఉన్నామని చెప్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. అవేమీ చేయకుండా విమర్శలకే పరిమితమయితే తెలంగాణ బలహీనవర్గాలు చూస్తూ ఊరుకోరని మంత్రి గుర్తు చేశారు.

# కేసీఆర్‌కు ప్రజాస్వామ్యమంటే విలువ లేదు

## అధికారం దరిదాపుల్లో కనబడకపోవడంతోనే ఈ అసహనం: చిట్ చాట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం అంటే విలువ లేదని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ మాట్లాడిన మాటలకు మంత్రి పొన్నం కౌంటర్ ఇచ్చారు. బుధవారం తనను కలిసిన మీడియా వారితో కేసీఆర్ వ్యాఖ్యలపై చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ పాస్ పోర్ట్ ఆఫీస్‌కు వచ్చాడు కాబట్టి ఎలాగూ హైదరాబాద్ వచ్చానని పార్టీ ఆఫీసుకెళ్లి మీటింగ్ పెట్టాడని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేశామన్నారు. పంట బోనస్, రైతు భరోసా పెంపు, 55 వేల ఉద్యోగాలు, డీఎస్సీ పోస్టింగ్‌లు ఇలా చెప్పుకుంటే పోతే అనేకం చేశామన్నారు. కేసీఆర్ వాఖ్యల్లో అసహనం తప్ప మరోకటి లేదని పొన్నం మండిపడ్డారు. అధికారం దరిదాపుల్లో కనబడకపోవడంతోనే కేసీఆర్‌కు ఈ అసహనమని అన్నారు. తెలంగాణ ప్రజలు పదేళ్లు అధికారం ఇస్తారని అది పక్కా అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు వాస్తవం మాట్లాడుతుంటే ..జీర్ణించుకోలేక అసహనంతో కేసీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్థిక విధ్వంసం తర్వాత కూడా పాత పథకాలను ఒక్కటి కూడా రద్దు చేయకుండా, తాము ఇచ్చిన హామీలను సైతం అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా సహకరిస్తే రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు కేసీఆర్ కలసి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తమిళనాడు తరహాలో అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వంతో కలసి రావాలన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళ్తామని.. అందుకు ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ కూడా కలసి రావాల్సిందేనని మంత్రి హితవు పలికారు.

# దివ్యాంగ విద్యార్థులకు ఆధునిక బోధనా సామాగ్రి!

## డెహ్రాడూన్‌లోని పాఠశాలలను పరిశీలించిన విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా దృష్టి లోపం గల విద్యార్థుల కోసం విద్యా విధానాలు, మౌలిక సదుపాయాలతోపాటు అభ్యాస పద్ధతులను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోనున్నారు. ఇందు కోసం ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి విధానాలను అమలు చేస్తున్నారో తెలుసుకోవడం కోసం విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యశాఖ అధికారులతో కలిసి డెహ్రాడూన్‌లోని కొన్ని దివ్యాంగ పాఠశాలలను పరిశీలించారు. అక్కడ అధికారులు పరిశీలించిన విధానాలు, ఆధునిక యంత్రాలున ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు గణనీయంగా దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్య జేడీ వెంకట నర్సమ్మ, దారుల్షిఫా అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ మందడి వెంకట్ రెడ్డి, మలక్‌పేటలోని బి బ్లాక్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌కి చెందిన సీనియర్ టీచర్ సువర్ణ ఈ నెల 18, 19 తేదీల్లో డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిజేబిలిటీస్ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు. తెలంగాణ ప్రతినిధి బృందాన్నిఎన్ఐఈపీవీడీ ఇన్‌చార్జ్ డైరెక్టర్ అమిత్ శర్మ, డాక్టర్ కె శ్రీనివాస్ రెడ్డి,

డాక్టర్ రామకృష్ణ, అధ్యాపక సభ్యులు, విద్యార్థులు స్వాగతించారు. తెలంగాణ రాష్ట్రంలో దృష్టి లోపం ఉన్న విద్యా ర్థుల కోసం ప్రత్యేక పాఠశాలలు మరియు ప్రత్యేక విద్యా సంస్థలను బలోపేతం చేయడంపై విలు వైన చర్చలకు దోహద పడినట్టు అధికారులు తెలిపారు.

# పాస్‌పోర్టు కార్యాలయానికి తెలంగాణ మాజీ సీఎం కెసిఆర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి తెలంగాణ రాష్ట్ర మాజీముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చారు.తన పాస్‌పోర్టును రెన్యువల్ చేసుకోడానికి ఆయన వచ్చారు. కార్యాలయ సిబ్బంది వెంట ఉండి ఆయన పాస్‌పోర్టును రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేశారు.

20-2pg10.qxd:20-2pg10.qxd 01/01/01 8:14 AM Page 1





# హాకీ ప్రో లీగ్‌లో.. భారత్‌కు నిరాశ

### పురుషుల, మహిళల జట్లు ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత పురుషుల, మహిళల జట్లకు నిరాశ ఎదురైంది. భువనేశ్వర్‌లో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 1-4 గోల్స్ తేడాతో ప్రపంచ మాజీ చాంపియన్ జర్మనీ జట్టు చేతిలో భారత మహిళల జట్టు 3-4 గోల్స్ తేడాతో స్పెయిన్ జట్టు చేతిలో ఓడిపోయాయి. జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరఫున గుర్జంత్ సింగ్ (13వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. జర్మనీ తరఫున ఫ్లోరియన్ స్పెర్లింగ్ (7వ నిమిషంలో), థీస్ ప్రింజ్ (14వ నిమిషంలో), మైకేల్ స్రుటతోఫ్ (48వ నిమిషంలో), రాఫెల్ హార్టకోప్ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు తరఫున బల్జీత్ కౌర్ (19వ నిమిషంలో), సాక్షి రాణా (38వ నిమిషంలో), రుతుజా (45వ నిమిషంలో) ఒక్కో గోల్ నమోదు చేశారు. స్పెయిన్ జట్టుకు సోఫియా (21వ నిమిషంలో), లూసియా (52వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా, ఎస్తెల్ (25వ, 49వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించింది.

**న్యూఢిల్లీ:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నంబర్ వన్ స్థానానికి ఎగబాకాడు. గత ర్యాంకింగ్స్‌లో 2వ స్థానంలో ఉండిన గిల్ ఓ స్థానం మెరుగుపర్చుకుని టాప్ ర్యాంక్‌కు చేరాడు. దీంతో ఇప్పటి వరకూ ఆస్థానంలో ఉన్న పాక్ స్టార్ ఆటగాడు బాబర్ ఆజమ్‌ను వెనక్కు నెట్టాడు. ప్రస్తు ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో బాబర్ 773 రేటింగ్ పాయింట్లతో 2వ స్థానంలో ఉన్నాడు. సచిన్, విరాట్, ధోని తర్వాత ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరిన 4వ భారత బ్యాటర్‌గా గిల్ రికార్డుల్లోకెక్కాడు. ప్రస్తుతం గిల్ ఖాతాలో 796 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఐసీసీ బుధవారం విడుదల చేసి ఈ వారం ర్యాంకింగ్స్‌లో గిల్‌తో కలుపుకుని భారత్ నుంచి నలుగురు ఆటగాళ్లు టాప్10లో ఉన్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 3వ స్థానంలో, విరాట్ కోహ్లి 6లో, శ్రేయస్ అయ్యర్ 9వ స్థానంలో నిలిచారు. గతంతో పోలిస్తే శ్రేయస్ ఓ ర్యాంక్ మెరుగుపర్చుకుని 9వ స్థానానికి చేరాడు. ఇక సౌతాఫ్రికా ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ 4లో, న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్ 5, ఐర్లాండ్ ఆటగాడు హ్యారీటెక్టార్ 7, లంక కెప్టెన్ అసలంక 8, షాయ్ హోప్ 10వ స్థానంలో ఉన్నారు. బౌలర్ల విషయానికొస్తే ఆఫ్ఘనిస్తాన్ స్టార్ బౌలర్ రషీద్ ఖాన్‌ను కిందకు దించి లంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. భారత బౌలర్ కుల్దీప్ యాదవ్ ఓ స్థానం మెరుగుపర్చుకుని నాలుగో స్థానానికి చేరాడు. భారత్ నుంచి టాప్10లో కుల్దీప్‌తో పాటు, సిరాజ్ (10వ ర్యాంక్) మాత్రమే ఉన్నాడు. ఆల్‌రౌండర్లలో ఆఫ్ఘనిస్తాన్ వెటరన్ మొహమ్మద్ నబీ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా 2వ స్థానంలో నిలిచాడు. భారత్ నుంచి రవీంద్ర జడేజా ఒక్కడే టాప్10లో ఉన్నాడు. జడ్డూ 217 రేటింగ్ పాయింట్లతో పదోస్థానంలో నిలిచాడు. జట్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే టీమిండియా టాప్ ర్యాంక్లో కొనసాగుతుంది. 2వ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాకు భారత్ అందనంత ఎత్తులో ఉంది. ఇరు జట్లకు మధ్య దాదాపు 800 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది.

### టాప్ 10లో నలుగురు టీమిండియా ప్లేయర్లు



# వన్డే ర్యాంకింగ్స్‌లో గిల్ నం.1



# అత్యుత్తమ ఎకానమీ బౌలర్లు

### ఛాంపియన్స్ ట్రోఫీలో.. భారత్ నుండి ఒకే ఒక్కడు

**న్యూఢిల్లీ:** మినీ వరల్డ్ కప్‌గా భావించిప ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభమైంది. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్లో అదరగొట్టిన బౌలర్లు ఉన్నారు. ప్రధానంగా అత్యుత్తమ ఎకానమీ ఉన్న బౌలర్ల జాబితాలో టీమిండియా నుండి ఒకే ఒక్కడు ఉన్నాడు. ఇప్పటిదాకా జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో అత్యల్ప ఎకానమీ ఉన్న 5గురు బౌలర్ల గూర్చి తెలుసుకుంటే ఈ లిస్టులో టీమిండియా తోపు ప్లేయర్ కూడా ఉన్నాడు. మరి అలాంటి పొదుపు బౌలింగ్ వేసిన టాప్ 5 బౌలర్లలో అరవింద డి సిల్వా ఒకడు. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌ల చరిత్రలో అత్యుత్తమ ఎకానమీ రేటుతో బౌలింగ్ చేసిన బౌలర్ శ్రీలంక గ్రేట్ అరవింద్ గుర్తింపు తెచ్చుకున్నాడు. డిసిల్వా 7 మ్యాచ్‌లో 10 ఓవర్లు బౌలింగ్ చేసి, రెండు మెయిడెన్ ఓవర్లు వేశాడు. అతను 60 బంతుల్లో 16 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీసుకున్నాడు. ఎకానమీ రేటు 1.60గా ఉంది, ఇదే టోర్నీలో అత్యల్పం. పొదుపుగా బౌలింగ్ వేసిన బౌలర్ల లిస్టులో వెస్టిండీస్ ఆటగాడు వేవెల్ హిండ్స్ రెండవ స్థానంలో ఉన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ దశలో, అతడు 11 మ్యాచ్‌ల్లో 20 ఓవర్లు బౌలింగ్ చేశాడు. వేవెల్ మూడు మెయిడెన్ ఓవర్లు వేసి 51 పరుగులకు ఐదు వికెట్లు పడగొట్టాడు. హిండ్స్ ఎకానమీ రేటు 2.55. అలాగే ఆస్ట్రేలియా లెజెండ్, దివంగత బౌలర్ షేన్ వార్న్ తన స్పిన్‌తో ప్రపంచంలోని గొప్ప బ్యాట్స్‌మెన్‌లను కూడా పడగొట్టాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలర్‌గా పరిగణించబడే వార్న్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌లలో 3 మ్యాచ్‌లకు గానూ 20.2 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అతని ఎకానమీ రేటు 2.95. ఇందులో వార్న్ నాలుగు మెయిడెన్ ఓవర్లు బౌలింగ్ చేసి 122 బంతుల్లో 60 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక దక్షిణాఫ్రికా తరఫున 44 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన జస్టిన్ ఒంటాంగ్ ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు. జస్టిన్ ఒకే ఒక్క నాకౌట్ మ్యాచ్ ఆడాడు. 10 ఓవర్లలో, జస్టిన్ ఒక మెయిడెన్ ఓవర్ వేసి మొత్తం 30 పరుగులు ఇచ్చాడు. ఎకానమీ రేటు 3గా ఉంది. కాగా ఈ జాబితాలో ఉన్న ఏకైక భారతీయ ఆటగాడు రమేష్ పొవార్. జస్టిన్ లాగే, అతడు కూడా ఒకే ఒక్క నాకౌట్ మ్యాచ్ ఆడాడు. 8 ఓవర్లు బౌలింగ్ చేసిన రమేష్ 24 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. పొవార్ ఎకానమీ రేటు కూడా 3గా ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ చరిత్రలో ఐదవ అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు.

# ముంబయి ఇండియన్స్ బోణీ

### గుజరాత్ జెయింట్స్‌పై గెలుపు



**ఢిల్లీ:** మహిళ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)-2025లో మాజీ చాంపి యన్ ముంబై ఇండియన్స్ బోణీకొట్టింది. వడోదరలో జరిగిన లీగ్ మ్యా చ్‌లో గుజరాత్ జెయింట్స్‌పై 5 వికెట్ల తో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. హర్లీన్ డియోల్ (31 బంతుల్లో 32, 4 ఫోర్లు) బంతికో పరుగు చొప్పున సాధించి, టాప్ స్కోరర్ గా నిలిచింది. హీలీ మథ్యూస్ మూడు వికెట్లతో రాణించింది. ఈ లక్ష్య ఛేదనలో 16.1 ఓవర్లలోనే ఐదు వికెట్లకు 122 పరుగులు చేసి ముంబై పూర్తి చేసింది. వన్ డౌన్ బ్యాటర్ నాట్ స్కివర్ బ్రంట్ ఫిఫ్టీ (39 బంతుల్లో 57, 11 ఫోర్లు)తో సత్తా చాటింది. బౌలర్లలో ప్రియా మిశ్రా, కశ్వీ గౌతమ్ లకు రెండేసి వికెట్లు దక్కాయి. హీలీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. టోర్నీలో గుజరాత్ కిది రెండో పరాజయం కావడం గమనార్హం. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌కు శుభారంభం దక్కలేదు. 14 పరుగులకే ఓపెనర్లు బేత్ మూనీ, లారా వోల్వర్ట్ వికెట్లను కోల్పోయింది. ఈ దశలో హర్లీన్ ఓపికగా ఆడింది. ఆమెతోపాటు కశ్వీ గౌతమ్ (20) కాస్త వేగంగా ఆడటంతో గుజరాత్ ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. చివర్లో తనూజ కన్వర్, సయాలి సాత్ఘరే తలో 13 పరుగులు జోడించి జట్టుక గౌరవ ప్రదమైన స్కోరును అందించారు. బౌలర్లలో బ్రంట్ , అమేలియా కెర్ కు రెండేసి వికెట్లు, షబ్నిం ఇస్మాయిల్, అమన్జోత్ కౌర్ కు ఒక వికెట్ లభించింది. గుజరాత్ బౌలర్లను ఆటాడుకున్న బ్రంట్ తన ఇన్నింగ్స్ లో ఏకంగా 11 ఫోర్లు బాదడం విశేషం. దీంతో 33 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. ఒక్క ఓవర్ తేడాతో ఆఖర్లో వీరిద్దరూ వెనుదిరిగినా, సజనా, కమలిని జట్టును విజయతీరాలకు చేర్చారు.

# వన్డేలో సరికొత్త చరిత్ర: స్పిన్నర్లతోనే ఓవర్లు

### భారత్ రికార్డు బద్దలు కొట్టిన అమెరికా

**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్లో సరికొత్త రికార్డు నమోదైంది. ఓ మ్యాచ్ మొత్తంలో (రెండు ఇన్నింగ్స్‌ల్లో) ఒక్క ఫాస్ట్ బౌలర్ కూడా బౌలింగ్ చేయలేదు. అన్ని ఓవర్లు స్పిన్నర్లే బౌలింగ్ చేశారు. యూఎస్ఏ, ఒమన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన సందర్భం చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బౌలింగ్ చేసిన ఒమన్ అమెరికా బ్యాటింగ్ చేసిన 35.3 ఓవర్లు స్పిన్నర్లతోనే బౌలింగ్ చేయించింది. అనంతరం అమెరికా సైతం ఒమన్ బ్యాటింగ్ చేసిన 25.3 ఓవర్లను స్పిన్నర్లతోనే వేయించింది. ఈ మ్యాచ్‌లో మొత్తం 61 ఓవర్లు జరగ్గా, అన్నింటినీ స్పిన్నర్లే వేశారు. వన్డే క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఈ మ్యాచ్లో మరో రికార్డు వరల్డ్ రికార్డు కూడా నమోదైంది. వన్డేల్లో అతి తక్కువ స్కోర్ను (122) డిఫెండ్ చేసుకున్న జట్టుగా అమెరికా సరికొత్త చరిత్ర సృష్టిం చింది. గతంలో ఈ రికార్డు భారత జట్టు పేరిట ఉండేది. 1985లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 125 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా కాపాడుకుంది. 40 ఏళ్ల తర్వాత యూఎస్ఏ ఇప్పుడు భారత్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టింది. ఇకఈ మ్యాచ్‌లో ఒమన్‌పైఅమెరికా 57పరుగుల తేడాతో గెలుపొందిం



ది. తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 35.3 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటైంది. యూఎస్ఏ ఇన్నింగ్స్‌లో మిలింద్ కుమార్ (47 నాటౌట్) టాప్ స్కోరర్గా నిలువగా, ఆండ్రియస్ గౌస్ (14), హర్మీత్ సింగ్ (10), ఆరోన్ జోన్స్ (16), సంజయ్ కృష్ణమూర్తి(16) రెండంకెల స్కోర్లు చేశారు. అనంతరం 123 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఒమన్ అమెరికా స్పిన్నర్ల దెబ్బకు 25.3 ఓవర్లలో 65 పరుగులకే చాప చుట్టేసింది. అమెరికా లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్ నోష్తుశ్ కెంజిగేఐదు వికెట్లు తీసి ఒమన్ పతనాన్ని శాశించాడు.

# ‘ఎక్స్’ ప్రీమియం ప్లస్ ధర డబుల్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 19:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ తన ప్రీమియం ప్లస్ ధరల్ని భారత్‌లో పెంచింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరల్ని ఏకంగా రెట్టింపు చేసింది. గత మూడు నెలల్లో ఈ ప్లాన్ ధరల్ని పెంచడం ఇది రెండో సారి. గ్రోక్ 3 ఎఐ మోడల్‌ను విడుదల చేసిన తర్వాత ప్లాన్ ధరల్ని పెంచడం విశేషం. మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ అంకుర సంస్థ ఎక్స్ఎఐ, గ్రోక్ 3 సేవల్ని తాజాగా అందు బాటులోకి తీసుకొచ్చింది. ఈ ఎఐ మోడల్ సామర్థ్యాలు వినియోగించాలంటే ఎక్స్‌లో ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుందని కంపెనీ లాంచింగ్ సమయంలో తెలిపింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్లాన్ ధరల్ని పెంచింది. ఇప్పటి వరకు ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధర భారత్‌లో నెలకు రూ.1,750 ఉండేది. తాజాగా దీన్నిరూ.3,470కి పెంచింది. ఇక యేడాది ప్లాన్ ధర రూ.18,300 నుంచి రూ.34,340కి పెంచింది. అంటే ధరల్ని దాదాపు రెట్టింపు చేసింది. తన ప్లాట్‌ఫామ్ ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఎక్స్ 2023 అక్టోబర్‌లోనే తొలిసారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. తొలుత ప్లాన్ ధర రూ.1300గా ఉండేది. ఆ తర్వాత గతేడాది డిసెంబరులో దాని ధరను రూ.1750కి పెంచింది. తాజాగా ఈ ధరను రూ.3,470కు చేర్చింది. ఇతర ప్లాన్ల ధరలను మాత్రం అలాగే ఉంచింది. ఎక్స్‌లో బేసిక్, ప్రీమియం, ప్రీమియం ప్లస్ పేరిట మూడు రకాల ప్లాన్లు అందిస్తోంది. బేసిక్ ప్లాన్ ధర ప్రస్తుతం నెలకు రూ.244గా ఉంది. ఇక ప్రీమియం ప్లాన్ ధర నెలకు రూ.650గా ఉంది. యాడ్-ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ ఆర్టికల్స్ రాసే సౌలభ్యం ప్రీమియం ప్లాన్లలో లభిస్తుంది.



# ఎల్ఐసి పెట్టుబడుల్లో రూ.84వేల కోట్లు హాంఫట్

**ముంబై, ఫిబ్రవరి 19:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా తమ విలువను కోల్పోయాయి. గరిష్టాల నుంచి 10 శాతానికిపైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ముఖ్యంగా విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) తరలిపోవడం, వాణిజ్య యుద్ధభయాలు వంటివి ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో దలాల్ స్ట్రీట్‌లో పెట్టుబడులు పెట్టిన వారి పోర్ట్‌ఫోలియోల్లో నిధులు కరిగిపోతున్నాయి. ప్రముఖ ఇన్వెస్టర్లుగా పేరొందిన టాప్-10 వ్యక్తుల పోర్ట్‌ఫోలియోలు రూ.81వేల కోట్ల విలువను కోల్పోయి, ఎల్ఐసి కూడా పెద్ద మొత్తంలో నష్టపోయింది. ఒకటిన్నర నెలలో ఏకంగా రూ.84వేలకోట్లు కోల్పోయింది. జీవిత బీమా సంస్థ అయిన ఎల్ఐసి లిస్టెడ్ కంపెనీల్లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. స్టాక్ మార్కెట్లో ఇటీవల కరెక్షన్ కారణంగా ఎల్ఐసి పెట్టుబడుల విలువ జనవరి 1 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.84వేల కోట్లు పడిపోయింది. గతేడాది డిసెంబర్ త్రైమాసికంలో ఎల్ఐసి హోల్డింగ్స్ విలువ రూ.14.72 లక్షల కోట్లుగా ఉంది. 2025 ఫిబ్రవరి 18 నాటికి ఆ విలువ రూ.13.87 లక్షట కోట్లకు చేరింది. అంటే మొత్తం స్టాక్ విలువ రూ.84,247 కోట్లు మేర హరించుకుపోయింది. 2024 డిసెంబరు నాటికి ఎల్ఐసి 330 కంపెనీల్లో ఒక శాతానికి పైగా వాటా కలిగి ఉంది. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల్లో మొత్తం మార్కెట్ విలువలో ఈ కంపెనీలే దాదాపు 66శాతం వాటా కలిగిఉన్నాయి. స్టాక్ మార్కెట్ నష్టాల నేపథ్యంలో ఆయా కంపెనీల షేర్ల విలువ క్రమంగా తగ్గుతోంది. ఎల్ఐసి పెట్టుబడులు పెట్టిన వాటిలో ఐటిసి రూ.11,863 కోట్లు, ఎల్అండ్‌టి రూ.6,713 కోట్లు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.5,647 కోట్లు వంటి ప్రధాన కంపెనీల్లో అధిక పెట్టుబడులున్నాయి. వీటితో పాటు టిసిఎస్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, హెచ్‌సిఎల్‌టెక్నాలజీస్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐడిబిఐ బ్యాంకుల్లోనూ ఎల్ఐసి పెట్టుబడులు పెట్టింది.

# ఏప్రిల్ నుంచే భారత్‌లో టెస్లా కార్ల సేల్స్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** అమెరికా దిగ్గజ ‘ఇవి’ కంపెనీ టెస్లా, భారత్‌లో అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఈ సంస్థ ఇక్కడ నియామకాలు ప్రారంభించిన విషయం విదితమే. షోరూంల ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇక ఈ యేడాది ఏప్రిల్ నుంచి భారత మార్కెట్లో టెస్లా ‘ఇవి’ విక్రయాలు ప్రారంభం కానున్నట్లు తాజాగా కొన్ని కథనాలు వెలువడ్డాయి. వీటి ప్రారంభ ధర రూ.21 లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి కంపెనీ రిటైల్ కార్యకలాపాలను మాత్రమే ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కొన్ని కథనాలు వెల్లడించాయి. జర్మనీలోని బెర్లిన్ ప్లాంట్ నుంచి ‘ఇవి) కార్లను దిగుమతి చేసుకుని భారత్ మార్కెట్లో విక్రయించేందుకు టెస్లా సన్నాహాలు ప్రారంభించినట్లు తెలిసింది. షోరూంల ఏర్పాటు కోసం ముంబైలోని బికెసి బిజినెస్ డిస్ట్రిక్ట్, న్యూఢిల్లీలోని ఏరోసిటీ ప్రాంతాలకు ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. తొలుత 25వేల డాలర్ల వరకు విలువ చేసే ఎలక్ట్రిక్ వాహనాలను టెస్లా విక్రయించనున్నట్లు కూడా తెలిసింది. ప్రస్తుతానికి భారత్‌లో ‘ఇవి’ల తయారీపై టెస్లా ఇంకా ఎలాంటి స్పష్టతనివ్వలేదు. అయితే భారత ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారుల నుంచి విడిభాగాలను కొనుగోళ్లను మరింత పెంచుకోవాలని కంపెనీ ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపింది.



## వాణిజ్యం

# వడ్డీరేట్లను సవరించిన డిసిబి బ్యాంకు

**ముంబై, ఫిబ్రవరి 19:** ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన డీసీబీ బ్యాంక్ కొన్ని కాలపరి మితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 65 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. సవరిం చిన రేట్లు అమల్లోకివచ్చాయి. ఫిబ్రవరి ఎంపీసీ సమావేశం 2025లో ఆర్‌బీఐ తన రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.50శాతం నుండి 6.25 శాతానికి తగ్గించాలని నిర్ణయించాక ఎఫ్‌డీ రేట్లలో సవరణ వచ్చింది. ఐదేళ్ల తర్వాత బెంచ్‌మార్క్ లెండింగ్ రేటులో మొదటి సారి కోత విధించారు. రెపో రేటు తగ్గుదల బ్యాంకుల నిధుల ఖర్చును తగ్గిస్తుంది. కాబట్టి రుణాలు, డిపాజిట్ రేట్లు ప్రభావితమవుతాయి. రెపో రేటు తగ్గడం వల్ల బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు తగ్గిస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో డీసీబీ బ్యాంకు తాజా వడ్డీరేట్ల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. డీసీబీ బ్యాంక్ ప్రస్తుతం 7రోజుల నుండి 10 సంవత్సరాల వరకు టెన్యూర్‌కు అనుగుణంగా రూ. 3కోట్ల కంటే తక్కువ ఎఫ్‌డీలపై సాధారణ పౌరులకు 3.75 శాతం నుంచి 8.05 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది. 19 నుండి 20 నెలల వ్యవధి కలిగిన ఎఫ్‌డీలకు అత్యధిక వడ్డీ రేటు 8.05 శాతం అందిస్తుంది. రూ.3కోట్ల లోపు డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 4.25 శాతం నుంచి 8.55 శాతం వరకు వడ్డీరేట్లను అందిస్తుంది. 19నుంచి 20 నెలల టెన్యూర్ డిపాజిట్లకు అయితే 8.55 శాతం వడ్డీను అందిస్తుంది. అలాగే సాధారణ పౌరులకు 26 నెలల కంటే ఎక్కువ కానీ 37 నెలల కంటే తక్కువ కాలపరిమితి ఉన్న ఎఫ్‌డీ వడ్డీ రేటును 55 బేసిస్ పాయింట్లు తగ్గించారు. అంటే 8.05 శాతం నుంచి 7.50 శాతానికి తగ్గించారు. 37 నుంచి 38 నెలల మధ్య కాలపరిమితితో వచ్చే ఎఫ్‌డీల వడ్డీరేటును 8.05శాతం నుంచి 7.85శాతానికి తగ్గించారు. అదనంగా డీసీబీబ్యాంక్ 38నెలల కంటే ఎక్కువ కానీ 61 నెలల కంటే తక్కువ కాలపరిమితి ఉన్న ఎఫ్‌డీ వడ్డీరేటును 65 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అంటే 8.05 శాతం నుంచి 7.40 శాతానికి తగ్గాయి.




# 5% ప్రీమియంతో హెక్సావేర్ టెక్నాలజీస్ లిస్టింగ్

**ముంబై, ఫిబ్రవరి 19:** ఐటి సేవల సంస్థ హెక్సావేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ షేర్లు బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. ఐటి సెక్టార్‌లో అతిపెద్ద ఐపిఓగా వచ్చిన ఈ కంపెనీ షేర్లు దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.708తో పోలిస్తే ఎన్ఎస్ఇలో 5శాతం ప్రీమియంతో రూ.745.50 వద్ద లిస్టయ్యాయి. ఇన్వెస్టర్లకు స్వల్ప లాభాల్ని తెచ్చిపెట్టాయి. ఇక బిఎస్ఇలో రూ.731 వద్ద ప్రారంభమయ్యాయి. ముంబై కేంద్రంగా సేవలందిస్తున్న హెక్సావేర్ టెక్నాలజీస్ రూ.8,750 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. ఈ ఐపిఒను పూర్తి ఆఫర్ ఫర్ సేల్‌లో నిర్వహించింది. ధరల శ్రేణిని రూ.674-708గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ మొత్తంగా 2.66 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 9.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అవ్వగా, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కోటా 0.20శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 0.11 రెట్లు మాత్రమే సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఐటి సెక్టార్‌లో అతిపెద్ద ఐపిఒ ఇదే కావడం విశేషం. రెండు దశాబ్దాల క్రితం టిసిఎస్ రూ.4,700 కోట్లు పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించింది.



# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య ఉదయం నష్టాలతో ట్రేడింగ్ మొదలుపెట్టిన సూచీలు, ఒడుదుడులకు లోనయ్యాయి. రోజంతా లాభనష్టాల మధ్య చలించిన సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిసాయి. ఉదయం 75,787.27 పాయింట్ల వద్ద నష్టంతో ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు, ఇంట్రాడేలో 75,581 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. చివరికి 28 పాయింట్లు తగ్గి 75,939పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 12 పాయింట్లు నష్టపోయి 22,932 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇన్ఫోసిస్, టిసిఎస్, హిందుస్థాన్ యూని లీవర్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఎన్‌టిపిసి, టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంకు వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.30 డాలర్ల వద్ద ట్రేడయింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps